14-3Pg1exHMNWJQE.qxd:14-3Pg1exHMNWJQE.qxd 01/01/01 9:40 AM Page 1

వాయిస్
గత వారంరోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఒంగోలు,
: fb.com/vaartha Digital

బడ్జెట్ పత్రాలపై రూపాయి గుర్తు మార్చిన స్టాలిన్ 9లో

మే 20న నిసార్ ఉపగ్రహ ప్రయోగం

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-3-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 41 పేజీలు: 12 వెల: 6.50


గురువారం మంత్రి లోకేశ్ సమక్షంలో మైక్రోసాఫ్ట్, ఏపిఎస్ఎస్‌డీ మధ్య ఎంవోయూ చేసుకుంటున్న దృశ్యం

## మైక్రోసాఫ్ట్‌తో కీలక ఒప్పందం

### ఒక్క యేడాదిలో 2 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ

### విద్యాసంస్థలలో ఎఐ పాఠ్యాంశాలు: మంత్రి లోకేష్

**విజయవాడ, మార్చి13, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని యువతకు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ), అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యాభివృద్ధి కోసం అంతర్జాతీయస్థాయి ప్రఖ్యాత సంస్థ మైక్రోసాఫ్ట్‌తో ఎపి ప్రభుత్వం కీలకమైన ఒప్పందంచేసుకుంది. అమరావతి సచివాలయంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ సమక్షంలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎస్‌డిసి) అధికారులు ఎంఓయుపై సంతకాలు చేశారు.

**ఏడాదిలో 2 లక్షల మందికి శిక్షణ**

వృత్తి విద్య, మాధ్యమిక పాఠశాల పిల్లలు, యువతలో ఏఐ, అధునాతన సాంకేతిక >>2


# సౌర విద్యుత్‌లో అద్భుతాలు

### • 7,700 మె.వా ఉత్పత్తి చేసిన మొదటి రాష్ట్రం • గత ప్రభుత్వంలో రూ. 32 వేల కోట్ల భారం వేశారు • యూనిట్ కొనుగోలు వ్యయం రూ. 4.80కి తగ్గిస్తాం • 20 యేళ్లు ఉచితంగా విద్యుత్ వచ్చే పరిస్థితి • అసెంబ్లీలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్తురంగంలో తొలి సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా విద్యుత్ వినియోగం ఆధారంగానే ప్రజల అభివృద్ధిని లెక్కిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఎపి శాసనసభలో విద్యుత్ రంగంపై చర్చలో సిఎం మాట్లాడుతూ కొన్నేళ్లుగా విద్యుత్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తే ప్రపంచబ్యాంకు జీతగాడని అవహేళన చేశారన్నారు. అప్పుడే డిస్కమ్‌లు, నియంత్రణ మండలి, ఎనర్జీ ఆడిటింగ్ అనేది మొదలు పెట్టామన్నారు. గతంలో ట్రాన్స్‌మిషన్ నష్టాలు 23 శాతం అని, దేశంలో తొలిసారి నిర్ధారించింది కూడా ఎపినేనని సిఎం అన్నారు. విభజన తర్వాత కరెంటు కోతలు లేని రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దామన్నారు.

గతంలో కరెంటు కోతల సమయంలో రైతుల అవస్థలు ప్రత్యక్షంగా పరిశీలించానని.. రైతుల ఇబ్బందులు చూసాక పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తే ప్రపంచ బ్యాంకు జీతగాడని అవహేళన చేశారన్నారు. అప్పుడే డిస్కమ్‌లు, నియంత్రణ మండలి, ఎనర్జీ ఆడిటింగ్ అనేది మొదలు పెట్టామన్నారు. గతంలో ట్రాన్స్ మిషన్ నష్టాలు 23 శాతం అని దేశంలో తొలిసారి నిర్ధారించింది కూడా ఎపినే అని అన్నారు. విభజన తర్వాత కరెంటు కోతలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దామని తెలిపారు. టిడిపి హయాంలో చేసిన విద్యుత్ సంస్కరణలు వాడుకుని అప్పట్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఎన్టీపీఎస్ లాంటి ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను 83 శాతం పిఎల్‌ఎఫ్‌తో నడిపించామన్నారు. చాలా ప్రైవేటు సంస్థలకూ అది సాధ్యం కాదని.. ఈ పరిపాలనా మార్పులు ప్రజలు గుర్తించాలన్నదే తమ అభిప్రాయమన్నారు.

గత 30 ఏళ్ల పాలనా సమయాన్ని బేరీజు వేసుకుంటే వాస్తవాలు వెలుగు చూస్తాయని తెలిపారు. విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఉన్న ఎపిని లోటు పరిస్థితికి తీసుకెళ్లింది వైఎస్సార్సీ ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. పరిశ్రమలు కరెంటు వాడితే సర్చార్జి విధించిన పరిస్థితి గత ప్రభుత్వానిదన్నారు. 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత రాష్ట్ర విభజన సమయంలో ఉందన్నారు. 2018 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దామని తెలిపారు. ఎపిలో తలసరి విద్యుత్ వినియోగం



23 శాతం మేర పెరిగిందన్నారు. సౌర, పవన విద్యుత్‌ను 7700 మెగావాట్లు మేర ఉత్పత్తి చేసిన మొదటి రాష్ట్రం ఎపినే అని చెప్పుకొచ్చారు. అయితే 2019-24లో అసమర్థ పాలన వల్ల రాష్ట్రంలో మళ్లీ చీకటి రోజులు వచ్చాయన్నారు. ఆలోచన లేకుండా వైఎస్సార్సీ పిపిఎలను రద్దు చేసేసిందన్నారు. పిపిఎల రద్దు విషయం అంతర్జాతీయ అంశంగా మారిపోయిందన్నారు. దావోస్ లాంటి చోటకూడా పిపిఎలను రద్దు చేయ >>2

# రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

### • రూ. 1,21,659 కోట్లతో 10 కొత్త ప్రాజెక్టులు • 80,104 మందికి ఉద్యోగ అవకాశాలు • 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు • 5 చోట్ల రతన్‌టాటా ఇన్నోవేషన్ కేంద్రాలు • సిఎం చంద్రబాబు అధ్యక్షతన 4వ ఎస్ఐపిబి సమావేశం


గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 4వ ఎస్ఐపిబి సమావేశ దృశ్యం

**విజయవాడ, మార్చి 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వంపై అత్యంత నమ్మకంతో దిగ్గజ పారిశ్రామిక సంస్థలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడుల విషయంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన, ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టుల పురోగతిపై నిత్యం పరిశీలించాలన్నారు. దీని కోసం ట్రాకర్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సిఎం ఆదేశించారు. గురువారం సచివాలయంలో తన అధ్యక్షతన జరిగిన 4వ ఎస్ఐపిబి సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్రానికి కొత్తగా వస్తున్న పెట్టుబడుల ప్రతిపాదనలను పరిశీలించారు. పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకం వంటి రంగాల్లో మొత్తం 10 సంస్థలు రూ.1,21,659 కోట్లు పెట్టుబడులు ముందుకు రాగా ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 80,104 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి.

అలాగే, గత మూడు ఎస్ఐపిబి సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టులు, వాటి పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎఈ పార్క్ చొప్పున మొత్తం 175 నియోజవకర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా మొదట జిల్లాకు ఒకటి చొప్పున 26 జిల్లాల్లో తక్షణం 26 ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను నెలరోజుల్లోగా రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో 5 సెంటర్లు నెలకొల్పాలని చెప్పారు. పెట్టుబడులు గ్రౌండ్ అయ్యే వరకు ఆయా సంస్థల వెనుకపడాలని.. నిరంతరం ఫాలోఅప్ చేయాలని సిఎం సూచించారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు... క్షేత్ర స్థాయిలో ఆయా ప్రాజెక్టులు పనులు మొదలు పెట్టేలా చూడాలన్నారు. ఈ విషయంలో అటు మంత్రులు, ఇటు అధికారులు మరింతవేగంగా పని చేయాలని సిఎంసూచించారు. అప్పుడే ప్రతి ఏడాది ప్రగతి, ఫలితం కనిపిస్తుందని సిఎం అభిప్రాయపడ్డారు. 4వ ఎస్ఐపిబి ఆమోదం తెలిపిన సంస్థల వివరాలు ఇలా ఉన్నాయి. ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్, నాయుడుపేటలో రూ.1,742 కోట్ల పెట్టుబడులు పెడుతుంది. 2,000 ఉద్యో >>2

# వర్సిటీల్లో అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ

### ఎయులో అవకతవకలపై నివేదిక రాగానే కఠిన చర్యలు: మంత్రి లోకేష్

**విజయవాడ మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలోని వర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉంటాయని మంత్రి నారాలోకేశ్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అక్రమాలపై అసెంబ్లీ ప్రశ్నోతరాల్లో చర్చ జరిగింది. వైఎస్సార్సీ ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు జరిగాయని టిడిపి, బిజెపి, జనసేన ఎమ్మెల్యేలు సభదృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై టిడిపి ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్ వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడారు. అనంతరం మంత్రి లోకేశ్ వారికి సమాధానమిచ్చారు. ఏయూలో అక్రమాలపై విజిలెన్స్ జరిపిస్తామని స్పష్టం చేశారు. ఇన్‌చార్జ్ వీసీ ఇప్పటికే విచారణకు ఆదేశించారన్నారు. ఆ విచారణ నివేదిక రాగానే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9నెలలు అవుతున్నా ఇంకా ఉపేక్షించడం తగదన్నారు. నిర్దిష్ట కాలపరిమితితో విచారణను వేగవంతం చేయాలని ఆయన కోరారు. మరో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ గతంలో వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి వైఎస్సార్సీ అధ్యక్షుడి తరహాలో వ్యవహరించారని ఆరోపించారు. ఎంతో పేరున్న ఎయును రాజకీయ వేదికలా ఆయన మార్చారని ఆక్షేపించారు. ఇతర వర్సిటీల ప్రక్షాళన కూడా జరగాలని జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు.

గత ప్రభుత్వ హయాంలో ఏయూలో అనేక అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. సభ్యుల ప్రశ్నలకు విద్యామంత్రి నారాలోకేష్ స్పందిస్తూ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్లు, ప్రిన్సిపాళ్లను నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగించడం వంటి తీవ్రమైన అభియోగాలు నాటి వైస్ ఛాన్సలర్‌పై వచ్చాయని తెలిపారు. గౌరవ సభ్యుల విజ్ఞప్తి మేరకు 60 రోజుల్లో విజిలెన్స్ ఎంక్వయిరీ పూర్తిచేసి, నివేదికను ప్రభుత్వానికి పంపించాలని ఈ సందర్భంగా లోకేశ్ ఆదేశించారు. విజిలెన్స్ నివేదికను గౌరవసభ్యులకు అందించే బాధ్యత తనే తీసుకుంటానని స్పష్టం చేశారు. రిపోర్టు వచ్చిన వెంటనే వర్సిటీలో అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. తప్పు చేసిన ఎవరినీ ఉపేక్షించేది లేదు, మరోసారి పొరపాటు చేయాలంటే భయపడేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి లోకేశ్ ఈ సంర్భంగా హెచ్చరిం >>2


విద్యార్థుల ముందు సాష్టాంగ నమస్కారం చేస్తున్న ఉపాధ్యాయుడు

## కొట్టం.. తిట్టం!

### గుంజీలు తీసి, విద్యార్థుల ముందు మోకరిల్లిన ఉపాధ్యాయుడు

**బొబ్బిలి (విజయనగరం జిల్లా) మార్చి 13 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వింత సంఘటన, ఆసక్తికరమైన సన్నివేశం జరిగింది. నిబంధనల ప్రకారం మిమ్మల్ని కొట్టం... తిట్టం...ఇకపై అంతా మీ తల్లిదండ్రులదే బాధ్యత అంటూ ఓ ఉపాధ్యాయుడు విద్యార్థుల ముందు మోకరిల్లాడు...అంతేకాదు..క్షమించండి మహాప్రభో అనే తరహాలో గుంజీలు కూడా తీశాడు..ప్రస్తుతం ఈ సంఘటన జిల్లాలోనే కాదు... రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులను క్రమశిక్షణగా ఉంచాలే తప్పించి డిసిప్లిన్ పేరిట భౌతికంగా ఎలాంటి చర్యలూ తీసుకో >>2

## తిరుమలలో ఏమిటా నిర్మాణాలు?

### పుణ్యక్షేత్రాన్ని 'కాంక్రీట్ జంగిల్' కానివ్వకండి

### నిబంధనలు కచ్చితంగా పాటించాలి

### మఠాల అక్రమ నిర్మాణాలపై హైకోర్టు ఆగ్రహం



**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రసిద్ధిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమలకొండపై ధార్మికసంస్థలు, మఠాల పేరుతో నిబంధనలు ఉల్లంఘించి ఎత్తయిన భవనాలు (మఠాలు) నిర్మిస్తే మంచిదికాదని హైకోర్టు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుమలకు వస్తున్న భక్తులకు వసతి కల్పన పేరుతో దాదాపు దేశంలోని అన్ని మఠాధిపతులు, పీఠాధిపతుల ఆధ్వర్యంలో 40వరకు మఠాలు ఇక్కడ వ్యాపారం చేస్తు న్నాయి. మఠాల పేరుతో చేపట్టిన అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని టిటిడి అధికారులను ఆదేశించింది. పుణ్యక్షేత్ర పవిత్రతను, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడటంలో న్యాయస్థానం జోక్యం ఉంటుందని తెలిపింది. అంతేగాక ఇప్పటికే ఓ మఠం ఏకంగా రాజకీయంగా నిబంధనలు ఉల్లంఘించి ఎత్తయిన భవనాలు నిర్మాణం చేయడంపై చర్యలకు ఆదేశించామని హైకోర్టు ధర్మాసనం గుర్తుచేసింది. తిరుమలలో నిబంధనలు ఉల్లంఘించిన మఠాలకు నోటీసులు జారీచేయాలని టిటిడిని ఆదేశాలిచ్చింది. అనుమతులు లేకుండా ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నా టిటిడి పట్టించుకోవడంలేదని తిరుపతికి చెందిన మహేశ్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం పుణ్యక్షేత్రం తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చేస్తే చూస్తూ ఊరుకోబోమని, నిబంధనలు పాటించనిమఠాలపై చర్యలుతీసుకుంటామని తీవ్రస్థాయిలో మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన మఠాలపై చర్యలు తీసుకోవాలని ఏకంగా దేవాదాయశాఖ కార్యదర్శి, టిటిడి విజి >>2

## యుద్ధభూమిలో పుతిన్ పర్యటన

**మాస్కో, మార్చి 13:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తొలిసారి యుద్ధభూమిలో పర్యటించారు. పశ్చిమరష్యాలోని కర్స్క్‌లో ఆయన ఆకస్మిక పర్యటనచేసారు. ఈ ప్రాంతంలోని కొంతభూభాగం ఉక్రెయిన్ దళాలు స్వాధీనంచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోపుతిన్‌పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. కర్స్క్‌లోనిరష్యాదళాల కంట్రోల్ సెంటర్‌కు అధ్యక్షుడు వెళ్లారు. యుద్ధభూమిలోని పరిస్థితులను రష్యన్‌జనరల్ స్టాఫ్ హెడ్ వలేరీ జెరసిమోవ్ పుతిన్‌కు వివరించారు. కొంతమంది ఉక్రెయిన్‌సేనలు తమకు లొంగిపోయినట్లు తెలిపారు. వీలైనంత సత్వరమే ఈప్రాంతంనుంచి క్యీవ్ దళాలను తరిమికొట్టాలని పుతిన్ ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే యుద్ధంలో 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరించారు. ఈ ప్రతిపాదనపై చర్చించేందుకు అమెరికా ప్రతినిధులు రష్యా బయలుదేరారు.

# 'స్పేస్ అన్ డాకింగ్' సఫలం


షార్ నుంచి ప్రయోగించిన స్పేడెక్స్ ఉపగ్రహాలు అంతరిక్షంలోకి చేరినప్పటి దృశ్యం

### అంతరిక్షంలో అరుదైన ఘనత

### 56 రోజుల తర్వాత పూర్తిగా అనుసంధానం విజయవంతం

### అమెరికా, రష్యా, చైనాల తర్వాత మనమే

### స్పేస్ స్టేషన్, చంద్రయాన్-4, గగన్‌యాన్‌లకు మార్గం సుగమం

### శాస్త్రవేత్తలను అభినందించిన జితేంద్రసింగ్

**శ్రీహరికోట (తడ), మార్చి 13 ప్రభాతవార్త:** ఇస్రో తన పరిశోధనలతో మరోసారి సూపర్ అనిపించుకుంది. గత ఏడాది డిసెంబర్ 30న మన తెలుగు నేల శ్రీహరికోట నుంచి పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్ ద్వారా ప్రయోగించిన రెండు స్పేడెక్స్ ఉపగ్రహాల అన్‌డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసుకుంది. 56 రోజుల పరిశోధనల తర్వాత గురువారం ఈ ఘనత ఇస్రో సొంతమైంది. రాకెట్ ప్రయోగం జరిగిన అనంతరం రెండు ఉపగ్రహాలను ఒక్క చోటికి చేర్చడం, వాటి అనుసంధానం, >>2

# ఇంటర్ విద్యలో కీలక మార్పులు: మంత్రి లోకేష్

**ప్రభాతవార్త ప్రతినిధి, విజయాడ :** ఇంటర్‌మీడియట్ విద్యలో ప్రభుత్వం కీలక మార్పులు తీసుకువచ్చింది. ఈమేరకు విద్యాశాఖామంత్రి నారా లోకేష్ అధ్యక్షతన గురువారం ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ 77వ సమావేశం అసెంబ్లీలోని పేషీలో నిర్వహించారు. ప్రవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను తయారు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చె విద్యాసంవత్సరం నుండి క్యాలండర్‌లో మార్పులు తెచ్చారు. జూన్ 1వతేదీకి బదులుగా ఏప్రిల్ 1వతేదీనుండి జూనియర్ కళాశాలలు ప్రారంభం అవుతాయి. ఏప్రిల్ 7వతేదీ నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్దులకు అడ్మిషన్‌ల ప్రక్రియ చేపడతారు. ఇంటర్ విద్యార్దులకు వచ్చె ఏడాది నుండి వార్షిక పరీక్షలను ముందుకు జరిపి ఫిబ్రవరి చివరివారంలో నిర్వహిస్తారు. ప్రజల డిమాండ్ మేరకు ఈఏడాది నుండి యం.బైపిసి కోర్సును ప్రవేశపెడుతున్నారు. ఇందులో గణితం, బైయాలజీలతో పాటు మొత్తం 6సబ్జెక్టులతో యం.బైపిసి కోర్సును ప్రవేశపెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్దులకు 14సబ్జెక్టులకు సవరించిన సిలబస్‌తో కొత్త పాఠ్యపుస్తకాలు ఈసంవత్సరం నుండి అమలులోకి వస్తాయి. ఇంటర్‌లో రెండు సబ్జెక్టులుగా పరిగణిస్తున్న మాథ్స్ ఏ,బిలకు ఒకేసబ్జెక్టుగా విలీనం చేసారు. బైపిసి విద్యార్దులకు జంతుశాస్త్రం, వృక్షశాస్త్రంలను ఒకేసబ్జెక్టుగా మార్పుచేసారు. త్రిపుల్ఐటి, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్దులను తయారు చేసేందుకు గానూ కోచింగ్ మెటీరియల్‌ను ఇంటర్‌మీడియట్ బోర్డు రూపొందించి ప్రభుత్వ కళావాల విద్యార్దులకు ఉచితంగా అందచేస్తారు. విద్యార్దులకు నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఈసందర్భంగా నారా లోకేష్ దిశానిర్దేశం చేసారు

14-3pg2exHMNWJQE.qxd:14-3pg2exHMNWJQE.qxd 01/01/01 9:37 AM Page 1





గురువారం న్యూఢిల్లీలో 'ఆశాకిరణ్ హోం' బాలలతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్న ఢిల్లీ సిఎం రేఖా గుప్త

# పెట్టుబడుల వెల్లువ

>> గాలు. లభిస్తాయి దాల్మియా సిమెంట్ కడప జిల్లా రూ.2,883 కోట్ల పెట్టుబడులు పెడుతుంది. 354 ఉద్యోగాలు లభిస్తాయి. లులూ గ్లోబల్ ఇంటర్నేషనల్ విశాఖపట్నంలో రూ. 1,500 కోట్ల పెట్టుబడులు పెడుతుంది. సత్యవీడు రిజర్వ్ ఇన్ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీసిటీ - రూ. 25,000 కోట్ల పెట్టుబడులు పెడుతుంది.50,000 ఉద్యోగాలు లభిస్తాయి. ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.58,469 కోట్ల పెట్టుబడులు పెడుతుంది. 13,050 ఉద్యోగాలు అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,175 కోట్లు ఇన్వెస్ట్ చేస్తోంది 1,500 ఉద్యోగాలు లభిస్తాయి. ఏపీ ఎన్జీఈఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్‌అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో రూ.22,000 కోట్ల పెట్టుబడులు పెడుతుంది.8,300 ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అన్నమయ్య, కడప జిల్లాలు లో రూ.8,240 కోట్లు పెట్టుబడులు పెడుతుంది. 4,000 ఉద్యోగాలు లభిస్తాయి.మేఫెయిర్ బీచ్ రిసార్ట్స్, కన్వెన్షన్ రూ. 400 కోట్ల పెట్టుబడులు పెడుతుంది. 750 ఉద్యోగాలు కల్పనకు అవకాశం లభిస్తుంది.ఒబేరేయ్ విలాస్ రిసార్ట్ రూ. 250 కోట్ల పెట్టుబడులు పెడుతుంది. 150 ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి..గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు ఇలా ఉన్నాయి. మొదటి ఎస్ఐపీబీ సమావేశంలో విద్యుత్ రంగంలో రూ.11,902 కోట్లు, ఇతర రంగాల్లో రూ.72,085 కోట్లు. మొత్తం రూ. 83,987 కోట్లు ఆమోదం తెలిపింది. దీంతో 29,585 మందికి ఉద్యోగ అవకాశాలు. రెండవ ఎస్ఐపీబీ సమావేశంలో విద్యుత్ రంగంలో రూ.83,000 కోట్లు, ఇతర రంగాల్లో రూ.99,162 కోట్లు.మొత్తం రూ. 1,82,162 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ పెట్టుబడులతో 2,63,411 మందికి ఉద్యోగ అవకాశాలు. మూడవ ఎస్ఐపీబీ సమావేశంలో విద్యుత్ రంగంలో రూ.42,932 కోట్లు, ఇతర రంగాల్లో 1,844 కోట్లు.మొత్తం రూ. 44,776 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వీటి రాకతో 19,580 ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటివరకు నాలుగు ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.4,32,584 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా మొత్తం 3,92,680 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.



గురువారం తెలంగాణ మాజీ మంత్రి జనార్ధన్ రెడ్డి సిఎం చంద్రబాబుతో భేటీ అయిన దృశ్యం

# నాగం గారూ.. ఎలా ఉన్నారు?

## తెలంగాణ మాజీ మంత్రి జనార్ధన్ రెడ్డికి సిఎం చంద్రబాబు ఆత్మీయ పలకరింపు

**విజయవాడ, మార్చి 13,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి ఎపి సిఎం చంద్రబాబు నాయుడును అసెంబ్లీలో కలిశారు. చాలాకాలం తరువాత తనను కలిసిన నాగంను సిఎం చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. నాగం గారూ...ఎలాఉన్నారు.. ఆరోగ్యం ఎలాఉంది.. చాలా రోజులు అయ్యింది కలిసి అంటూ పలకరించారు. పిల్లలు ఏం చేస్తున్నారు అని ఆరా తీశారు. నాగం కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్న చంద్రబాబు.. ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయనకు సూచించారు. ఓబులాపురం మైనింగ్ అంశంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం నేతలు చేసిన ఉద్యమాలపై నాడు కేసులు నమోదు అయ్యాయి. ఆ కేసుల విచారణలో భాగంగా విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టుకు నాగం జనార్ధన్ రెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి అసెంబ్లీలోని సిఎం ఛాంబర్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనాటి కేసులను ఎట్టకేలకు కొట్టివేయడంపై చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు పాత ఘటనలను గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడుచేసిన ప్రజా పోరాటాలను గురించి చర్చించుకున్నారు. నాగం ఫైర్ బ్రాండ్‌గా ఉండేవారని.. పార్టీ ఆదేశిస్తే దూసుకుపోయేవాళ్లని ఈ సందర్భంగా సిఎం అన్నారు. ఎంతో ఎమోషన్‌గా ఉండేవారంటూ నాటి ఘటనలను ప్రస్తావించారు. నాలుగవసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని నాగం ఈ వ్యాఖ్యానించారు. రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలి.. తెలుగు ప్రజలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలనేదే తన అభిమతమని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

# 'స్పేస్ అన్ డాకింగ్' సఫలం

>> అనంతరం మళ్లీ విడిపోయి క్షేమంగా కక్ష్యకు చేరడం వంటి పరిశోధనలు ఇస్రో శాస్త్రవేత్తలు ఇన్ని రోజులుగా చేపట్టారు. భూకేంద్రాల నుంచి ఈ కార్యక్రమం కొనసాగించారు. ఇస్రోకు చెందిన వివిధ సెంటర్లతో పాటు మనకు సమీపంలోని కొన్ని అంతరిక్ష పరిశోధన భూకేంద్రాల సహకారం కూడా తీసుకున్నారు. గురువారం ఈ అన్‌డాకింగ్ కార్యక్రమం విజయవంతమై ఉపగ్రహాలు క్షేమంగా కక్ష్యకు చేరిన దృశ్యాలను ఆన్‌బోర్డు కెమెరాలు చిత్రీకరించాయి. ఈ అన్‌డాకింగ్ దృశ్యాలు ఇస్రో ఎక్స్‌లో విడుదల చేసింది. కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. భవిష్యత్‌లో భారత అంతరిక్ష పరిశోధనలు, కీలక ప్రయోగాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

**సోమనాథ్ ఆధ్వర్యంలో ప్రయోగం.. నారాయణన్ నాయకత్వంలో పరిశోధన**

గత ఏడాది డిసెంబర్ 30న శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్ ద్వారా స్పేడెక్స్-1, స్పేడెక్స్-2 ఉపగ్రహాలను ఇస్రో అంతరిక్షంలోకి పంపించింది. 440 కిలోగ్రాముల బరువైన ఈ ఉపగ్రహాలను కొంచెం దూరంగా కక్ష్యలోకి రాకెట్ ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి విభిన్న పరిశోధనలు మొదలయ్యాయి. ప్రయోగం జరిగిన సమయంలో ఇస్రో ఛైర్మన్‌గా ఎస్.సోమనాథ్ ఉన్నారు. అనంతరం అంతరిక్షంలోని ఉపగ్రహాలను దగ్గరకు చేర్చే ప్రక్రియ దాకా సోమనాథ్ భూకేంద్రాల నుంచి పరిశోధనలు చేపట్టారు. ఆ తర్వాత ఆయన నుంచి ఇస్రో ఛైర్మన్‌గా వి.నారాయణన్ బాధ్యతలు చేపట్టారు. కొత్త ఛైర్మన్ ఆధ్వర్యంలో అన్‌డాకింగ్ ప్రక్రియను క్రమక్రమంగా చేసుకుపోయారు. ఇది గురువారం నాటికి ఫలించింది. ఈ ఉపగ్రహాల అన్‌డాకింగ్ తర్వాత ఇస్రోకు భవిష్యత్ ప్రయోగాలపై పూర్తి నమ్మకం ఏర్పడింది. టార్గెట్, ఛేజర్ అనే రెండు ఉపగ్రహాలు ఇందులో భాగం కాగా, వాటిని స్పేడెక్స్ జంట ఉపగ్రహాలుగా పేర్కొంటున్నారు. ఉపగ్రహాలు రెండూ ఒకచోట అనుసంధానం కావడం, మళ్లీ అవి విడిపోవడం, ఇప్పటిదాకా క్షేమంగా పనిచేయడం వంటి కార్యక్రమాలు ఇస్రో పరిశోధనలకు గీటురాయిగా నిలుస్తున్నాయి. 56 రోజుల పాటు ఈ ఉపగ్రహాల్లో ఇంధనం పనిచేయడం, అందులోని ఉపకరణాలు క్షేమంగా తమ కార్యక్రమాలను ముగించడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో సంబరాలు అంబరాన్నంటాయి.

**స్పేస్ స్టేషన్ నిర్మాణానికి దారి**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అంతరిక్షంలో తమకు ప్రత్యేకంగా ఒక స్పేస్ స్టేషన్ నిర్మించుకోవాలని ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టింది. స్పేస్ స్టేషన్ నిర్మాణానికి స్పేడెక్స్ ఉపగ్రహాల అనుసంధానం, విడిపోవడం కార్యక్రమాలు ఎంతో ఊతమిచ్చాయి. ఇకపై స్పేస్ స్టేషన్‌లో మనం ప్రయోగించిన ఉపగ్రహాలను క్రమంగా ఒకచోటికి చేర్చి పరిశోధనలు చేసుకునే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. దీనికితోడు కీలకమైన గగన్‌యాన్, చంద్రయాన్-4 ప్రయోగాలకు కూడా ఈ అన్‌డాకింగ్ ప్రక్రియ తర్వాత శాస్త్రవేత్తలకు ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. మొత్తంమీద అంతరిక్షంలో అన్‌డాకింగ్ ప్రక్రియ విజయవంతం కావడంతో స్పేస్‌లో మనకు గట్టి స్థానం ఏర్పడిందని స్పష్టమవుతోంది.

# ఐదుగురు ఎమ్మెల్సీలు ఏకగ్రీవ ఎన్నిక



నాగబాబు



బీద రవిచంద్ర



బిటి నాయుడు



కావలి గ్రీష్మ



సోము వీర్రాజు

**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో శాసనసభ్యుల కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు మొత్తం ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ గురువారం సాయంత్రంతో ముగిసింది. దీంతో బరిలో ఉన్న కొణిదల నాగేంద్రబాబు (జనసేన), బీద రవిచంద్ర (టిడిపి), బి.తిరుమల నాయుడు (టిడిపి), కావలి గ్రీష్మ ప్రసాద్ (టిడిపి), సోము వీర్రాజు (బిజెపి) ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణి ప్రకటించారు. ఎన్నికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎపి శాసనమండలికి అయిదు స్దానాలకు ఎంఎల్ఎ కోటాను ఎంఎల్‌సీలను ఎన్నికోవాల్సి ఉంది.దాంతో ఈ అయిదు స్దానాలకు అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షాలు నామినేషన్స్ దాఖలు చేసాయి.ఎన్డీఏలో కీలక పక్షమైన టీడీపీ సిటింగ్ ఎంఎల్‌సీ బిటి నాయుడుతో కలిపి కావలి గ్రీష్మప్రసాద్,బీద రవిచంద్రలతో నామినేషన్ వేయించింది.భారతీయ జనతాపార్టీ అభ్యర్దిగా సోము వీర్రాజును, జనసేన నాగేంద్రబాబులు నామినేషన్ వేసారు.మొత్తం శాసనసభలో 164 మంది ఎంఎల్ఎల బలం ఉండటంతో కేవలం 11మంది ఎంఎల్ఏలు వైకాంగ్రెస్‌పార్టీ తమ అభ్యర్దిని పోటీకి దించలేదు.దీంతో నేడు నామినేషన్లు ఉపసంహరణ తుదిగడియ ముగియడంతో అయిదుగు కూటమి అభ్యర్దులు ఏకగ్రీవం ఎన్నికయినట్లు రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణి ప్రకటించారు.ఇక కూటమి అభ్యర్దుల్లో సోము వీర్రాజు, నాగేంద్రబాబు ఒకే ఓసి సామాజిక వర్గీయులు,కావలి గ్రీష్మ ఎస్సీ సామాజిక వర్గీయులు,బీద రవిచంద్ర,బిటి నాయుడు బీసీ సామాజిక వర్గీయులు.

# మైక్రోసాఫ్ట్‌తో కీలక ఒప్పందం

>> పరిజ్ఞానాలలో ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించి రాష్ట్రంలో ఐటీ ఆధారిత, ఇతర పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యవంతమైన సిబ్బందిని తయారు చేయడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో ఏడాది వ్యవధిలో 2 లక్షల మంది యువతకు మైక్రోసాఫ్ట్ సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయంగా ఏఐ, అధునాతన టెక్నాలజీల్లో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని, ఉద్యోగావకాశాలు పొందేందుకు మైక్రోసాఫ్ట్ శిక్షణ ఉపకరిస్తుందన్నారు.రాష్ట్రంలోని 50 గ్రామీణ ఇంజనీరింగ్ కళాశాలల్లో 500 మంది అధ్యాపకులు, 10,000 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ పై మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొని ఉన్న 30 ఐటీఐలలో 30,000 మంది విద్యార్థులకు డిజిటల్ ప్రొడక్టివిటీలో ఏఐ శిక్షణను అందిస్తారని వెల్లడించారు. **ఏపిలో యునిసెఫ్ భాగస్వామ్యంతో పాస్**

పోర్ట్ టు ఎర్నింగ్ 2.0ని ప్రవేశపెట్టేందుకు వీలుగా 40,000 మందికి, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ సహకారంతో మరో 20,000 మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తారన్నారు. ప్రభుత్వ పౌర సేవలను మెరుగుపర్చడంతో పాటు ప్రభుత్వాధికారుల్లో సామర్థం పెంపుదలకు 50,000 మందికి 100 గంటలపాటు ఏఐ శిక్షణను అందిస్తుందని మంత్రి వివరించారు. తద్వారా ఎపిఎస్ఎస్‌డిసితో సివిల్ సర్వీసెస్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తారన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏఐ శిక్షణకు అవసరమైన భౌతిక మౌలిక సదుపాయాలను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సమకూరుస్తుందని తెలిపారు. ఏఐ శిక్షణ అందించడానికి ఆయా విభాగాలను సమన్వయ పరుస్తుందన్నారు. విద్యాసంస్థల్లో ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టేందుకు అవసరమైన శిక్షణ, సర్టిఫికేషన్‌ను మైక్రోసాఫ్ట్ అందజేస్తుందని మంత్రి లోకేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గణేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ దినేష్ కుమార్, మైక్రోసాఫ్ట్ సౌత్ హెడ్ ఫర్ గవర్నమెంట్ బిజినెస్ దినేష్ కనకమేడల, మైక్రోసాఫ్ట్ ఇండియా - సౌత్ ఏషియా డైరక్టర్ సందీప్ బంద్వేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో ఏమిటీ నిర్మాణాలు?

>> లెన్స్‌కు, టిటిడి ఇఒకు నోటీసులు జారీచేయడం సంచలనంగా మారింది. తిరుమలకొండపై మతం ముసుగులో కొందరు స్వాములు ,మఠాధిపతులు తమతమ మఠాలపేరుతో భవనాలు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారనే ఆరోపణలు ఇదివరకే జనసేనపార్టీ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ మండిపడ్డారు. అవ్ ఆద్మీపార్టీ, హిందూసమాజం సంఘం ప్రతినిధులు కూడా తిరుమలలో పలు మఠాలపై, మఠాల నిర్మాణాలపై నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై తాజాగా బుధవారం సంచలన తీర్పువెలువడించింది. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం తిరుమలపై టిటిడి, టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా పలు మఠాలు భవనాల నిర్మాణాలు చేపట్టాయని, వీటి విషయంలో చర్యలు తీసుకోవాలంటూ టిటిడి అధికారులను ఆదేశించింది. తిరుమలలో నిర్మాణాలపై అత్యంత జాగ్రత్తలు వహించాలని, ఎంతో సుందరమైన తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చేస్తారని హైకోర్టు హెచ్చరించింది. ఇలాగే నిర్మాణాలు కొనసాగిస్తే అటవీప్రాంతం కనుమరుగైపోతుందని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. పుణ్యక్షేత్రం తిరుమల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని న్యాయస్థానం హెచ్చరించడం ఇప్పుడు టిటిడి అధికారుల్లో కలకలం రేపుతోంది. ధార్మికసంస్థలు మతం పేరుతో ఇలా నిర్మాణాలు చేస్తామంటే కుదరదని, ఇప్పటికే ఒక మఠం చేపట్టిన నిర్మాణాలపై చర్యలకు ఆదేశించింది.

పూర్తి వివరాలుతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను మే 7వతేదీకి వాయిదా వేసింది. కాగా తిరుమలలో ఆలయానికి సమీపంలో కొన్ని మఠాలు, గోగర్భమ్‌డ్యామ్ సమీపంలో కొన్ని మఠాలు నిర్మాణాలు జరిగాయి. ఇంకా మఠాలు అత్యంత ఎత్తయిన భవనాలను నిర్మిస్తున్నాయి. నిబంధనలు విరుద్ధంగా ఈ నిర్మాణాలపై హైకోర్టులో పిల్ దాఖలుతో న్యాయస్థానం తీవ్రంగా హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వాటిని తొలగించేందుకు టిటిడికి మార్గం సుగమమైంది. రాజకీయ నేతలు తమతమ పబ్బం గడుపుకునేందుకు స్వామీజీల సేవల్లో తరించడం, వారికి నిబంధనలు విరుద్ధంగా అడ్డదిడ్డంగా అనుమతులివ్వడం ఇప్పుడు పెద్ద దుమారం రేపుతోంది. తిరుమలను కాంక్రీట్ జంగిల్ కాకుండా చూడాలని ఆదేశించడం కొసమెరుపు. టిటిడి తరపున న్యాయవాది సుమంత్ వాదనలు వినిపించారు.

# పూర్తిస్థాయి విచారణ

>> చారు. మాకు అందిన సమాచారం ప్రకారం రూ.20 కోట్ల రూసా గ్రాంట్ దుర్వినియోగం, ఇస్రో నుంచి వచ్చిన రూ.25లక్షలను ఖర్చుచేసిన విషయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారు. అవినీతి, అధికార దుర్వినియోగం, విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించారని కూడా మా దృష్టికి వచ్చింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ విశాఖపట్నం వెళ్తే ఆయనకు స్వాగతం పలికేందుకు తరగతులు నిలిపేసి విద్యార్థులను రోడ్లపైకి తీసుకువచ్చారు. ఏయూ రిజిస్ట్రార్‌తో సహా ఇల్లీగల్ అపాయింట్ మెంట్స్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షల నిర్వహణలో ప్రైవేటు కళాశాలల నుంచి లంచాలు తీసుకోవడం, మాజీ వీసీ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి అప్పటి అధికారపార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించిన ఘటనలు తమ దృష్టికి వచ్చాయని మంత్రి లోకేశ్ వివరించారు.చారు. మాకు అందిన సమాచారం ప్రకారం రూ.20 కోట్ల రూసా గ్రాంట్ దుర్వినియోగం, ఇస్రో నుంచి వచ్చిన రూ.25లక్షలను ఖర్చుచేసిన విషయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారు. అవినీతి, అధికార దుర్వినియోగం, విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించారని కూడా మా దృష్టికి వచ్చింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ విశాఖపట్నం వెళ్తే ఆయనకు స్వాగతం పలికేందుకు తరగతులు నిలిపేసి విద్యార్థులను రోడ్లపైకి తీసుకువచ్చారు. ఏయూ రిజిస్ట్రార్‌తో సహా ఇల్లీగల్ అపాయింట్ మెంట్స్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షల నిర్వహణలో ప్రైవేటు కళాశాలల నుంచి లంచాలు తీసుకోవడం, మాజీ వీసీ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి అప్పటి అధికారపార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించిన ఘటనలు తమ దృష్టికి వచ్చాయని మంత్రి లోకేశ్ వివరించారు.చారు. మాకు అందిన సమాచారం ప్రకారం రూ.20 కోట్ల రూసా గ్రాంట్ దుర్వినియోగం, ఇస్రో నుంచి వచ్చిన రూ.25లక్షలను ఖర్చుచేసిన విషయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారు. అవినీతి, అధికార దుర్వినియోగం, విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించారని కూడా మా దృష్టికి వచ్చింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ విశాఖపట్నం వెళ్తే ఆయనకు స్వాగతం పలికేందుకు తరగతులు నిలిపేసి విద్యార్థులను రోడ్లపైకి తీసుకువచ్చారు. ఏయూ రిజిస్ట్రార్‌తో సహా ఇల్లీగల్ అపాయింట్ మెంట్స్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షల నిర్వహణలో ప్రైవేటు కళాశాలల నుంచి లంచాలు తీసుకోవడం, మాజీ వీసీ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి అప్పటి అధికారపార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించిన ఘటనలు తమ దృష్టికి వచ్చాయని మంత్రి లోకేశ్ వివరించారు. చారు. మాకు అందిన సమాచారం ప్రకారం రూ.20 కోట్ల రూసా గ్రాంట్ దుర్వినియోగం, ఇస్రో నుంచి వచ్చిన రూ.25లక్షలను ఖర్చుచేసిన విషయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారు. అవినీతి, అధికార దుర్వినియోగం, విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించారని కూడా మా దృష్టికి వచ్చింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ విశాఖపట్నం వెళ్తే ఆయనకు స్వాగతం పలికేందుకు తరగతులు నిలిపేసి విద్యార్థులను రోడ్లపైకి తీసుకువచ్చారు. ఏయూ రిజిస్ట్రార్‌తో సహా ఇల్లీగల్ అపాయింట్ మెంట్స్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షల నిర్వహణలో ప్రైవేటు కళాశాలల నుంచి లంచాలు తీసుకోవడం, మాజీ వీసీ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి అప్పటి అధికారపార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించిన ఘటనలు తమ దృష్టికి వచ్చాయని మంత్రి లోకేశ్ వివరించారు.

# సౌర విద్యుత్‌లో అద్భుతాలు

>> టంపై చర్చ జరిగిందని తెలిపారు. ఆ కారణంగా రాష్ట్ర ఖజానా నుంచి రూ.9 వేల కోట్లు పిపిఎలకు చెల్లించాల్సి వచ్చిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆలస్యం వల్ల అందులో జల విద్యుత్ కేంద్రం ఆగిపోయి 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రాలేదన్నారు. వైసీపీ హయాంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీల పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం వేశారని మండిపడ్డారు. టారిఫ్ అడ్జస్ట్‌మెంట్, ఫ్యూయల్ సర్ఛార్జ్, ట్రూ ఆప్ ఛార్జెస్, ఎలక్ట్రిసిటీ డ్యూటీ అని చెప్పి రూ. 32,166 కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ వినియోగం కూడా 4.6 శాతం మేర తగ్గిపోయిందని చెప్పారు. వినియోగదారులు, విద్యుత్ వ్యవస్థపైనా గత ప్రభుత్వం వేసిన భారం రూ.1 లక్ష కోట్లు అని తెలిపారు. విద్యుత్ రంగంలో వారసత్వంగా కొన్ని సమస్యలు కూటమి ప్రభుత్వానికి వచ్చాయన్నారు. సెకీ ద్వారా చేసుకున్న పవర్ సప్లై అగ్రిమెంటు రాష్ట్రానికి భారంగా మార్చేశారన్నారు. ఇలాంటి ఇబ్బందులు ఉన్నా వాటిని సరిచేసేందుకు ప్రయత్నాలు కూటమి ప్రభుత్వం చేస్తోందని వెల్లడించారు. విద్యుత్ రంగం విస్తృతంగా పెరిగినందున వ్యయం అనేది గణనీయంగా తగ్గాలన్నారు. గత ఐదేళ్లలో రూ. 5.16 పైసలు ప్రతీ యూనిట్ సగటు విద్యుత్ కొనుగోలు వ్యయం చేశారన్నారు. 2025 ఏప్రిల్ 1నుంచి యూనిట్ కొనుగోలు వ్యయం రూ 4.80కు తగ్గిస్తామన్నారు. వచ్చే విద్యుత్‌ను పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి కోసం వినియోగిస్తామన్నారు. దేశం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేస్తే ఎపి ఒక్కటే 160 గిగావాట్లను ఉత్పత్తి చేస్తుందని ప్రకటించామన్నారు. పిఎం సూర్యఘర్ కింద ప్రతీ ఇంటిలోనూ విద్యుత్ ఉంటుందన్నారు. డెమాక్రాటైజేషన్ ఆఫ్ ఎనర్జీ అన్నది ఇప్పుడు ఓ కీలక విధానమని తెలిపారు. అలాగే ప్రోస్యూమర్ అన్నది ఇప్పుడు ఓ కొత్త పదమని, ప్రొడ్యూసర్ కమ్ కంజ్యూమర్‌గా ప్రతీ ఇల్లూ మారాలని ఆకాంక్షించారు. 2 కిలోవాట్ల సామర్థంతో సౌర ఫలకాలను ప్రతీ ఇంటిపైనా ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. వందశాతం మేర సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా ఎపి మారాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ రావాలని తెలిపారు. ప్రతీ ఇంటికీ 240 యూనిట్ల మేర విద్యుత్ ఉత్పత్తి అవుతుందని.. ప్రస్తుతం రాష్ట్రంలో సగటు వినియోగం 100 యూనిట్ల మేర ఉంటోందన్నారు. మిగతా విద్యుత్ అంతా డిస్కమ్‌లు కొనుగోలు చేసి డబ్బులు చెల్లిస్తాయని చెప్పారు. 20 ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాల్లోనూ సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ ఏడాది 20 లక్షల ఇళ్లపై ఈ తరహా రూఫ్ టాప్ సోలార్ కనెక్షన్లు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. తద్వారా 1440 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటు సోలార్ పంప్ సెట్ల వద్ద కూడా సౌర విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందన్నారు. రైతులు కూడా ఈ సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలని సిఎం పిలుపునిచ్చారు. సబ్ స్టేషన్లను కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం ద్వారా పంపిణీ నష్టాలను అరికట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలు 9 శాతంగా ఉన్నాయన్నారు. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తామని తెలిపారు. 960 మెగావాట్ల జల విద్యుత్ కూడా పోలవరం ప్రాజెక్టు ద్వారా అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విద్యుత్తు మిగులు రాష్ట్రంగా ఉన్న ఎపిని, వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లోటు పరిస్దితికి తీసుకెళ్లిందని చంద్రబాబు మండి పడ్డారు. పరిశ్రమలు కరెంట్ వాడితే సర్‌చార్జీ విధించిన ఘనత ఆ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో తలసరి విద్యుత్తు వినియోగం 23శాతం మేర పెరిగిందని సిఎం చెప్పారు. సౌర,పవన విద్యుత్తును 7700,మెగా వాట్లు మేర ఉత్పత్తి చేసిన మెదటి రాష్ట్రం ఏపీ అని చెప్పారు.2019-24 మధ్య అసమర్థపాలనతో రాష్ట్రంలో మళ్లీ చీకటి రోజులు వచ్చాయన్నారు.ఆలోచన లేకుండా వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పిపిఎలను రద్దు చేసేసిందన్నారు.ఆ విషయం అంతర్జాతీయ అంశంగా మారిపోయిందని గుర్తుచేసారు. దావోస్‌లోను దీనిపై చర్చ జరిగిందన్నారు.కేవలం జగన్ ఈగో కారణంగా రాష్ట్ర ఖజానా నుంచి రూ.9వేల కోట్లు పిపిఎలకు చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేసారు. గత ఐదేళ్లలో యూనిట్ సగటు విద్యుత్ కొనుగోలుకు రూ.5.16 వ్యయం చేశారన్నారు.2025 ఏప్రిల్ 1నుంచి యూనిట్ కొనుగోలు వ్యయం 4.80 రూపాయలకు తగ్గిస్తామన్నారు. వచ్చే విద్యుత్‌ను పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి కోసం వినియోగించుకోవాలన్నారు. దేశం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేస్తే ఏపీ ఒక్కటే 160 గిగావాట్లను ఉత్పత్తి చేస్తుందని ప్రకటించామన్నారు. పీఎం సూర్యఘర్ కింద ప్రతి ఇంటిలోనూ విద్యుత్ ఉండనుందన్నారు. 2 కిలోవాట్ల సామర్ధంతో సౌర ఫలకాలను ప్రతి ఇంటిపైనా ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. వందశాతం మేర సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా ఏపీ మారాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 10వేలఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ రావాలని అన్నారు. ప్రతి ఇంటికీ 240 యూనిట్ల మేర విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటు వినియోగం 100 యూనిట్ల మేర ఉంటోందని తెలిపారు. మిగతావిద్యుత్ అంతా డిస్కమ్‌లుకొనుగోలు చేసి డబ్బులుచెల్లిస్తాయని అన్నారు. 20 ఏళ్లపాటు ఉచితంగా విద్యుత్ వచ్చే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 14-03-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల పౌర్ణమి మ.12.25
పుబ్బ ఉ.6.18
వర్జ్యం మ.2.17-4.03
దు.ఉ.8.49-9.37, 2) మ.12.49-1.37
శుభసమయం : ఉ.9.30-10.30,
సా.4.50-5.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటారు. రుణాలు తీరుతాయి.

**వృషభం :** మిత్రులతో ఏర్పడిన మాట పట్టింపులు పరిష్కరించుకుంటారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**మిథునం:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు.

**కర్కాటకం :**నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**సింహం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. రుణబాధలు ఎదురైన అధిగమిస్తారు.

**కన్య :** కుటుంబసభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఖర్చులు పెరుగుతాయి.

**తుల :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆరోగ్యంపట్ల మెలకువ అవసరం.

**ధనుస్సు:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**మకరం:** మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:**ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**మీనం :** వృత్తి, వ్యాపారాలు లాభ సాటిగా సాగుతాయి. భూవివాదాలుతీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కొట్టం.. తిట్టం!

>> కూడదు. పూర్వాశ్రమంలో విద్యార్థులు తప్పు చేస్తే టీచర్లు గుంజీలు తీయించడమో, బెత్తంతో కొట్టడమో చేసి అదుపులో పెట్టేవాళ్లు.కానీ కాలంతో పాటు పద్ధతులూ మారాయి.క్రమశిక్షణ పేరిట ఎలాంటి కఠినమైన చర్యలూ తీసుకోవద్దని పాలకులు కొంత కాలంగా నిబంధన విధించారు. ఇదే విద్యార్థుల పాలిట వరంగా మారింది.ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారింది. తాము ఏం చేసినా ఎవరూ ఏమీ అనరని, ఏమీ చెయ్యరనే ధైర్యం విద్యార్థుల్లో పెరిగిపోయింది. చదవకపోవడంతో పాటు క్రమశిక్షణ మర్చిపోయి ఉల్లంఘనకు కూడా పాల్పడుతున్నారు. అయినా ఉపాధ్యాయులు చూసీ చూడనట్టు పోవాల్సిందే తప్పించి ఏం చెయ్యలేకపోతున్నారు. నిబంధనల ప్రకారం ఏం చెయ్యలేని నిస్సహాయ స్థితిలో అచేతనంగా ఉండిపోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇలాంటి పరిస్థితుల్లో విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు అనూహ్యమైన నిర్ణయం తీసుకున్నారు. చింత రమణ అనే మాస్టర్ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులందరి ముందూ సాష్టాంగ నమస్కారం చేశాడు. అక్కడితో ఆగకుండా గుంజీలు తీసి విద్యార్థులను క్షమాపణ కోరాడు. తమ పిల్లలను క్రమశిక్షణలో ఉంచే బాధ్యత మీరే తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను అభ్యర్థించాడు. విద్యా వ్యవస్థలో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత పరిస్థితిని వివరిస్తూ ఆవేదన వ్యక్తంచేశాడు. దీంతో విద్యార్థులతో పాటు అక్కడున్న ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా నిశ్చేష్టులయ్యారు. అవాక్కయ్యారు. ఈ సంఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దీనిపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. సంఘటనకు దారితీసిన పూర్వాపరాలను ఆయన ఆరా తీస్తున్నారు.

## రాష్ట్రంలోని .. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

**తిరుపతి కలెక్టరేట్, మార్చి 13 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ పరీక్ష శిక్షణ ఇవ్వనున్నట్లు అమరావతి సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు వెల్లడించారు. ఈ మేరకు గురువారం సంచాలకులు మీడియాతో మాట్లాడారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనాది సదుపాయాలతో డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే ప్రైవేట్ శిక్షణా సంస్థలను గుర్తించి వాటి ద్వారా శిక్షణ ఇప్పించుటకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. దానికి సంబంధించి అభ్యర్థులు నమోదు కార్యక్రమం కూడా పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే వెయ్యి మంది షార్ట్‌అవుట్ చేయబడిన అభ్యర్థులు తమ వెబ్ ఆప్షన్లను పూర్తి చేశారని చెప్పారు. షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులు ఎంపానెల్డ్ కోచింగ్ సంస్థలకు వెబ్ ఆప్షన్ సర్వీస్ ద్వారా వారి ప్రాధాన్యతలను ఎన్నుకోవాలని, షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులు వారి ప్రాధాన్యత ప్రకారం అన్ని కోచింగ్ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. షార్ట్ అవుట్ చేయబడిన అభ్యర్థులందరూ తమ వెబ్ ఆప్షన్లను జ్ఞాన భూమి పోర్టల్‌లో పూర్తి చేయడానికి ఆఖరి తేది మార్చి 15 అని తెలియజేశారు. మరిన్ని వివరాలకు జిల్లా షెడ్యూల్ కులముల సంక్షేమ, ఎస్సీ, సంక్షేమ, సాధికారత అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ తిరుపతి జిల్లా వారిని సంప్రదించవచ్చునన్నారు.

## మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ అనంత వరకే

**గుంతకల్లు రైల్వే,మార్చి 13,ప్రభాతవార్త** సీమాంధ్రలో మచిలీపట్నం- ధర్మవరం- మచిలీపట్నం మధ్య తిరిగే ఎక్స్‌ప్రెస్‌ను అనంతపురం- మచిలీపట్నం-అనంతపురం మధ్య మాత్రమే నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లోని ధర్మవరం రైల్వే స్టేషన్‌లో 5వ నెంబర్ ప్లాట్‌ఫాంలో జరుగుతున్న మౌలిక సదుపాయాల కల్పన పనుల కారణంగా మచిలీపట్నం నుంచి ధర్మవరం వెళ్లే నెంబర్ 17215ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 30వరకు అలాగే ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే నెంబర్ 17216 ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 31వరకు మచిలీపట్నం-అనంతపురం-మచిలీపట్నం మధ్య మాత్రమే నడుపుతున్నట్లు తెలిపారు.

# టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు తగిన న్యాయం

### - పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి నారాయణ



**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్తప్రతినిధి:** టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులందరికి తమ ప్రభుత్వం తగిన న్యాయం చేస్తోందని శాసనసభలో ఏపీ పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గత ప్రభుత్వం 22,640 మంది టిడ్కో లబ్ధిదారులను తొలగించి వేరే వారికి ఇళ్లు కేటాయించిందని వెల్లడించారు.కేవలం 57వేల 40 ఇళ్లను మాత్రమే వైకాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం పూర్తి చేసింది.లబ్ధిదారుల మార్పులో అవకతవకలపై కమిటీ వేసి చర్యలు తీసుకుంటున్నాం.టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులున్న మాట వాస్తవమే.77606 మందికి ఇళ్లు ఇవ్వకుండానే వారి పేరు మీద బ్యాంకు లోన్ తీసుకున్నారు.దీనివల్ల ఇళ్లు లేకుండానే వారిపై ఈఎంఐ భారంతో పాటు ఎన్పీఏ కి బ్యాంకులు వెళ్తున్నాయి.బ్యాంకులకు లోన్లు కట్టేందుకు సీఎం చంద్రబాబు 140 కోట్లకు అనుమతించారు. త్వరలోనే బ్యాంకులకు ఈ బకాయిలు చెల్లిస్తాం.టిడ్కో ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు హడ్కో 4460 కోట్లు రుణం ఇస్తుంది.అర్బన్ అథారిటీల సహకారంతో మౌలిక వసతుల కల్పన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.జూన్ 12 నాటికి పెండింగ్ లో ఉన్న 365,430 చదరపు అడుగుల ఇళ్లను పూర్తి చేస్తాం విశాఖలో మెట్రో రైల్ కారిడార్ లపై 2051నాటికి ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని డీపీఆర్ రూపొందించాం.పీక్ అవర్ పాసింజర్ డైవర్షన్ ట్రాఫిక్ ఆధారంగా మెట్రో రైల్ పై కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది.కనీసం పాసింజర్ డైవర్షన్ పదివేలు ఉంటేనే మెట్రో రైల్ కు అనుమతి వస్తుంది.స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాడి వరకు పీక్ అవర్ ట్రాఫిక్ 10వేలకు

పైగా ఉండటంతో ఆయా కారిడార్లకు కేంద్రం అనుమతి ఇచ్చింది.స్టీల్ ప్లాంట్ నుంచి అనకాపల్లి వరకు పీక్ అవర్ ట్రాఫిక్ 3763 మాత్రమే రావడంతో కేంద్రం కుదరదని చెప్పింది.ట్రాఫిక్ డైవర్షన్ కోసం ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తున్నాం.

# మహా కవయిత్రి మొల్లమాంబ

### ముఖ్యమంత్రి చంద్రబాబు ఘన నివాళి



అసెంబ్లీలో మొల్లమాంబ విగ్రహానికి నివాళులర్పించిన సీఎం

**విజయవాడ, మార్చి13, ప్రభాత వార్తప్రతినిధి:** తెలుగు సాహిత్య రంగానికి వెలకట్టలేని కీర్తిని తీసుకువచ్చిన మహా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) అని ఏపీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వ్యాఖ్యా నించారు. కవయిత్రి మొల్ల జ యంతి సందర్భంగా అసెం బ్లీలో ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళులు సీఎం చంద్రబాబు నాయుడు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో అసమాన ప్రతిభను చాటుకొని, కవిత్వంలో అపారమైన ఖ్యాతిని సొంతం చేసుకున్న కవయిత్రి మొల్ల జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మంత్రులు అనగాని సత్యప్రసాద్,గొట్టిపాటి రవికుమార్,సవిత ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన మంత్రి దుర్గేష్ మహా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతి సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఘన నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 13న సుప్రసిద్ధ తెలుగు కవయిత్రి మొల్ల జయంతిని రాష్ట్ర పండగగా నిర్ణయించడం సంతోషకరమన్నారు. తెలుగు సాహిత్యంలో అసమాన ప్రతిభను చాటుకొని, కవిత్వంలో అపారమైన ఖ్యాతిని సొంతం చేసుకున్న కవయిత్రి మొల్ల జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. రామాయణాన్ని అతి సులువైన పదాలతో తెలుగులో రాసి తన సరళమైన పదజాలానికి అందరూ ముగ్దులయ్యేలా చేసిన గొప్ప కవయిత్రి మొల్ల అని అభివర్ణించారు. ఆమె రాసిన రామాయణం ‘మొల్ల రామాయణం’గా ఎంతో ప్రసిద్ధి చెందిందని, రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రిగా కూడా ఆమె ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచిందని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. మొల్ల రామాయణం భక్తి, శృతిలయలతో కూడిన అమూల్య సంపద అని తెలిపారు. మొల్ల రచనా శైలి చాలా సరళమైందని, రమణీయమైనదని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అన్నారు.

## కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీలో ముగ్గురు అధికారులపై చర్యలు

**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీ లో అక్రమ కట్టడాల విషయంలో ముగ్గురు అధికారులపై చర్యలు కు అధికారులు ఆదేశాలు జారీ చేసారు. నిబంధనలకు విరుద్ధంగా అవినీతికి పాల్పడి అక్రమ కట్టడాలను అడ్డుకోలేదని ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది.ఈ ఫిర్యాదు ఆధారంగా మున్సిపల్ శాఖ రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ తో విచారణ జరిపించిన ప్రభుత్వంముగ్గురు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని నివేదినివేదిక ఆధారంగా తాడిగడప అప్పటి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు,టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళీ గౌడ్,టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ పద్మావతీ పై క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేసిన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ,తీతదుపరి చర్యలు కోసం టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ కు సిఫార్సు చేసిన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్.

## రైల్వే అభివృద్ధిలో మహిళల పాత్ర శ్లాఘనీయం

### - డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



రైల్వేలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**గుంతకల్లు రైల్వే,మార్చి 13,ప్రభాతవార్త** రైల్వే అభివృద్ధిలో మహిళల పాత్ర శ్లాఘనీయమని డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం గురువారం స్థానిక రైల్వే ఆఫీసర్ క్లబ్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మహిళలలోని సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సంక్షేమ సంఘం డివిజనల్ అధ్యక్షురాలు మమతా గుప్తా,సీనియర్ డిపిఓ క్యాప్రిల్ అరోరాలు మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమయస్ఫూర్తితో స్థిరంగా నిలబడి ధైర్యంగా ఎదుర్కొని లక్ష్యాలను సాధిం చేందుకు ప్రతిఒక్కరు నిర్మాణాత్మక విధానంతో సాధన చేయాలని కోరారు. మహిళలు దేశ ప్రగతికి పునాదివంటి వారన్నారు.

# తిరుమల సమాచారం

## నేడు గరుడసేవ



**తిరుమల, మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** ఫాల్గుణ మాసం పౌర్ణమిఘడియల్లో శుక్రవారం రాత్రికి తిరుమలలో పౌర్ణమిగరుడసేవ జరగనుంది. సాయంత్రం నిత్యకైంకర్యాలు పూర్తిచేసుకున్న తరువాత మలయప్పస్వామిని విశేషాభరణాలం కృతుడ్ని చేయనున్న అర్చకులు వాహనమండపం వద్దకు వేంచేపుచేస్తారు. అక్కడ వేదమంత్రాల నడుమ గరుడునిపై మలయప్పను కొలువుదీర్చి ఆలయ మాఢవీధుల్లో రాత్రి 7గంటలకు ఊరేగింపు చేస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారు.

## సనాతన ధర్మప్రచారానికి టిటిడి కృషి అభినందనీయం

### - ప్రక్షాళనలో భాగంగా భక్తులకు సంతోషసేవలు :బిజెపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి



**తిరుమల,మార్చి 13ప్రభాతవార ప్రతినిధి:** హిందూపుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం సనాతన హిందూ ధర్మప్రచారాని చేస్తున్న కృషి అభినందనీయమని, టిటిడిలో ప్రక్షాళనలో భాగంగా హిందూ యేతరులను ఇతర శాఖల్లోకి బదిలీచేయడం, విఆర్ఎస్ ఇవ్వడం శుభపరిణామమని బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని దేవాదాయశాఖ పరిదిలో ఉన్న అన్ని ఆలయాల్లో, ఇతర హిందూ సంస్థల్లో అన్యమతస్తులను గుర్తించి వారిని బయటకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. హిందూ మతం పరిరక్షణకు, సనాతన ధర్మవ్యాప్తికి టిటిడి పాలకమండలి, అధికారులు తీసుకున్న నిర్ణయాలు మంచివన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల ఆలయాల్లో జరుగుతున్న ఇబ్బందులు, అక్రమాలను సరిచేయడంలో మంత్రి లోకేశ్ చొరవ ప్రత్యేకంగా అభినందనీయమన్నారు. ఆలయాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు కూడా ప్రభుత్వానికి సహకరించాలిగానీ, ఇబ్బందులు పెట్టించడం మంచిదికాదన్నారు.ఉన్నఫళంగా దేవాదాయశాఖ పరిధిలోని ఓ ఆశ్రమంలో అధికారులు షెడ్లను కూల్చేయడం దారుణమని, యువమంత్రి లోకేష్ ఇచ్చిన మాటతో సొంత నిధులతో అధునాతన షెడ్లను భక్తులకోసం నిర్మించడం అందరికీ ఆదర్శమన్నారు. గురువారం ఉదయం ఆయన కోలాఆనంద్‌తో కలసి తిరుమలకు వచ్చారు. విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## శ్రీవారి సేవలో ప్రభుత్వ సలహాదారు ఠాకూర్



**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో అందరికీ శుభాలు కలగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని విశ్రాంత ఐపిఎస్ ఆంపి ఠాకూర్ ఆకాంక్షించారు. గురువారం ఉదయం ఆయన శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తొక్కిసలాట ఘటన - 17న విచారణకు రావాలని తిరుపతి కలెక్టర్, టిటిడి ఇఒ, ఎస్పీకి సమన్లు

**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** మూడునెలల క్రిందట తిరుపతిలో జరిగిన వైకుంఠద్వార దర్శనాల టోకెన్లజారీ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం, 51మంది క్షతగాత్రులైన కేసులో విచారణకు సంబంధిత కమిషన్ ఛైర్మన్ జస్టీస్ సత్యనారాయణమూర్తి ఎదుట హాజరుకావాలని ఉన్నతాధికారులకు సమన్లు జారీ అయ్యాయి. జనవరి 9వతేదీ జరిగిన ఘటనకు సంబంధించి పూర్తిసమగ్ర ఆధారాలు సమర్పించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, టిటిడి ఇఒ శ్యామలరావు, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజుకు కమిషన్ నోటీసులిచ్చింది. తిరుపతిలో 17న జరిగే విచారణకు నేరుగా హాజరుకావాలని పేర్కొంది. ఇప్పటికే తిరుపతిలో ఘటనపై వరుసగా మూడురోజులు పద్మావతి పార్కు, రామానాయుడు పాఠశాలను తనిఖీ చేసి ఆధారాలు సేకరించిన విషయం విదితమే. పలువురు పోలీసు అధికారులు, టిటిడి అధికారులను, క్షతగాత్రులను, కొందరు ప్రత్యక్షసాక్షులను విచారణ చేసింది. తిరుపతి కలెక్టరేట్‌లో ప్రత్యేక ఛాంర్‌లో జస్టీస్ సత్యనారాయణమూర్తి ఉండి మొదటి విడత, రెండో విడత విచారణ చేపట్టారు. 11మందిని విచారణ చేశారు. 19మంది బాదితులకు న్యాయవిచారణకు నోటీసులిచ్చింది. తమిళనాడు, తెలుగురాష్ట్రాలు, కేరళ,కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తులు తిరపతికి వచ్చారు. ఇప్పుడు 17వతేదీ మూడోదశ విచారణ జరగనుంది.

# మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదం ఘటనకు పాల్పడింది పెద్దిరెడ్డి అనుచరులే: హోం మంత్రి అనిత



**విజయవాడ మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎంతటి అక్రమార్కులైన సత్యాన్ని దాచలేరని ఏపీ హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు.అవినీతిని బహిర్గతం చేసే దస్త్రాలు తగులబెట్టినంత మాత్రనా వాస్తవాలు మరుగున పడతాయా అని వ్యాఖ్యానించారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం వెనుక మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులప్రమేయం ఉందని ప్రాథమిక విచారణలో సీఐడీ గుర్తించిందని తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా నిందితుల ఇళ్లలో పోలీసులు తనిఖీలు చేసి, స్వాధీనం చేసుకున్న రికార్డుల ఆధారంగా ఈ నిర్ణయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. విచారణను త్వరలో పూర్తిచేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామనిస్పష్టం చేశారు. మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో అనుమానాస్పదంగా అగ్నిప్రమాదం జరగడం కీలక దస్త్రాలు దగ్ధమైన దుర్ఘటనపై ఎమ్మెల్సీలు బీటీ నాయుడు. రామారావు, అశోక్‌బాబు మండలిలో అడిగిన ప్రశ్నకు ఆమె సమాధాన మిచ్చారు. ప్రాథమిక ఆధారల ప్రకారం నిందితులు ఉద్దేశపూర్వకంగా నేరానికి పాల్పడినట్లు గుర్తించాం. ఈ కేసులో ఆర్డీఓ కార్యాలయంలో పనిచేసే గౌతమ్‌రాజ్‌ను ఏ1గా గుర్తించాం. ఆర్డీఓ మురళి, హరిప్రసాద్‌లపై కూడా కేసుల నమోదు చేశాం. వారంతా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇప్పటికే భూకబ్జా కేసులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో 79107 ఎకరాలను నిషేధిత భూముల జాబితాల నుంచి తొలగించాలన్న ప్రతిపాదన పరిశీలించి 73474 ఎకరాలను తొలగించేందుకు ఆర్డీఓ నిర్ణయించారు. వాటిలో 22523 ఎకరాలు నిబంధనలకువిరుద్ధంగా జాబితా నుంచి తొలగించినట్లు నిర్ధారణఅయింది. దీనికి సంబంధించి రిపోర్టు అందాల్సి ఉంది. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం వెనుక పెద్దిరెడ్డి అనుచరుల కుట్ర ఉందని ప్రాథమికంగా తేలింది అని పేర్కొన్నారు. పుంగూను మండలంలో నిషేదిత జాబితాలో ఉన్న 900 ఎకరాల భూములను మాజీ మంత్రి పేరిట కట్టబెట్టిన విషయం వాస్తవమేనా? వివరాలు తెలపాలని చర్చలో పాల్గొన్న ఎమ్మెల్సీ రామారావు మంత్రిని కోరారు. విశాఖ పోర్టుకు 2024లో కంటైనర్లలో భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు వచ్చిన వ్యవహారంపై సీబీఐ విచారణ జరుగుతోందని హోం మంత్రిఅనిత ఎమ్మెల్సీలు రవిబాబు కళ్యాణి, ఏసురత్నం అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## విపక్షనేత బొత్సకు జ్ఞాపక శక్తి లోపించిందా!

### - ఆర్థిక మంత్రి మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మండలిలో ప్రతిపక్ష నేత బొత్సకు కొంత జ్ఞాపక శక్తిలోపించిందా ‘( షార్ట్ టర్మ్ మెమొరీ లాస్)అనే అనుమానం కలుగుతోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖానించారు. వైకాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం సభలో మార్షల్స్‌ను వినియోగించడాన్ని ఆయన ఎలా మరచి పోయారో అర్థం కావడం లేదన్నారు. బొత్స తన మెమొరీని రిఫ్రెష్ చేసుకుంటే మంచిదన్నారు,. అప్పటి ఛైర్మన్‌పై మంత్రి హోదాలో బొత్స ఎలాంటి పదజాలాన్ని వాడారో గుర్తుచేసుకోవాలి. దానికి ఇప్పుడైనా పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తారా లేదా? అని మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. మండలి కార్యకలాపాలు జరగకుండా వైకాంగ్రెస్ పార్టీ సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆయన ఆగహాన్ని వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం సమావేశం ప్రారంభమైన వెంటనే నిరుద్యోగ భృతి 20 లక్షల ఉద్యోగాల కల్పన ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై చర్చించేందుకు వైకాపా ఎమ్మెల్సీలు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని మండలి ఛైర్మన్ మోషేను రాజు తిర స్కరిం చారు. దీనికి నిర సనగా వైకా పా ఎమ్మెల్సీలు మూకుమ్మడిగా ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ పోడియంలోకి చొచ్చుకువచ్చారు. పోడియంపై చేతులతో చరుస్తూ కాగితాలు చింపి, విసిరి గందరగోళాన్ని సృష్టించారు. బొత్స సత్యనారాయణ తన స్థానంలోనే నిలచుని వారికి సైగలు చేస్తూ ప్రోత్సహించడం గమనార్హం. వైకాపా ఎమ్మెల్సీలు ముందస్తు వ్యూహంతో ప్లకార్డులతో సభలోకి వచ్చారు. వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ తిరస్కరించిన వెంటనే పోడియంలోకి చొచ్చుకువెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ప్రశ్నోత్తరాలకు అడ్డుపడ్డారు. ఉదయం 10.15 గంటలకు ఒకసారి 10.44 రెండో సారి 11.47 గంటలకు మూడోసారి వాయిదా వేయాల్సి వచ్చింది. పదేపదే వైకాపా ఎమ్మెల్సీలు అడ్డు తగలడంతో మార్షల్స్‌ను దించారు. నిరసనగా వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

## ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా ఎయిమ్స్ వైద్యుల ర్యాలీ




ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎయిమ్స్ వైద్యులు

**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా ఎయిమ్స్ హాస్పటల్లోని ప్రముఖ వైద్యులు ప్రొఫెసర్ డాక్టర్ అహంతేం శాంతా సింగ్, డిన్ ప్రొఫెసర్ శ్రీమత్ కుమార్ డాష్, హెచ్ ఓ డి విభాగం డాక్టర్ ఉత్తర దాస్, మెడికల్ సూపర్డెంట్ ప్రొఫెసర్ నటరాజ్ నేతృత్వంలో గురువారం ర్యాలీ నిర్వహించారు.ఎయిమ్స్ హాస్పిటల్ ఆవరణ నుండి ముఖ ద్వారం వరకు కిడ్నీ వ్యాధి సమస్యలు వాటి నివారణ పై అవగాహన కల్పిస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 13వ తేదీన ఎయిమ్స్ అధ్వర్యంలో 2006 నుండి ప్రపంచ కిడ్నీ డే నిర్వహిస్తున్నామన్నారు ప్రపంచ జనాభాలో సగభాగం దీర్ఘకాల కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఉన్నారని చెప్పారు అధికంగా జంక్ ఫుడ్ తినటం మద్యపానం ధూమపానం చెడు వ్యసనాల ఉన్న వారికి ప్రపంచవ్యాప్తంగా కిడ్నీ సమస్యలు అధికంగా నమోదు అవుతున్నాయని చెప్పారుబీపీ షుగర్ అదుపులో లేకపోవటం వల్లే కిడ్నీ సమస్యలు తలెత్తుతాయని అన్నారు రెండు కిడ్నీలలో ఒక కిడ్నీ పాడైన దీర్ఘకాలం డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి చేయాల్సి వస్తుందని చెప్పారు వైద్యం అందుబాటులో ఉన్న పేదలకు వైద్యం ఖర్చు భారంగా అవుతుందని కిడ్నీ సమస్యలు తలెత్తకుండా బీపీ షుగర్ అదుపులో ఉంచుకోవాలని సూచించారు ప్రతిరోజు వ్యాయామం పౌష్టిక ఆహారం మంచినీరు త్రాగటం వైద్య పరీక్షలు నిర్వహించుకొని బిపి షుగర్ అదుపులో ఉండటం వల్ల కిడ్నీ సమస్యలు తలెత్తకుండా నివారించుకోవచ్చని చెప్పారు ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు జూనియర్ డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఉద్యోగులకు వైద్యం: మంత్రి సత్యకుమార్

**సచివాలయం,మార్చి 13,ప్రభాతవార్త :** ఈహెచ్ఎస్ పథకం కింద ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారనే ఎన్టీఆర్ వైద్యసేవతో సమానంగా వైద్యం అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం అని మంత్రి సత్యకుమార్ తెలిపారు.
గురువారం శాసనమండలి ఛైర్మన్ మోషన్‌రాజు అధ్యక్షతన జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి పై విధంగా జవాబు ఇచ్చారు.గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రూ.2,534కోట్లు బకాయిలు పెట్టగా వాటిని చెల్లిస్తూ వస్తున్నాం.ఎయిడెడ్ స్కూళ్ళ ఉద్యోగులకు యాజమాన్యం నిర్ణీత మొత్తం చెల్లిస్తే ఎన్టీఆర్ వైద్యసేవ కింద చికిత్స అందించేందుకు సిద్ధం.ఉద్యోగులకు రీ-యింబర్స్‌మెంట్ వరకు వెళ్లకుండానే వైద్యసేవలు అందించే ప్రయత్నాలు చేస్తున్నాం.

మరోసారి సమీక్షించి ఎయిడెడ్ స్కూళ్ళ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## ‘దిల్‌రూబా’చిత్రం విజయవంతం కావాలి

### - శ్రీవారి దర్శనంలో నటుడు కిరణ్‌అబ్బవరం



**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** దిల్‌రూబా చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని నిర్మించామని, దీన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని సినీనటుడు కిరణ్ అబ్బవరం తెలిపారు.చిత్రం విడుదల కానున్న సందర్భంగా చిత్రబృందం దర్శకుడు విశ్వకిరణ్, సినీనటి నజియా దవిసోస్, రుక్షర్‌దిల్లోన్‌తో కలసి గురువారం ఉదయం తిరుమలకు వచ్చారు. విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల చిత్రబృందాన్ని చూడటానికి భక్తులు, అభిమానులు ఆసక్తిచూపారు.

## మత్తుమందిచ్చి భక్తులను దోచేస్తున్న ముఠా అరెస్టు

**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** భక్తుల ముసుగులో తమిళనాడుకు చెందిన దొంగల ముఠా ఒంటరి మహిళ భక్తులను టార్గెట్‌చేసి మత్తుమందిచ్చి దోపిడీచేస్తున్న నిందితులను తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్టుచేశారు. వారినుండి 21గ్రాముల బంగారునగలు, 45వేల రూపాయలు నగదు, 3మొబైల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలో మూడుజిల్లాల పోలీసులకు జిక్కకుండా నిద్రలేకుండా నేరాలు చేస్తున్న ఈ ముఠాను తిరుమల పోలీసులు అరెస్టుచేయడంతో తమిళనాడు పోలీసులు అభినందనలు తెలిపారు. తిరుమల అడిషనల్ ఎస్పీ ఐ.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు......ప్రముఖ ఆలయాలు, పుణ్యక్షేత్రాల ప్రాంతాల్లో భక్తుల ముసుగులో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా కన్యకాపురంకు చెందిన వి.విజయకుమార్(33), విల్లుపురం తాలూకా పాండినగర్‌కు చెందిన ఆర్.శారద(65)ముఠా లీడర్‌లను సాంకేతికత సహాయంతో నేరాలు చేసి తప్పించుకుంటున్నారు. వీరిపై తమిళనాడులో కేసులు ఉన్నాయి. తిరుమలలోనూ భక్తులను ఒంటరి మహిళలను టార్గెట్‌చేసుకుని దోచేస్తున్నారు. భక్తులకు ఆహారంలో నిద్రమాత్రలు కలిపి తినిపిస్తారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**రహదారులు మరియు భవనముల శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నిట్ నెం.63 to 66/TO/EE(R&B) Ongole/2024-25, తేది: 11.03.2025
ఒంగోలు R&B డివిజన్‌లో 2025-2026 సంవత్సరానికి అద్దె ప్రాతిపదికపై (3) తనిఖీ వాహనాలు ఏర్పాటు మరియు జ్యుడీషియల్ సర్వీస్ సెంటర్‌కు అత్యవసర మరమ్మతుల కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. బిడ్ డాక్యుమెంట్స్ డౌన్‌లోడింగ్ కొరకు ప్రారంభ తేది: 15.03.2025 మ.3.00 గం. నుండి 29.03.2025 మ.3.00 గం. వరకు. వివరాలకు దర్శించండి: tender.apeprocurement.gov.in
ఫోన్: 08592-232664. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, (R&B) డివిజన్, ఒంగోలు
DIPR.No.15510/CL/Advt/1/1/2022-23, తేది: 13.03.2025

వార్త

మీరు సాహసంతో పనిని చేపట్టలేకపోతే, మీరు ఓటమికి గురికానేకారు. కాని మీరు జీవితంలో ఏదీ సాధించలేకపోతారు.

-వినోబాభావే

# అన్నదాతల ఆత్మహత్యలను ఆపలేమా?

అందరూ శాఖాహారులే కానీ గంప కింద కోడి మాయమైనట్లుగా ఉంది రైతుల పరిస్థితి.వీరూ వారు అన్న తేడా లేకుండా అందరు నాయకులు రాజకీయ పార్టీలు అంతా రైతుల సంక్షేమం, అభ్యున్నతి గురించి మాట్లాడేవారే. అధికారంలో ఉన్నవారైతే మరో అడుగు ముందుకు వేసి తమది రైతుల పక్షపాత ప్రభుత్వమని, వారి అభివృద్ధే ధ్యేయమని చెప్పుకునేవారే. ఇప్పుడే కాదు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇవే మాటలు చెప్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా గ్రామాల్లో ఉండి రైతు కుటుంబంలో జన్మించి నాయకులుగా ఎదిగినవారు సైతం ఇలామాట్లాడి శాసన సభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా ముఖ్యమంత్రులుగా పదవుల్లోకి వచ్చిన తర్వాత రైతులను, గ్రామాలను విస్మరిస్తున్నారే మోననిపిస్తున్నది. ఎన్నికల మేనిఫెస్టోల్లో కూడా రైతుల గురించి చేసే వాగ్దానాలు వింటుంటే, చూస్తుంటే అసలు రైతులకు ఇక స్వర్ణయుగమేననిపిస్తున్నది. కానీ అధికారంలోకి రాగానే మరచిపోవడమో లేక మరిచిపోయినట్టు నటించడమో ఆనవాయితీగా అయింది. ఎన్నికల ముందు నాయకులు చెప్తున్న మాటలు, చేస్తున్న వాగ్దానాలు అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోరనే విషయం రైతులకు కూడా తెలియంది కాదు. అంతేకాదు తాము వేదిక లెక్కి ఇస్తున్న హామీలు, అధికారంలోకి వస్తే అమలు చేయలేమని కూడా నాయకులకు తెలియంది కాదు. ఎన్నికల్లో పరాజయంపాలై ప్రతిపక్షంలో కూర్చుంటే పాలక పక్షాన్ని ఇబ్బంది పెట్టేందుకు తాము అధికారంలోకి వచ్చి ఉంటే రైతుకు ఎంతో చేసి ఉండేవారమని, తమ ఎన్నికల మేనిఫెస్టోను యథాతథంగా అమలు చేసి ఉండేవారమని చెప్పుకునేవారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఆదిలో కొంతమేరకు ఎన్నికల మేనిఫెస్టోకు కొంత ప్రాధాన్యత ఇచ్చినా ఆ తర్వాత క్రమేణా విస్మరించడం పెరిగిపోయింది. ఎవరు ఎంతకాలం ఎలామోసం చేసినా, రైతులు మాత్రం తమలో తాము కుమిలిపోవడం తప్ప నోరు విప్పరు. దీంతో వారికి కొంత బాధా, భారం తగ్గి కొంత ఊరట చెందుతారు. అయితే కొందరు బయటపడకుండా తమలో తాము రోధిస్తుంటారు. ఏడుపుల ద్వారా తాత్కాలిక ఉపశమనం పొందినా సమస్య పరిష్కారానికి కనుచూపు మేరలో కన్పించని పరిస్థితి నెలకొంటే, కొందరు విధిలేని పరిస్థితుల్లో ఆత్మహత్యల వైపు మొగ్గుచూపుతున్నారు. అందుకే ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని మాటలు చెప్పినా, మరెన్ని పథకాలు ప్రకటించినా ఈ ఆత్మహత్యలు ఆగడం లేదు. వ్యవసాయరంగం అంతకంతకు కుదేలైపోతున్నది. ప్రకృతి పెట్టే ఇక్కట్లు కొన్ని అయితే తోటి మానవుడు పెడుతున్న బాధలు మరికొన్ని. ప్రకృతి సిద్ధంగా వస్తున్న ఇక్కట్లు ఎదుర్కోవడానికి మానవుడు కొంతమేరకు సిద్ధమవుతున్నారు, అధిగమించగలుగుతున్నారు. అందులో భాగంగానే ఈ తుఫాన్‌లు, కరవులు, అకాల వర్షాలు, వడగండ్ల వానల భారం మోయగలుగు తున్నారు. కానీ తమకు సేవ చేస్తామంటూ తోటి మను షులు చేస్తున్న మోసాలను భరించలేకపోతున్నారు. అలా గనివారిని ఎదిరించి నిలదీయలేకపోతున్నారు. విత్తే దగ్గర నుంచే రైతుల కష్టాలు ఆరంభమవుతున్నాయి. నకిలీ, నాసిరకంతో మోసపోయి పెట్టిన పెట్టుబడి సర్వం కోల్పో యినప్పు డు ఆగ్రహావేశాలు ఆపుకోలేక తమను మోసం చేసిన వారిని నిలదీస్తే దాడిచేయడానికి వచ్చారని రైతు లపై కేసులు పెట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా వ్యవసాయరంగం సంక్షో భంలో కూరుకుపోతున్నది. యేటా వేలాది మంది అన్న దాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. జాతీయ నేరాల నమోదు సంస్థ 1995 నుంచి రైతుల ఆత్మహత్యలను నమోదు చేస్తున్నది. ఇప్పటివరకు ఎన్ని లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారో పరిశీలిస్తే ఆవేదన చెందని గుండె ఉండదు. తాము చనిపోతే ప్రభుత్వం అందించే సహాయంతో తమ కుటుంబ సమస్యలు ము ఖ్యంగా కుమార్తెల పెళ్లిళ్లు అవుతాయని ఏకంగా లేఖరాసి పెట్టి చనిపోయిన అన్నదాతలు ఎందరో ఉన్నారు. రోజూ పదుల సంఖ్యలో దేశవ్యాప్తంగా పిట్టల్లా రాలిపోతున్నారు. ప్రభుత్వాలు రైతు సంక్షేమంకోసం ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. కొత్తకొత్త పథకాలతో కోట్లాది రూపాయలు సబ్సిడీ రూపేణ గుప్పిస్తున్నారు. మరెన్నో మాటలు చెప్తున్నారు. కానీ అవేమీ ఈ ఆత్మహత్యలను ఆపలేకపో తున్నాయి. వ్యవసాయ సంక్షోభానికి అడ్డంపడుతున్నాయి. లోపం ఎక్కడుంది? కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? తదితర వన్నీ పాలకులకు తెలియని విషయాలు కాదు. కానీ పరిష్కారం వైపు అడుగులు వేయలేకపోతున్నారు. దీనికితోడు 1991లో ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలు, ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభా వం చూపాయి. ఈ బాధలు భరించలేక లక్షలాది మంది రైతులు వ్యవసాయాన్ని వదిలివేస్తున్నట్లు జాతీయ గ్రామీ ణాభివృద్ధిశాఖ నివేదికలే వెల్లడిస్తున్నాయి. ఒక నాడు వ్యవసాయం చేయడం ఎంతో గౌరవప్రదంగా భావించే రైతులు నేడు వ్యవసాయం శాపంగా పరిణమించిందని వాపోతున్నారు. వ్యవసాయం కాక మరేదైన జీవనవిధా నం ఎన్నుకోగలిగితే చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా రైతులు వ్యవసాయం విడిచి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రపంచ మొత్తంలో ఎక్కడైనా ప్రజలను బతికించడానికి రైతులు పంటలు పండిస్తారు. అలాంటి అన్నదాతలే స్వయంగా ప్రాణాలు తీసుకునే పరిస్థితి దాపురించిందంటే లోపం ఎక్కడుందో కనుగొని పరిష్కరించాల్సిన తరుణం ఆసన్నమైంది.

విచారణకు భయపడిపారిపోయే వ్యక్తి తన నేరాన్ని తనకు తానుగా అంగీకరించినట్టే.



వైరస్

యేదాదికి ఒక చెడు అలవాటు మానితే, కొంతకాలానికి దుష్టుడు కూడా మంచివాడుగా మారగలడు.



ఫ్రాంక్లిన్

# ప్రజావాక్కు



## అవార్డులు ఇవ్వడంలోనూ వివక్షే

జ్ఞానపీఠ్, పద్మశ్రీ, పద్మవిభూషణ్, ద్రోణాచార్య, అర్జున, భారతరత్నవంటి అత్యున్నత అవార్డులనుగతంలో ఎంతో మంది అందుకున్నారు.అయితే వారంతాతాము న్న రంగాలకు చేసిన సేవ, ప్రతిభ ఆధారంగానే ఈ అవార్డులను అందుకోగలిగారు.కానీ ఇప్పుడుకొందరు యోగ్యత, అర్హత లేకపోయినా తమ వారికి అవార్డులు ఇప్పించుకోవటం కోసంకేంద్రప్రభుత్వంలో మంత్రులుగాపనిచేస్తున్న వారిపై ఒత్తిడితెస్తున్నారు.బతిమలాడుకుంటున్నారు.నానా ప్రయత్నాలు చేస్తున్నారు.మరోపక్క కేంద్రప్రభుత్వం యోగ్యత, అర్హత ఉన్నవారికి కాకుండా తమకు ఇష్టమైన వారికి అవార్డులు ఇస్తున్నారు. రాజకీయ నాయకుల జోక్యంతో అన్ని వ్యవస్థల్లోనే అవార్డుల కమిటీ కూడా వివాదస్పదమవుతూ విమర్శలకు గురవుతోంది.

-మిథునం, హైదరాబాద్

## ఉపాధి హామీ 150 రోజులకు పెంచాలి

ఉపాధి హామీలో వంద రోజులును కనీసంగా 150 రోజులకు పెంచవలసిన అవసరం ఎంత అయిన వున్నది. ఎందుకనిఅస్తవ్యస్త వాతావరణ పరిస్థితులు అగమ్యగోచరమైన ఋతువుల నేపథ్యంలో స్థిరమైనపని పౌరుల ప్రాథమిక హక్కు.కాబట్టి ఆ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. నిజమైన ఆర్థిక ప్రజాస్వామ్యంను నెలకొల్పే ఆదేశిక సూత్రాలఅమలుకు రాజ్యం బాధ్యత వహించాలి. కాబట్టి ఆదిశగా అడుగులువేయాలి.ఇలా చేయడం ద్వారా రెండు ప్రయోజనాలున్నాయి.ఒకటి ఎక్కువ పని దినాలు కల్పించడంవల్ల కొనుగోలు శక్తిని పెంచడం తద్వారా గిరాకిని పెంచడం తద్వారా ఉత్పాదకతను పెంచుతుంది.

-భారత అవినాష్, జనగామ

## టీవీ ధారావాహికలపై సెన్సార్?

ప్రస్తుతం టీ.వీల్లో అన్నిఛానల్స్‌లో ప్రసారమయ్యే ధారావాహికలలో ఎక్కువగా ఇతరులకు హాని కలిగించడం, వివాహేతరసంబంధాలు, తనకు కావాల్సింది దక్కించుకునేందుకు ఏమైనా చేయడం లాంటివి చూపిస్తున్నారు. ఈదృశ్యాలు ఎక్కువగా నేటి యువతరంపై ప్రభావం పడవచ్చు. సినిమాలు మాదిరిగానే సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ పొందిన తర్వాతే టీ.వీల్లో ధారావాహికలు ప్రసారం అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## ఎవరున్నా జరిగేవే

ఎస్.ఎల్.బి.సిలో ఎనిమిది మంది చిక్కుకొని గల్లంతయిన సంఘటన ప్రమాదవశాత్తు జరిగినదేకాని రేవంత్‌రెడ్డో, కాంగ్రెస్ ప్రభుత్వమో కావాలని చేసిందికాదు.ప్రభుత్వంలో ఏ పార్టీవారు ఉన్నా ఇలాంటి దుర్ఘటనలు జరుగుతూనే ఉంటాయి. బి.ఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా చాలా జరిగాయి. దీనికి ఎవరూ ఏమీ చేయలేరు. ఎందుకంటే ప్రమాదాలు జరుగుతాయని ముందే ఎవరూ ఊహించలేరు కనుక. తెలంగాణలో అనే ఏముంది? దేశంలోని వివిధ రాష్ట్రాలలో కూడా ఎన్నో దుర్ఘటనలుజరుగుతున్నాయి.ఇటీవల ముగిసిన కుంభమేళాలో ఎంతో మంది మరణించారు. ఢిల్లీలో రైలు ప్రమాదం జరిగింది. ఉత్తరాఖండ్‌లో తరచు కొండచెరియలు విరిగిదారినపోతున్న జనాల మీద పడుతుంటాయి. ఇవన్నీ ఏంటి? ప్రమాదాలు కావా?

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## మరుగునపడుతున్న మానవ సంబంధాలు

మానవ సంబంధాలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. సంసారబంధాలు కూడా ధర్మం తప్పుతున్నాయి.భార్యా భర్తలు వివాహేతర కారణాలవల్ల ఒకరి నొకరిని అనేక పద్ధతుల ద్వారా హతమార్చడం, అలాగే ఆస్తితగాదాలతో కొడుకులు, తండ్రులు, తల్లులు కూడా హత్యలకు పాల్పడడం, వావివరుసలకు విలువ ఇవ్వకుండా మానభంగాలకు మరగడం, ఇటువంటి వార్తలు నిత్యందర్శనమిస్తున్నాయి. ప్రేమలు విఫలం కావడం, పెళ్ళికి పెద్దలు అనుమతించకపోవడం, సెల్‌ఫోను కొనలేదని, నిత్యం వాటితో కాలక్షేపం చేయవద్దని మందలించినందుకు, వారికి చావే శరణ్యమవుతోంది. ఇకపోతే ఆర్థిక సమస్యలు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇటువంటి సామాజిక సమస్యల మీద ప్రభుత్వాలు తక్షణం స్పందించి ఈ అర్థాంతర మరణాలు, అనైతిక సంబంధాలను అరికట్టే చర్యలు తీసుకోవాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## వికలాంగులకు మరుగుదొడ్ల సౌకర్యం

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ వైకల్యాలు కలిగిన వికలాంగుల సౌకర్యార్థం మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. వారి నిత్య అవసరాల నిమిత్తం రోజువారి ప్రయాణంలో రైల్వే స్టేషన్‌లో బస్సు స్టేషన్‌లో వారికి అనుకూలమైన మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. కొన్ని ప్రాంతాలలో ఉన్న సులబ్ కాంప్లెక్స్‌లలో వీరికి డబ్బులు తీసుకోకుండా ఉచిత సేవలు అందించాలి.ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణ మెటీరియల్ ఉచితంగా సరఫరా చేయాలి

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నదుల పరిరక్షణ అందరి బాధ్యత

**రాజకీయ నాయకుల దూరదృష్టి, అధికార యంత్రాంగం కార్యాచరణ, స్వతంత్ర న్యాయ వ్యవస్థలు స్వప్రయోజనాలకు కాకుండా ప్రజా భవిష్యత్తుకు, శ్రేయస్సుకు అంకిత భావంతో పనిచేయాలి. ముఖ్యంగా అడవులను రక్షించడానికి, క్షీణించిన భూములను తిరిగి నాటడం నీటి చక్రాన్ని పునరుద్ధరించడానికి, నీటిని స్థిరంగా నిర్వహించడానికి స్థానికంగా ఉన్నవారికి అధికారం ఇవ్వడం ప్రధానం. అడవులే నదుల మనుగడకు ప్రధానమైనవి. ప్రజలు నదులపై అవగాహన పెంచుకొని అన్ని రకాల కాలుష్యాన్ని నివారించి, రాబోయే భవిష్యత్తు తరానికి మంచి భూమిని, నదులని, పర్యావరణాన్ని అందించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పనిచేయాలి.**

డాక్టర్ ఎ. భాగ్యరాజ్

మంచి నీరు మానవులు, వన్యప్రాణుల మనుగడకు కీలకమైనది. నదులు ప్రపంచంలోని మంచినీటిలో ఎక్కువ భాగాన్ని అందిస్తాయి. ఇది త్రాగడానికి, వంటకు, పరిశుభ్రతకు, పరిశ్రమల అవసరానికి ప్రముఖమైనది. కొన్ని వేల సంవత్సరాల క్రితం మొహంజదారో, హరప్పా,సింధూ నాగరికత పుట్టింది నదీపరివాహక ప్రాంతాలలోనే. భారత దేశంలో సుమారుగా 400కి పైగా నదులున్నాయి. మన రాష్ట్రం అనేక శతాబ్దాల నాటి సాగు నీటిపారుదల వారసత్వాన్ని కలిగి ఉంది. గతంలో పురాతన రాజులు,పాలకులు ప్రజలకు నీటిపారుదల సామర్థ్యాన్ని తాగునీటిని సృష్టించడానికి నదులపై కట్టలు ఆనకట్టలను నిర్మించడం ద్వారా కృత్రిమ సరస్సులు జలాశయాలను నిర్మించారు. రాష్ట్రంలో తూర్పున ప్రవహించే నదులలో ఎక్కువ భాగం పశ్చిమ తూర్పు కనుమల నుండి బంగాళాఖాతం వరకు నీళ్ల రావడం మన రాష్ట్రానికి ప్రకృతీ ప్రసాదం. ఆంధ్రప్రదేశ్లో 40 పెద్ద,మధ్య, చిన్నతరహా నదులున్నాయి. జనాభాలో దాదాపు 70శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. మన రాష్ట్రంలో నాగావళి, కృష్ణ, గోదావరి, వంశధార, పెన్నానదులు ప్రముఖమైనది. 19వ శతాబ్దంలో రాష్ట్రంలోని తీరప్రాంత జిల్లాల్లో లక్షలాది ఎకరాల బంజరు భూములను అన్నపూర్ణగా మార్చిన సర్ ఆర్థర్ కాటన్, సర్ చార్లెస్ అలెగ్జాండర్ ఓర్ కల్నల్ జాన్ పెన్నీ క్విక్విక్ వంటి వారు పూజ్యులు. నదుల కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం ప్రాముఖ్యత 1997లో, ఆనకట్టల వల్ల ప్రభావితమైన ప్రజల మొదటి అంతర్జాతీయ సమావేశం బ్రెజిల్లోని కురిటిబాలో 20 దేశాల ప్రతినిధులు మార్చి 14ని ఆనకట్టలకు వ్యతిరేకంగా నదులు, నీరు జీవం కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవంగా ప్రకటించడానికి అంగీకరించారు. నదులు, ఇతర జల వనరులు పరీవాహక ప్రాంతాల క్షీణతకు వ్యతిరేకంగా కలిసి పనిచేయడానికి. ఈ రోజును నేడు అంతర్జాతీయ నదుల కోసం కార్యాచరణ దినోత్సవంగా పిలుస్తారు. ఈ రోజుని మానవుల జీవితాల్లో నదుల ప్రాముఖ్యతను, పరిశుభ్రమైన ప్రవహించే నీటిని సమానంగా పొందేలా ప్రోత్సహించడానికి, రక్షించడానికి, మానవ కార్యకలాపాల కారణంగా నదుల వంటి మంచినీటి పర్యావరణ వ్యవస్థలు ఎలా కలుషితమవుతున్నాయో అవగాహన పెంచడానికి జరుపుకుంటారు. నదులు నీటిపారుదల నీటికిప్రాథమిక వనరు, పెద్దఎత్తున వ్యవసాయాన్ని, ఆహారఉత్పత్తిని కొనసాగించడానికి నదీ ఆధారిత నీటిపారుదలపై ఎక్కువగా ఆధారపడతాయి. నదులు జంతువులు, చేపలు, ఉభయచరాలు,పక్షులు జలమొక్కలతో సహా విస్తృత శ్రేణి వృక్ష జంతు జాతులకు ఆవాసాలను అందిస్తాయి. ఆరోగ్యకరమైన నదీ వ్యవస్థలు జీవవైవిధ్యం పర్యావరణ స్థిరత్వానికి దోహదం చేస్తాయి. నదులు ఎత్తైన ప్రాంతాల నుండి వరద మైదానాలు, డెల్టాలకు అవక్షేపాలు పోషకాలను తీసుకువెళతాయి. ఈ ప్రక్రియ నేలను సుసంపన్నం చేస్తుంది. దానిని సారవంతమైనదిగా వ్యవసాయానికి అనుకూలంగా చేస్తుంది. ఉదాహరణకు, గోదావరి కృష్ణ. నదుల వార్షిక వరదలు పరీవాహక (డెల్టా) ప్రాంతంలో భూమిని సారవంతంగా చేస్తాయి. నదులు ఉష్ణోగ్రత, తేమను ప్రభావితం చేయడం ద్వారా ప్రాంతీయ వాతావరణాలను నియంత్రించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి, సహజ శీతలీకరణ వ్యవస్థలుగా పనిచేస్తాయి. భూగర్భ జలాలను పెంచడం జలాశయాలను తిరిగి నింపడంద్వారా నీటి చక్రాన్ని నిర్వహించడానికి సహాయపడతాయి. వరదల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. చుట్టూవున్న ప్రాంతాలకు కరువు పరిస్థితుల



ను నివారిస్తాయి. ప్రధాన నదులు జల విద్యుత్తును, అదే సమయంలో శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. నదులు చారిత్రాత్మకంగా వస్తువులు ప్రజలను రవాణా చేయడానికి సహజ రహదారులుగా పనిచేస్తున్నాయి. భారీ వస్తువుల తరలింపును సులభతరం చేస్తాయి.రవాణా ఖర్చులను తగ్గిస్తాయి. పడవ ప్రయాణం వన్యప్రాణుల పరిశీలన వంటి కార్యకలాపాల కోసం పర్యాటకులను ఆకర్షిస్తాయి. నదుల వెంబడి పర్యాటకం స్థానిక ఆర్థికవ్యవస్థలకు దోహదం చేస్తుంది.చిన్న వ్యాపారాలకు అవకాశం ఇస్తుంది. స్థానికంగా వాణిజ్య మత్స్య సంపద ద్వారా లక్షలాది మందికి ఆహారం ఆదాయాన్ని అందిస్తాయి.అనేక పరిశ్రమలకు శీతలీకరణ, ప్రాసెసింగ్ వ్యర్థాల తొలగింపు కోసం నది నీటిపై ఆధారపడతాయి. ప్రపంచవ్యాప్తంగా నదులు ప్రమాదంలో ఉన్నాయి. వాతావరణ మార్పు, బాధ్యతారహిత అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల క్రమంగా విచ్ఛిన్నమవుతున్నాయి. కలుషితమవుతున్నాయి, బలహీనపడుతున్నాయి. నదులు ప్రమాదంలో ఉన్నప్పుడు, మన సమీపభవిష్యత్తు కూడా ప్రమాదంలో ఉంటుంది. ఆరోగ్యకరమైన నదులు పరిశుభ్రమైన నీటిని పొందే అవకాశం మనందరినీ కలిపేది ప్రాథమిక మానవ హక్కులు. నదుల తరపున చర్య తీసుకోవడం ద్వారా, నదులను రక్షించే శక్తి మనకు ఉందని సమాజాలకు స్వచ్ఛమైన, స్వేచ్ఛగా ప్రవహించే నీటిని పొందే అవకాశం ఉందని, నదులను చివరికి వాటి జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే నిర్ణయాలలో పాల్గొనే హక్కు, బాధ్యత అందరిపైనా ఉంది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఆనకట్టలను తొలగించడానికి పనిచేస్తున్నా, నీటి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నా, లేదా నదీ అభివృద్ధిలో తమ అభిప్రాయాన్ని కలిగి ఉన్నా, మనం కలిసిపనిచేయాలి.ఎందుకంటే ప్రతి నది భవిష్యత్తు మన భూమి భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మంచినీటి వనరులు 1970 నుండి 83శాతం క్షీణతను చవిచూశాయి. ఇది భూసంబంధమైన లేదా సముద్ర వాతావరణాలలోఅనుభవించిన రేటు కంటే రెండింతలు. వాటికి మన సహాయం అవసరం. ప్రస్తుత ఆధునిక రోజుల్లో అధిక నిర్మాణాలు, ఆక్రమణ కార్యకలాపాలు పారిశ్రామిక మురుగునీటిని నదులలోకి వదలడం వల్ల మంచినీటి పర్యావరణ వ్యవస్థలుభూమి ఉపరితలంపై అత్యంత దారుణంగా క్షీణించాయి. ప్రపంచవ్యాప్తంగా, ప్రతిరోజూ రెండు మిలియన్ (20లక్షల) టన్నులకు పైగా మురుగునీరు పారిశ్రామిక,వ్యవసాయ వ్యర్థాలు నీటిలోకి విడుదలవుతున్నాయి. ముఖ్యంగా మన దేశంలో, యమునా నది అత్యంత కలుషితమైన వాటిలో ఒకటిగా విస్తృతంగా గుర్తించబడింది. ముఖ్యంగా న్యూఢిల్లీ దిగువన, ఇక్కడ గణనీయమైన పారిశ్రామిక గృహ వ్యర్థాలు విడుదల వుతాయి. ప్రపంచవ్యాప్తంగా చాలా నదులు కొంత మంది మానవుల దురాశ కారణంగా ప్రతి రోజూ కలుషితమవుతున్నాయి. ఇది మనుగడ కోసం నదులపై ఆధారపడిన సమా జాలను ప్రభావితం చేస్తుంది. భూమి స్థిరమైన అభివృద్ధి కోసం నదీ వనరులను అటువంటి కలుషితాల నుండి రక్షించాలి.ప్రస్తుతం నెదర్లాండ్స్ ప్రపంచంలోనే అత్యుత్తమ నదీనిర్వహణ వ్యవస్థను కలిగి ఉంది. సరస్సు, నది లేదా సముద్రం వంటి నీటి వనరుల దగ్గర చెత్త వేయకూడదు. నదీ పరీవాహక ప్రాంతాలలో ఒడ్డున కూడా చెట్లు నాటాలి. చెట్లు నేల కోతను అరికట్టడమే కాకుండా నేల తేమను నిలుపుకుంటాయి. నదీ కాలువలపై నిర్మాణాల ద్వారా లేదా వ్యర్థాలను పారవేయడం ద్వారా సహజ నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నారు. రాజకీయనాయకుల దూరదృష్టి, అధికార యంత్రాంగం కార్యాచరణ, స్వతంత్ర న్యాయ వ్యవస్థలు స్వప్రయోజనాలకు కాకుండా ప్రజా భవిష్యత్తుకు, శ్రేయస్సుకు అంకిత భావంతో పనిచేయాలి. ముఖ్యంగా అడవులను రక్షించడానికి, క్షీణించిన భూములను తిరిగి నాటడం నీటిచక్రాన్ని పునరుద్ధరించడానికి, నీటిని స్థిరంగా నిర్వహించడానికి స్థానికంగా ఉన్నవారికి అధికారం ఇవ్వడం ప్రధానం. అడవులే నదుల మనుగడకు ప్రధానమైనవి. ప్రజలు నదులపై అవగాహన పెంచుకొని అన్ని రకాల కాలుష్యాన్ని నివారించి, రాబోయే భవిష్యత్తు తరానికి మంచి భూమిని, నదులని, పర్యావరణాన్ని అందించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పనిచేయాలి. •

# ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లేదా?

మేకిరి దామోదర్

ప్రభుత్వాలకు, ప్రజలకు అనుసంధానకర్తలుగా ఉద్యోగులు వారి విధులను నిర్వహిస్తూ ఉంటారు. ప్రభుత్వాలు మారినా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన వివిధ రకాల బిల్లులు ఈ కుబేరులో పెండింగ్లో ఉండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీంతో వారి బాధ వర్ణనాతీతం. గత మూడేళ్ల నుంచి వివిధ రకాల బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న వారి బిల్లులను చెల్లించడంలేదు. ఉద్యోగ విరమణ పొందిన వారి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు ఇతర బిల్లులను చెల్లించడం లేదు. చివరకు చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన బిల్లులను చెల్లించడంలో కూడా ప్రభుత్వం అలసత్వం వహిస్తున్నది. గత పాలకుల హయాంలో నుంచి ఉద్యోగుల ఏ ఒక్క సమస్యను పరిష్కరించకపోగా వాటిఊసే ఎత్తకుండా ఫ్రెండ్లీ గవర్నమెంట్ అంటూ కాలాన్ని వెల్లదీసినా ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్లు భరించారు. పాలకులు మారితే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఉద్యోగులంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండో పీఆర్సీ కమిటీ ఏర్పడింది. 2023జూలై ఒకటో తేదీ నుంచి కొత్త పిఆర్సీ అమలు కావలసి ఉన్నది. 19నెలలు గడిచిపోయినా పిఆర్సీ నివేదికను ఇప్పటివరకు ప్రభుత్వానికి సమర్పించలేదు. 2025-26 బడ్జెట్లో డిఏలు, పీఆర్సీ అమలు గురించి ఏమైనా ప్రస్తావనో, బడ్జెట్ కేటాయింపులో ఉంటాయేమో అని ఉద్యోగులు 'చకోర పక్షుల్లా' ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో 3.69 లక్షల మంది ఉద్యోగులు, 2.87 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన మాత్రం ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ చెల్లిస్తుంది. ఇదే ఉద్యోగులకు ఇచ్చే అతి పెద్ద ప్రయోజనంగా చెప్పుకుంటున్నారు. పస్తులుండి ఉద్యోగులు విధులు నిర్వహించాలా!. మాకు కుటుంబం,సమస్యలు, అనారోగ్యం ఇవేవీ ఉండవా? వీటిని పరిష్కరించరా? ఒక్కసారి మానవీయ కోణంలో ఆలోచించండి. గత మూడేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఏ ఒక్క సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు. ఇది వాస్తవం కాదా!. ధర్నాలు చేస్తే కేసులు పెడుతున్నారు. సమస్యలు పరిష్కరించకపోతిరి, పట్టించుకోండని వినతి పత్రాలు ఇస్తే పట్టించుకోకపోతిరి. మా సమస్యలు గత, ప్రస్తుత ప్రభుత్వాల కాలయాపనలతో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఉద్యోగులకు నాలుగుడిఏలు పెండింగ్లో ఉన్నాయి. ఈ ఏడాది జనవరితో కలిపితే ఐదు డిఏలు అవుతాయి. డిఏల మంజూరీలో కూడా తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు వారి మేనిఫెస్టోలో పిఆర్సీ ప్రకటిస్తామని, సిపిఎస్ రద్దు, పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డు సమస్యలు లాంటి హామీలను అధికారం చేపట్టగానే పరిష్కరిస్తామని చెప్పింది. దానిపై ఇప్పటివరకు అంతే? అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. సమస్యలన్నీ పెండింగ్లో ఉన్నాయి. ఇలా గత, ప్రస్తుత ప్రభుత్వాలకు ఉద్యోగులు తమ సేవలతో పేరు ప్రతిష్టలు తెప్పిస్తున్నప్పటికీ, సమస్యలను మాత్రం పెడచెవిన పెడుతున్నారనే ఆవేదనలో ఉన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం ఇంకెప్పుడు చేస్తారు? ఇంకెన్నేళ్లు ఓపిక పట్టాలి.2025-26 రాష్ట్ర ఆర్థిక బడ్జెట్ రాబోతుంది. దీంట్లోనైనా ఉద్యోగుల సమస్యలు పరి ష్కరించి వారి మనోవేదనను తీర్చాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందనేది విస్మరించరాదు. ఫ్రెండ్లీ గవర్నమెంట్ అనే మాటలు సమస్యలను పరిష్కరించలేవు కదా!. అనేక సమస్యలతో సతమతమవుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. గతం నుండి సమస్యల పరిష్కారం కోసం ఆర్థికశాఖ అధికారులను కలిస్తే ప్రభుత్వాన్ని కలవమంటారు. ప్రభుత్వమంటే ఎవరు? అధి కారులు ప్రభుత్వంలో భాగం కాదా!. మా సమస్యలు పరి ష్కారం కాకపోతే ఏం చేయాలి? ఎవరిని అడగాలి. చావే దిక్కా అంటూ సగటు ఉద్యోగి తన ఆవేదనను వెళ్లబోసు కుంటున్నాడు. ఈ కుబేర్లో రూ.10వేల కోట్ల వరకు బిల్లులు పెండింగ్. 19 నెలలు గడిచినా పిఆర్సీ నివేదిక జాడే లేదు. జనవరితో కలిపితే 5డీఏలు కూడా పెండింగ్‌లోనే ఉన్నా యి. సీపీఎస్ రద్దుపై స్పష్టత లేదు. స్థానికత కోల్పోయిన 317 జీవో బాధితులకు న్యాయం జరిగనేలేదు. ఆర్థిక, ఆర్థి కేతర అంశాలపై దృష్టిసారించాలి. ఇన్ని సమస్యల పరిష్కా రానికి, ఇంకెన్నాళ్లనే ఆవేదన అయినా ఇంకా అమానవీ యంగా పరిష్కారంపై దృష్టి సారించని ప్రభుత్వ ఉదాసీ నతపై ఆవేదనతో కూడిన ఆగ్రహానికి లోనవుతున్నారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ఏ ఒక్కటి కూడా పట్టిం చుకోని, పరిష్కరించని ప్రభుత్వాల విధానాలను నిలదీయని తీరుతో ఉద్యోగ సంఘాల నాయకత్వాలపై గుర్రుతో ఉన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో దాటవేసే ధోరణిని ఎండగడుతూ ఉద్యోగుల పక్షాననిలబడి ఉద్యమాన్ని చేస్తారా! న్యాయమైన సమస్యలు పరిష్కరించని ప్రభుత్వాలకు వంత పాడుతారా ఒక్కసారి ఆలోచించుకోండి. ఈ బడ్జెట్లో ఈ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యోగుల ఆగ్రహానికి మొదటగా బలి కావాల్సింది ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకత్వాలే సుమా!. మీ పదవుల కోసమో ప్రభావం కోసమో సగటు ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టకండి. పరిష్కారానికి వెంటనే దారులువెతకండి. ఈ బడ్జెట్లో పరిష్కారాన్ని ప్రభుత్వం చేపట్టేలా ఒత్తిడి తీసుకురండి. •

# కుటుంబాలను కబళిస్తున్న బెట్టింగ్ భూతం

జి. అజయ్ కుమార్

బెట్టింగ్ అనేది ఆన్‌లైన్ అయినా, ఆఫ్‌లైన్ అయినా జీవితాలు ఆగం కావడం కాయం. ఒక ఆటపై, పరిస్థితిపై డబ్బుని పెట్టి ఎక్కువ డబ్బురావాలని ఆశించడం, అది క్రికెట్, ఫుట్బాల్, క్యాసినో, ఆన్‌లైన్ రమ్మీ, ఆన్‌లైన్ గేమింగ్, ఎన్నికలు, కోడిపందాలు అని చాలా రకాలకు విస్తరించి వుంది. బెట్టింగ్ ఊబిలో ఎక్కువగా మధ్య తరగతి ప్రజలు, యువకులు చిక్కుకుంటున్నారు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశ, కుటుంబ ఆర్థిక పరిస్థితులు వీరిని బెట్టింగ్‌కు బానిసలుగా మారుస్తున్నాయి. వీరితోపాటు బాగా చదువుకున్న వారు సమాజంలో ఉన్నత స్థితిలో వున్నవారు కూడా ఈ బెట్టింగ్‌కు బలియైన వారి జాబితాలో వున్నారు. ప్రతీ రోజు ఎక్కడో ఒక దగ్గర ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవడం వింటూనే వున్నా, బెట్టింగు వ్యసనం వల్ల డబ్బుల కోసం లోన్ యాప్స్‌లో అప్పులు అధిక వడ్డీలకు తీసుకొని అవి చెల్లించలేక మానసిక ఒత్తిడికిలోనై చాలా మంది యువత విపరీత నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇది సమాజానికి ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ వినియోగదారులను ఆకర్షించేందుకు తక్కువ పెట్టుబడి పెట్టుకునే అవకాశం కల్పిస్తాయి. మొదట కొంత డబ్బు గెలిచిన తరువాత మరింత పెట్టుబడి పెట్టేందుకు ప్రేరేపిస్తాయి. చివరికి మొత్తం డబ్బుకోల్పోయే స్థితికి తీసుకువస్తాయి. ఇది బెట్టింగ్ మాఫియాలకి వెన్నతో పెట్టిన విద్య. మొదట ఆశచూపి చివరికి ఆగం చేస్తాయి. క్షణిక ఆనందాన్ని ఇచ్చి దీర్ఘకాల నష్టాలను మిగిలిస్తాయి. మధ్య తరగతి ప్రజలు డబ్బుకోసం ప్రతిరోజు చాలా పోరాడాల్సి వస్తుంది. వారి జీవితాల్లో డబ్బే అన్నిటినీ నిర్ణయించే వస్తువు. ఇదే బెట్టింగ్‌కు బానిసలుగా చాలామందిని మారుస్తుంది. తక్కువ కాలంలో, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయనే అత్యాశ, అలాగే కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందే ఆశ చాలా మందిని బెట్టింగ్ వైపు మల్లెలా చేస్తోంది. సాంకేతికత పెరిగే కొద్దీ అందరికి ఇంటర్ నెట్ అందుబాటులోకి వచ్చింది. పూట గడవని ఇళ్లు వుంటాయేమో గానీ ప్రస్తుతం సెల్‌ఫోన్, ఇంటర్ నెట్ లేని ఇల్లులు మాత్రం లేవు అనేలా వుంది ప్రస్తుతం సమాజంలో. అది మంచికి వాడితే పర్లేదు కానీ చెడుకు వాడితేనే ఇబ్బంది. వివిధ సోషల్ మీడియా




వేదికల ద్వారా (ఇన్‌స్టాగ్రామ్,ఫేస్‌బుక్స్, ట్విట్టర్ వంటి మరెన్నో) చాలా మంది బాధ్యత లేని ఇన్ఫ్లుఎన్సర్స్ , సెలబ్రెటీలు బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేయడం, వారిని గుడ్డిగా ఆరాధించే, అనుసరించే సామాన్య జనం వాటికి బానిసలుగా మారడం ప్రస్తుతం సమాజంలో ఒక పరిపాటిగా మారింది. నేను బెట్టింగ్ ఆడి ఇంత గెలిచాను అంత గెలిచాను అని ఫేక్ వీడియోల ద్వారా పబ్లిసిటీ చేసుకోవడం, తెలిసిన స్నేహితులు కూడా నమ్మి ఒత్తిడి తేవడం వంటివి బెట్టింగ్‌ను చాలా మందికి వ్యసనంలా మారేలా చేస్తున్నాయి. భారత దేశంలో బెట్టింగ్ యాప్స్‌కి పర్మిషన్స్ లేకున్నా ఇల్లిగల్ అని తెలిసినా కూడా వ్యవస్థలో వున్న లోపాలు, మానిటరింగ్ సరిగా లేకపోవడంవల్ల వివిధ మార్గాల ద్వారా బెట్టింగ్ మాఫియా వాటినీ జనాలకు చేరువచేస్తోంది, అలాగే త్వరతగతిన డబ్బు సంపాదించాలనే ఆశ కూడా బెట్టింగ్‌కు బానిసగా మారుస్తుంది. వ్యక్తిగత జీవితాలు నష్టపోవడం, ఆర్థిక సంక్షోభం, అప్పుల పాలు అవ్వడం, కుటుంబ కలహాలు రావడం, కుటుంబాలు ఛిద్రం కావడం, ఆత్మహత్యలకు పాల్పడడం, నేర ప్రవృత్తి పెరగడం, శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు రావడం,ఇలా వ్యక్తిగత జీవితాలను,కుటుంబాలను సర్వనాశనం చేసి సమాజంపై చెడు ప్రభావాన్ని చూపిస్తుంది.ఆన్లైన్ బెట్టింగ్‌యాప్స్‌పై ప్రభుత్వాలు శాశ్వత నిషేధం విధించాలి. బెట్టింగ్ మాఫియాపై, వాటిని ప్రమోట్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. యువతలో, ప్రజలలో బెట్టింగ్‌ల వల్లకలిగే నష్టాల గురించి అవగాహన కల్పించడం, నష్టపోయిన వారి జీవితాలను ఉదహరించడం వంటివి చేయాలి. కుటుంబ సభ్యులు తమపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అదేపనిగా మొబైల్ వాడడం, సోషల్ మీడియాలో గంటల తరబడి ఉండడం వంటివి గమనించగానే వారిని హెచ్చరించడం, మానసిక ఆరోగ్యంపై అవగహన కల్పించడం వంటివిచేయాలి. ఎవరైనా బెట్టింగ్‌లో నష్టపోయిన వారు వున్నా వారికి మద్దతుగా నిలిచి వారిని దాని నుండి బయట పడేలా కౌన్సిలింగ్ లాంటివి ఇప్పించాలి. అలా చేస్తేవారిలో ఆత్మహత్యా ఆలోచనలు తగ్గుతాయి. బెట్టింగ్ అనేది ఒకసారి మొదలైతే అది జీవితాలను చిదిమేసే దాకా వదలదు. అది వ్యసనంగా మారకముందే గుర్తించి నిరోధించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఇందులో ప్రభుత్వాలు, కుటుంబాల పాత్ర ఎంతో ముఖ్యం. బెట్టింగ్ మిగిల్చే నష్టం తరతరాలను చిదిమేస్తుంది. చైతన్యంతో ప్రయత్నించకపోతే సమాజం అనేక విధాలుగా నష్టపోతుంది. కష్టపడకుండా వచ్చేది ఏది కష్టపెట్టకుండా మాత్రం పోదు అనే వాస్తవాన్ని విస్మరించరాదు. •

## జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

ఒంగోలు, ప్రభాతవార్త

పచ్చటి పొలాలకు, అందమైన జీవనానికి ప్రతీక అయిన హోలీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ మంత్రి డోలా స్వామి, ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావులు హృదయపూర్వక హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రంగుల పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని, ఐక్యతను, ప్రేమను నింపాలని సత్సంగతి, శుభాభి వృద్ధి, సంతోషంతో మీరు అనుకున్న లక్ష్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.






# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి



**- జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా**

ఒంగోలు, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి ఆర్థిక తోడ్పాటు కల్పిస్తూ అదనపు సాయంగా రూ.50వేలు నుండి ఒక లక్షల రూపాయలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఈ విషయమై అవగాహన కల్పిస్తూ త్వరగా ఇల్లు నిర్మించుకునేలా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి గృహ నిర్మాణాల పురోగతి, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలు, ఐజీఓటీ కర్మయోగి వెబ్ పోర్టల్ నిర్వహణ తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047 లో భాగంగా జిల్లాలో 2029 నాటికి అందరికి గృహ నిర్మాణం అనే లక్ష్యాన్ని సాధించేందుకు అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలు, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు, పీవీటీజీ లబ్ధిదారులకు లక్ష రూపాయలు అదనపు ఆర్థిక సహాయం అందిస్తోందని, క్షేత్ర స్థాయిలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ త్వరగా ఇల్లు నిర్మించుకునేలా దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారులను, ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమెనిటీస్ సెక్రటరీలు అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుని ఇంటిని తనిఖీ చేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి యొక్క ఫొటోను క్యాప్చర్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ, వార్డు ఎమెనిటీస్ సహాయకులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమీషనర్లు ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణంపూర్తి చేసుకునేలా సమన్వయం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మే నెలాఖరు నాటికి జిల్లాలో లక్ష్యం మేరకు 8,839 గృహాలు పూర్తి చేయాలని, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15న మూడో శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలో పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఒక్కొక్క నెల ఒక్కొక్క అంశంతో ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా ఈనెల ప్లాస్టిక్ వాడకం తగ్గించే పద్ధతులపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. అదే సమయంలో క్లాత్ సంచులు, జూట్ బ్యాగ్‌ల వినియోగం పెరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ పరిశుభ్రత, స్థిరమైన పద్ధతుల పాటింపు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంస్థాగత నిర్మాణం, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణలు ఇచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐజీఓటి కర్మయోగి వెబ్ పోర్టల్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానమైందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో సీఎఫ్ఎంఎస్ఐడీ ఉన్న ప్రతి ఉద్యోగికి శిక్షణ ఇవ్వడమే దీని ప్రధాన ఉద్దేశ్యమని, ప్రతి ఉద్యోగి ఈ ప్రక్రియ ద్వారా విధిగా శిక్షణ పొందాల్సి ఉందన్నారు. హార్ట్ ఇన్ గవర్నెన్స్, కోడ్ ఆఫ్ కండక్ట్ ఫర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్, ఓరియంటేషన్ మాడ్యూల్ ఆన్ మిషన్ లైఫ్ అనే మూడు డిజిటల్ శిక్షణలనే ఉద్యోగి పనితీరును ప్రామాణికంగా చేసుకుంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహించినంతకాలం ఈ మూడు శిక్షణల ఆధారంగానే సంస్థాగత నిర్మాణం జరుగుతుందన్నారు. ఒక్కొక్క శిక్షణ కేవలం 18 నిమిషాలు మాత్రమే ఉంటుందని చెప్పారు. శిక్షణ తదుపరి ఆన్‌లైన్‌లో వచ్చే ప్రశ్నావళికి సరైన సమాధానాలు ఇవ్వాలిన సుందన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలకు మెరుగులు పెట్టడానికి 856 శిక్షణ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకునేలా అధికారులు క్షేత్ర స్థాయిలో శిక్షణలు ఇవ్వాల్సి ఉందన్నారు. సమీకృత ఆన్‌లైన్ డిజిటల్ శిక్షణలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జడ్పీ సీఈఓ చిరంజీవి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి శ్రీనివాస రావు, డీపీఓ వెంకట నాయుడు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, సీపీఓ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, డీడీ సోషల్ వెల్ఫేర్ శ్రీ లక్ష్మా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొనగా, క్షేత్ర స్థాయి నుండి మున్సిపల్ కమీషనర్లు, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, ఈవోపీఆర్డీలు, ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

# 2030 నాటికి మూడు వేల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతే లక్ష్యం

- *ఆంధ్రప్రదేశ్‌లో మొదటిగా విద్యుత్ సంస్కరణలు అమలు చేసింది టీడీపీనే*
- *రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్లతో రైతులకు లబ్ధి*
- *ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్*

బల్లికురవ, మార్చి 13, ప్రభాతవార్త

దేశంలో విద్యుత్ సంస్కరణలను మొదటి సారి అమలు చేసింది తెలుగుదేశం పార్టీనే అని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఏపీ అసెంబ్లీలో పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ శాఖపై జరిగిన లఘు చర్చలో భాగంగా గురువారం ఆయన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు విషయాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ గౌరవ సభ్యులకు వివరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ఈఆర్సీని తీసుకువచ్చింది కూడా ఏపీనే అని సందర్భంగా తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగానిన మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాని పేర్కొన్నారు. 1.85 లక్షల కోట్ల పెట్టుబడితో అనకాపల్లి జిల్లా పూడికమడకలో 1,200 ఎకరాల్లో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టును ఎన్టీపీసీ, నెడ్ క్యాప్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న పేర్కొన్నారు. 2030 సంవత్సరం నాటికి మూడు టన్నెల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, ఎగుమతి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు మంత్రి వివరించారు. రిలయన్స్ సంస్థ రాష్ట్రంలో 500 కంప్రెస్ట్ బయో గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీబీజీ ప్లాంట్ల నిర్మాణంలో రాష్ట్రంలోని రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. టాటా రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ తో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకున్న విషయాన్ని మంత్రి ఈ మేరకు గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.49వేల కోట్ల పెట్టుబడ పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 7వేల మెగా వాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాము. అదే విధంఅ బ్యాటరీ స్టోరేజీ సిస్టంను రాష్ట్రంలో తొలిసారి ప్రవేశపెడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం 55 సబ్ స్టేషన్లను రాష్ట్ర వ్యాప్తంగా నిర్మిస్తున్నట్లు మంత్రి సభలో పేర్కొన్నారు. ఏటా 6 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుందని, ఆ వినియోగానికి సమానమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. ఏపీ జెన్కో ద్వారా రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. తద్వారా విద్యుత్ కొనుగోళ్లను కూడా 60 శాతానికి తగ్గించామని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ పథకం వద్దని జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాస్తే.. పథకం ద్వారా మరిన్ని కనెక్షన్లు కావాలని ప్రధానమంత్రికి లేఖ రాసిన ఘనత సీఎం చంద్రబాబుదని అన్నారు. అదే విధంగా పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. మొత్తం 4.5 లక్షల పీఎం కుసుమ్ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో 9 సార్లు కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలై మోయలేని భారాలు మోపారని ఆయన స్పష్టం చేశారు. జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం.. లిఫ్టు ఇరిగేసన్ ద్వారా ఒక్క ఎకరాకు.. చుక్క నీరు కూడా ఇవ్వలేదన్నారు. అదే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై జిల్లా ఎస్పీలతో చర్చించి ప్రత్యక నిఘా ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేసిన జగన్, వైసీపీ నేతలు ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖకు సంబంధించి గౌరవ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.



# నేడు సింగరకొండ తిరునాళ్ల ప్రధాన మహోత్సవం





**- ఏర్పాట్లు పూర్తి - సర్వాంగ సుందరంగా స్వామివారి ఆలయాలు**

అద్దంకి, మార్చి 13, ప్రభాతవార్త

సింగరకొండలోని శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వార్ల 70వ వార్షిక తిరునాళ్ళ మహోత్సవం శ్రీ కోధినామ సంవత్సర పాల్గుణ సుధ త్రయోదశి నుండి ప్రారంభమైయి, పౌర్ణమి శుక్రవారం ప్రధాన తిరునాళ్ళ మహోత్సవం జరగనున్నది. అందుకు అవసరమైన ఏర్పాట్లును ఆలయ అధికారులు, పలు శాఖల సహకారంతో పూర్తి చేశారు. సింగరకొండ పరిసరాలతోపాటు ఆలయాలను సర్వాంగ సుందరంగా విద్యుత్ లైట్ల వెలుగులతో అత్యంత వైభవంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రెండు రోజులుగా తిరునాళ్ళ ఉత్సవాలు, ప్రారంభమైయి ఘనంగా నిర్వహించబడుతున్నాయి. ప్రధానంగా మూడురోజున శుక్రవారం తెల్లవారుజామునుండే తిరునాళ్ళ మహోత్సవం ప్రారంభకానున్నది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను తిరునాళ్ళ నిర్వాహణ సమన్వయ కమిటీ సారధ్యంలో అన్నీ శాఖల అధికారులు సమైఖ్యంగా ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రధాన తిరునాళ్ళ మహోత్సవంను పురస్కరించుకొని విద్యుత్ ప్రభల ఏర్పాటులో నిర్వాహకులు నిమగ్నమై వున్నారు. ఇక తిరునాళ్ళకు వచ్చే వారిని ఆకర్షించేందుకు చిన్నారుల నుండి పెద్దల వరకు, ఆస్వాదించేవిధంగా జైయిట్‌వీల్స్ ఏర్పాటు చేశారు. ఇక వివిధ సామాజిక వర్గాల అన్నదాన సత్రాల నిర్వహకులు పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయ ప్రధాన మదమంచి తిమ్మానాయుడు తిరునాళ్ళను విజయవంతంగా నిర్వహించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను స్వీయ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఇక రెండు రోజుల పాటు ఆలయ దర్శనానికి వస్తున్న వి.ఐ.పిలు, సామాన్యభక్తులకు ఎటువంటి ఆసౌకర్యం జరగకుండా తానే స్వయంగా పర్యవేక్షిస్తూ స్వామి వారి దర్శన విషయంలో అందరినీ సమన్వయ పరుచుకుంటూ ముందుకు సాగుతున్నారు. రెండవ రోజున స్వామివారికి విశేష అభిషేకంతోపాటు 108మంది వేద విద్యార్థులచే వేదపఠనం, స్వస్తిక్ భజనా కార్యక్రమాలు, రాత్రి 7గంటలకు స్వర్ణ వెంకటసుబ్బారావుచే శిష్య బృందంచే కోలాటం ప్రదర్శన, రాత్రి 8గంటలకు నాటకం ప్రదర్శించారు. లక్షలాది మంది భక్తులు తిరునాళ్ళ మహోత్సవానికి రానున్న నేపద్యంలో అదే స్థాయిలో ఏర్పాట్లను కూడ పూర్తిచేశారు.

### కొండపై శ్రీలక్ష్మీ నరసింహాస్వామికి ప్రత్యేక పూజలు

తిరునాళ్ళ మహోత్సవం సందర్భంగా కొండపై వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో రెండవ రోజున స్వామివారికి నవకలశ స్థాపన, సుగంధ పరిమళాలతో విశేష అభిషేక కార్యక్రమాన్ని ఎస్.కోటిరెడ్డి నిర్వహణలో ఆలయ అర్చకులు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నేడు ప్రధాన తిరునాళ్ళ సందర్భంగా కొండపైకి భక్తుల సౌకర్యార్థం పాకనాటి అంజిరెడ్డి, పాకనాటి మధుసుధనారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో ఉచిత అన్న ప్రసాదాలు, వెంకటరమణ మార్బుల్స్ అలూరి శ్రీనివాసరావు, శనగల వెంకటేష్‌రెడ్డిలు ఉచిత మజ్జిగ ప్యాకెట్లు, ఉచిత వాటర్ ప్యాకెట్లు అంజనేయ మిల్క్ డైయిరీ, సాంబశివ మిల్క్ డెయిరీ, దత్త హ్యూమన్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఈఓ. కోటిరెడ్డి తెలిపారు.




## వైభవంగా నాగలక్ష్మీ అమ్మవారి పసుపు,కుంకుమ మహోత్సవం

ఒంగోలు, ప్రభాతవార్త

ఒంగోలులోని సంతపేట షిర్డీ సాయిబాబా మందిరంలో కొలువుతీరి ఉన్న నాగలక్ష్మీ అమ్మవారి పసుపు,కుంకుమ మహోత్సవ కార్యక్రమంలో కన్నుల పండుగగా జరుగుచున్నాయి. ఈ నెలా 12వ తేదిన ప్రారంభమైన అమ్మవారి ఉత్సవములు 14వ తేదీ వరకు అంగరంగ వైభవంగా కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం నాగలక్ష్మీ అమ్మవారి పల్లవి సేవా కార్యక్రమాన్ని అంగరంగ నిర్వహించారు. ముందుగా ఆలయంలో నాగలక్ష్మీ అమ్మవారికి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు అలహరి చెంచలరావు దంపతులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వేదిక పైన అమ్మవారి కొలువు తీర్చి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రముఖ వేద పురోహితులు బ్రమ్మశ్రీ మఠంపల్లి దక్షిణామూర్తి అమ్మవారి పల్లకి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం బాణసంచా డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమ ఆద్యంతం కన్నుల పండుగగా సాగింది. ఈ కార్యక్రమంలో సాయి యువసేన, సాయి మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.



## నేడు ఒంగోలులో జనసేన ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు, ప్రభాతవార్త

జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒంగోలు జనసేన పార్టీ కార్పొరేటర్ల సమక్షంలో శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు బొమ్మరిల్లు ఆశ్రమంలో అన్నదానం, కేక్ కటింగ్ కార్యక్రమం జరుగుతుందని, కావున ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని జనసేన కార్పొరేటర్లు కోరారు.

## ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్టు యూనియన్ ప్రకాశం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్టు యూనియన్ ప్రకాశం జిల్లా నూతన కమిటీ సమావేశం ఒంగోలు ఎంసీఏ భవనంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఉబ్బా అశోక్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షురాలుగా సీహెచ్ అశోక్, డి.శైలజ, ఎస్కే హ్యూమాయున్ భాష, ప్రధాన కార్యదర్శిగా సూడిదేల ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శిగా గడ్డం మారుతి, సహాయ కార్యదర్శి మద్దిరాల సాంబశివరావు, సహాయ కార్యదర్శిగా మండ శ్రీనివాసరావు, కోశాధికారి కంచర్ల శివ, గౌరవ సలహాదారులు మేకపాటి మాల్యాద్రి, కార్యవర్గ సభ్యులు ఎస్కే కాలేశావలి, పి.శేషు, బొడ్డు శ్రీనివాసరావు, కోరుకొండ సుబ్బారావు, బచ్చు కోటేశ్వరరావు, బైరపనేని శ్రీనివాసరావు, ఈర్ల శ్రీనివాసరావు, సుబ్బయ్య తదితరులను సభ్యులుగా ప్రకటించారు. ఈసందర్భంగా జర్నలిస్టు సమస్యల పట్ల వారి సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని అధ్యక్షులు అశోక్‌బాబు, వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి కోరారు.



## 624 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

నాగులుప్పలపాడు, మార్చి 13, ప్రభాతవార్త

చీరాల నుండి ఒంగోలు రేషన్ బియ్యంతో వెళ్తున్న లారీని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెంటాడి పట్టుకున్న సంఘటన గురువారం జరిగింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మీ సమాచారం మేరకు తమకు అందిన సమాచారం మేరకు చీరాల వైపు నుండి సుమారు 624 బస్తాలతో లారీ ఒంగోలు వైపు వస్తుందని తెలిసింది. నాగులుప్పలపాడు మండలం చదలవాడ నుండి లారీని వెంబడించగా త్రోవగుంట మలుపు వద్ద లారీని తనిఖీ చేయగా రేషన్ బియ్యంగా గుర్తించామని అధికారులకు తెలియజేసి కేసు నమోదు చేసి రేషన్ బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.




## దేశీయ లేగదూడల ప్రదర్శన కార్యక్రమం

టంగుటూరు, మార్చి 13, ప్రభాతవార్త

లేగదూడల సంరక్షణతో పాడి లాభదాయకం, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసావు పేర్కొన్నారు. టంగుటూరు మండలం మర్లపాడు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో దేశీయ లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులని, వాటి సరంక్షణతోనే పాడి లాభదాయకమని కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంచి పాలసార, జాతి లక్షణాలు కలిగిన పాడి పశువుకు పుట్టిన దూడలను తదుపరి పాడిపశువుగా రైతులు తమ క్షేత్రాల్లోనే తయారు చేసుకోవాలని కోరారు. దూడల ఆరోగ్య నిర్వహణకు రైతులు శాస్త్రీయ పద్ధతులు, సరైన పౌష్టికాహారం, పశు వ్యాధుల వ్యాప్తిని నివారించడానికి వ్యాధి నిరోధక టీకాలతో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బేబిరాణి తెలిపారు. పెయ్య దూడలు పుట్టే లింగ నిర్ధారిత వీర్యంతో పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించి, మేలైన యాజమాన్య పద్ధతులతో ఏడాదికి ఒక దూడ పొందాలని ప్రకాశం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ సీహెచ్ చంద్రశేఖరరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ రమేష్‌బాబు, టంగుటూరు సహాయ సంచాలకులు డాక్టర్ సుదీర్‌బాబు, కొణిజేడు పశువైద్య అధికారి డాక్టర్ సోమశేఖర్, పశువైద్య అధికారులు డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అనిల్, పశువైద్య సిబ్బంది, శివ, కిశోర్, గోపి, సుబ్బారావు, వనజ, ఫార్మా కంపెనీ ప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.




## దృష్టిలోపం పింఛన్ దారులు తనిఖీ నిమిత్తం మార్కాపురం వెళ్ళాలి

**- ఎంపిడిఓ వెంకటరామిరెడ్డి**



**రాచర్ల, మార్చి 13, ప్రభాతవార్త**

ఎన్టీఆర్ భరోసా ఆరోగ్య పథకం ద్వారా దృష్టిలోపం పెన్షన్లు పొందే లబ్దిదారులు ఈనెల 15వ తేదీ మరియు 19వ తేదీలలో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలకు తనిఖీ నిమిత్తం వెళ్ళాలని మండల ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి గురువారం తెలిపారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారుల సూచనల మేరకు దృష్టిలోపం పింఛన్లు పొందే లబ్దిదారుల పింఛన్ల పరిశీలన మరియు రీ అసెస్మెంట్ సదరం సర్టిఫికేట్లు చేయడం జరుగుతుందన్నారు. 15వ తేదీ శనివారం ఆకవీడు -1, అనుములపల్లి, చిన్నగానిపల్లి, చోళ్ళవీడు, ఆకవీడు -2 గ్రామాల్లో 40మంది పింఛన్ దారులను, 19వ తేదీ గుడిమెట్ట, జేపిచెరువు, అనుములవీడు, ఎడవల్లి, సోమిదేవిపల్లి గ్రామాల్లో 40మంది పెన్షన్ దారులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాబట్టి దృష్టిలోపం ద్వారా పింఛన్లు పొందే లబ్దిదారులు ఈ విషయాలను గమనించి ఆయా తేదీలలో ఆయా గ్రామాలకు సంబంధించిన పెన్షన్ దారులు తప్పకుండా మార్కాపురం తనిఖీలకు వెళ్ళాలని ఆయన కోరారు. ఈ తనిఖీలకు వెళ్లకపోతే వెళ్ళని వారి పింఛన్లు నిలిపివేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కాబట్టి తప్పకుండా తనిఖీలకు వెళ్లాలని ఆయన అన్నారు.

### పేదింటి మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక కార్యక్రమం

పేదింటి మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని మండల ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి తెలిపారు. పేద మహిళలను అభివృద్ధిబాటలో నడిపించేందుకు వారికి ఉపాధి ద్వారా జీవన విధానాన్ని మెరుగుపరిచేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ మరియు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వెనుకబడిన తరగతుల మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెనుకబడిన తరగతులకు సంబంధించి ఏ, బి, డి, ఈ వర్గాలకు చెందిన వారికి 27యూనిట్లు ఈడబ్ల్యుఎస్ మరియు ఈబిసి, రెడ్డి, ఆర్యవైశ్య వారికి 36యూనిట్లు, కాపు కులానికి సంబంధించి 8యూనిట్లు, బ్రాహ్మణ కులానికి సంబంధించి 1యూనిట్ మంజూరైనట్లు ఆయన తెలిపారు. అర్హతగల వెనుకబడిన తరగతుల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకోవాలంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారై ఉండాలని, రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలని, సంబంధిత కుల ధృవీకరణ ఆదాయ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని, 18 నుండి 50సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, వార్షిక ఆదాయం, గ్రామాల్లో అయితే లక్షాయాభైవేలు, పట్టణాల్లో అయితే 2లక్షలకు మించరాదన్నారు. శిక్షణ తీసుకునే సమయంలో కనీసం 70శాతం హాజరు కలిగి ఉండాలని, వారికే కుట్టుమిషన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలంటే వీలు కాదని, మీ గ్రామాల్లోని సచివాలయాల్లో మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, సెల్ నెంబర్‌తోపాటు మిగిలిన ధృవపత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం

**బల్లికురవ, మార్చి 13, ప్రభాతవార్త**



మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో గురువారం వరిగడ్డి ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో షార్ట్ సర్క్యూట్తో వరిగడ్డి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన అరిపినేని శేషయ్య పొలంలోని వరిగడ్డిని ఇంటికి తరలించే క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. విద్యుత్ వైర్లు కిందకు ఉండటం, వాహన చోదకుడు దీనిని గమనించకపోవడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేసింది. అప్పటికే రెండు ఎకరాలలోని వరిగడ్డి మొత్తం కాలిపోయింది. రూ.30వేలు నష్టం వాటిల్లింది.

## ఎస్సీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**మద్దిపాడు, మార్చి 13, ప్రభాతవార్త**



మద్దిపాడు దళిత వాడల్లో మౌలిక సదుపాయం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి తెలిపారు. గురువారం మద్దిపాడు దళిత కాలనీలో సీపిఎం నాయకులు పర్యటించారు . ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఆదిలక్ష్మి ప్రజా సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం చేస్తామన్నారు. కనపర్తి సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం దళిత వాడలో మురుగు కాలువల సమస్యల పరిష్కారంతో పాటు సిమెంట్ రోడ్లు వేయాలన్నారు. పేదల సమస్యల పట్ల సీపీఎం పార్టీ నిరంతరం ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేస్తున్నామన్నారు.

## వెల్లంపల్లిలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం

**మద్దిపాడు, మార్చి 13, ప్రభాతవార్త**



మండల పరిధిలోని వెల్లంపల్లి గ్రామంలో ప్రపంచ కిడ్నీదినోత్సవం గురువారం ఒంగోలు రిమ్స్ కలాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఒంగోలు రిమ్స్ కళాశాలలో నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సెక్యూంట్లీ వెల్లంపల్లి రాజుల మెట్టలోని అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారులకు పలు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపులో భాగంగా కిడ్నీ దినోత్సవ ర్యాలీని గ్రామంలో నిర్వహించారు. దీనిలో భాగంగా మన కిడ్నీలు బాగుంటే రక్తపోటును నియంత్రిస్తూ మలినాలను మూత్రం రూపంలో బయటకు పంపిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుమిత్రాదేవి, అధ్యాపకులు మారుతి వరలక్ష్మి, ఫాతిమా ధనలక్ష్మి పాల్గొన్నారు.

## జనసేన ఆవిర్భావ సభకు తరలిరండి

**- కొండపి జనసేన శ్రేణులకు మనోజ్‌కుమార్ పిలుపు**

**పొన్నలూరు, మార్చి 13, ప్రభాతవార్త**

జనసేన ఆవిర్భావ దినోత్సవం పిఠాపురంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో జనసేన సైనికులు వీర మహిళలు 12వ ఆవిర్భావ వేడుకలకు భారీ సంఖ్యలో తరలిరావాలని కొండపి జనసేన సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ గురువారం నాడు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## సాహిత్య సేవకురాలు మొల్లమాంబ

**మార్కాపురం, మార్చి 13, ప్రభాతవార్త**





సాహిత్య సేవకురాలు మొల్లమాంబ అని, ఆమె విగ్రహాన్ని మార్కాపురంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని శాసనసభ్యురాలు కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి అన్నారు. పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన సాహిత్య సేవకురాలను మొల్లమాంబ విగ్రహాన్ని గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో రాయబడిన రామాయణాలలో మొల్ల రచించిన మొల్ల రామాయణం ప్రత్యేకతను చాటిందన్నారు. సరళమైన భాషలో తెలుగులో సంస్కృత పదాలను మాత్రమే ఉపయోగించి రామాయణాన్ని రచించింది అని అన్నారు. ఆమె జయంతిని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద నిలిపి మొల్ల విగ్రహం వద్ద ప్రతి సంవత్సరం మార్చి 13న ఆమె జయంతిని ఘనంగా జరుపుకోవాలని జరుగుతుందని మొల్ల సేవలను ఆమె కొనియాడారు. శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం జయంతి ఉత్సవాలు జరుపుకోవడం అదృష్టమని అన్నారు. ఈ సందర్భంగా సేవా సంఘం ఆధ్వర్యంలో కందుల సతీమణి వసంతమ్మకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## శబరిమలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం

**- అయ్యప్ప భక్తులు, దాతలు సహకరించాలి**

**మార్టూరు, మార్చి 13, ప్రభాతవార్త**



అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో శబరిమల పుణ్యక్షేత్రంలో నిత్యాన్నదానం నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు శంకరాచారి తెలిపారు. ఏబీవీపీ మార్టూరు నూతన కార్యవర్గ ఎన్నికల గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు శంకరాచారి మాట్లాడుతూ పవిత్ర శబరిమలకు అయ్యప్ప స్వామి దర్శనార్థం ఆంధ్రప్రదేశ్ నుండి భక్తులు భారీగా తరలి వెళ్తుంటారని మండల దీక్షా సమయంలో అయ్యప్ప మాలధరించి కోట్ల మంది భక్తులు శబరిమలకు వెళ్తుంటారని అక్కడ మన ఆహారం యొక్క భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతుంటారన్నారు. ఈ విషయం గమనించి ఏబీవీపీ ఆధ్వర్యంలో పంబానది వద్ద అన్నదానానికి అనుమతి కోరుతూ దేవస్థానం బోర్డును కేళ ప్రభుత్వాన్ని అనుమతి కోరడం జరిగిందన్నారు. ఈ విన్నతిని పరిశీలించిన వారు శివ టెంపుల్ సమీపంలోని నారాయణ తోడు వద్ద 12 సెంట్లు స్థలం కేటాయించడం జరిగిందన్నారు. ఈ స్థలంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మించడం జరిగింది. ఈ భవనంలో గత సంవత్సరం అన్నదానం ప్రారంభించడం జరిగిందని ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక భక్తులు ఈ అన్నదానాన్ని వినియోగించుకుంటున్నారన్నారు. ఈ భవనంపై అంతస్తులో వసతి సముదాయాలను కూడా నిర్మించడం జరుగుతుందన్నారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖకు మార్టూరు యూనిట్ పలు విషయాల్లో అండగా ఉందని అన్నదానంలోనూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. భక్తులకు అన్న పానీయాలు వడ్డించటానికి సహాయకుల అవసరం కూడా ఉందన్నారు. మార్టూరు నూతన కమిటీ సభ్యులు ఈ విషయాలప గమణించి అయ్యప్ప భక్తులను కలిసి విషయం వివరించి సహకరించాలని కోరారని శంకరాచారి సూచించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మార్టూరు సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరాస్వామి, ఎం.అంకయ్య, కొల్లా శ్రీనివాసరావు, శ్రీకాంత్, సత్తిబాబు, అనిల్, శ్రీనివాసరావు, గుంటుపల్లి చందు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

**- ఎమ్మెల్యే కందుల**



**మార్కాపురం, మార్చి 13, ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన జెండాగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ప్రజా సమస్యలపై తనకు అవగాహన ఉందని వాటిని పరిష్కరించి మార్కాపురం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు. ఇటీవల రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి మార్కాపురం, పొదిలి నగర పంచాయతీ సమస్యల విషయాన్ని దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అభివృద్ధికి సహకారం అందించాలని విన్నవించడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి కొన్ని అభివృద్ధి నిధులను మంజూరు కోసం కృషి చేశానని త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఆర్థికలేమి.. నిధుల మంజూరు ఆలస్యం కారణంగా కాస్త సమయం పడుతుందని అయినప్పటికి అభివృద్ధి ప్రధాన అజెండగా పని చేయడం జరుగుతుందన్నారు. తీవ్రనీటి ఎద్దడి ఉన్న పట్టణంలోని 32వ వార్డులో మంచినీటి పైపులను బిగించి కొంత మేర సమస్యను పరిష్కరించడం జరిగిందని అన్నారు.

## ఏ వన్ గ్లోబల్‌లో గ్లోబల్ మహోత్సవం

**మార్కాపురం, మార్చి 13, ప్రభాతవార్త**



ఏ వన్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 21, 22, 23వ తేదీల్లో జాతీయ స్థాయిలో గ్లోబల్ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన గ్లోబల్ మహోత్సవ 2025 కార్యక్రమ గోడ పత్రికను కళాశాల డైరక్టర్ మసూద్, చైర్మన్ మీర్జా షంషేర్ అలీబేగ్‌లో పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమలోని సహజమైన సృజనాత్మకతను ప్రదర్శించి అత్యంత ప్రతిభ పాటవాలను చాటాలన్నారు. ఉత్తమ ప్రదర్శనకు విలువైన బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

### పొగాకు కిలో ఒకటికి యధావిధిగా కొనసాగిన రూ.280లు

**సంతనూతలపాడు ,మార్చి 13, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండల పాలకేంద్రం సమీపంలో గల ఒంగోలు ఒకటో పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన వేలంలో యధావిధిగా పొగాకు కిలో ఒక్కింటికి అత్యధిక ధర రూ.280 రూపాయలు లభించాయి. చిలంకూరు క్లష్టర్ పరిధిలో గల 132 పొగాకు చెక్కులను వేలానికి అనుమతించారు. వీటిలో 85 చెక్కులు విక్రయాలకు గురైనవి. 47 పొగాకు చెక్కులు వివిధ కారణాలచే తిరస్కరింపబడినవి, కనీస ధర రూ.270 రూపాయలు పలికాయి. సరాసరి ధర రూ.277.91 పైసలు లభించాయి. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వేలాన్ని నిర్వహణ అధికారి ఎం.రవికాంత్ పర్యవేక్షించారు.

### సేవా సంకల్ప్ ట్రస్టు ఆధ్వర్యంలో 42వ వారం అన్నదాన వేడుకలు

**సంతనూతలపాడు, మార్చి 13, ప్రభాతవార్త**



సంతనూతలపాడులో గురువారం నాడు సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 42వ వారం అన్నదాన వేడుకలను నిర్వహించారు. ట్రస్టు సభ్యులు, ఎన్నారై, సంతనూతలపాడు మండలం చంద్రపాలెం గ్రామానికి చెందిన బెజవాడ శ్రీనివాసరావు, పద్మా దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా వీరు ఈ అన్నదాన వేడుకలను ఏర్పాటు చేశారు. సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ పాతూరి సంపత్, ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో ట్రస్టు ఆధ్వర్యంలో దేశ విదేశాల నుండి దాతల సహకారంతో ఒక పక్క సేవలను, మరొక పక్క అన్నదాన వేడుకలను నిర్వహిస్తున్నారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప్ ట్రస్టు వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, ట్రస్టు గౌరవ అధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, ట్రస్టు జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, ట్రస్టు సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, వేమా కవిత, వేమూరి శ్రీనివాసరావు, దాచర్ల శివయ్య, వేమా నాగరాజు, శిఘాకొల్లి శ్రీనివాసరావు, కే.జయరావు, మద్ది మల్లిఖార్జునరావు, శీలం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యర్రగొండపాలెం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా

**యర్రగొండపాలెం రూరల్, మార్చి 13, ప్రభాతవార్త**





నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పొందాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ ఆదేశానుసారం మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో యర్రగొండపాలెం సర్కిల్ పోలీస్ వారి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటన ద్వారా సిఐ ప్రభాకర్ రావు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పొందాలనే లక్ష్యంతో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సిఐ తెలిపారు. యర్రగొండపాలెం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేద్కర్ భవన్‌లో మార్చి 16వ తేదీ ఆదివారం జరుగుతుందని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. బుధవారం సిఐ కార్యాలయంలో మెగా జాబ్ మేళాకు సంబంధించి ప్రకటనల వాయిస్ రూపంలో విడుదల చేశారు. ఆ ప్రకటనలో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు మండలాలకు చెందిన యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళా పివిఎన్ఆర్ గ్రూప్స్ సిఈఓ పామర్తి గోపిచంద్ సౌజన్యంతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో పేరుగాంచిన పలు కంఎపనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లమా, ఐటిఐ, డిగ్రీ, ఎంబిఏ, ఎంసిఏ, బిటెక్, ఫార్మసీ విద్యార్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాజరయ్యే అభ్యర్థులు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. బయోడేటా ఫామ్‌తోపాటు జిరాక్సు సర్టిఫికేట్లతో హాజరుకావాలని కోరారు. అదేవిధంగా ఇంకా పూర్తి వివరాలను మీమీ గ్రామాలలోని సచివాలయాలలో పనిచేసే మహిళ పోలీసుల ద్వారా పూర్తి సమాచారం తెలుసుకోవచ్చని వివరించారు.

## కవయిత్రి మొల్ల వెంగమాంబకు ఘన నివాళి

**బల్లికురవ, మార్చి 13, ప్రభాతవార్త**



కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా గురువారం అసెంబ్లీలో ఆమె విగ్రహానికి సీఎం చంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సహచర మంత్రులతో కలిసి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు.

### వైభవంగా శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వార్షికోత్సవ బ్రహ్మోత్సవ వేడుకలు





**సంతనూతలపాడు, మార్చి 13, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 13న గురువారం నాడు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 13న ప్రారంభమైన ఈ వేడుకలు 16వ తేదీతో ముగియనున్నాయి. ఈ నెల 13న గురువారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారికి ఆలయ అర్చకులు పరాంకుశ ప్రసాద్ చార్యులు, పి.అజయ్‌బాబు చార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకములు నిర్వహించాఉ. గుంటూరు వాస్తవ్యులు వేద పండితులు నల్లూరి జగదీష్ కుమార్, నలుగురు రుక్మితులు బృందం ఆధ్వర్యంలో స్వామి వ్లాకు గురువారం సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, మేధన పూజ, అంకురారోహిణం పుణ్యాహవచనం తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు.

### 15న శ్రీనివాస కళ్యాణ మహోత్సవ వేడుకలు

ఈ నెల 13న శనివారం ఉదయం 9గంటలకు శ్రీదేవిభూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారికి శ్రీనివాస కళ్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శనివారం మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నదాన వేడుకలను ఏర్పాటు చేశారు. నాలుగు రోజులు పాటు ఈ నెల16వ తేదీతో ఈ వేడుకలు ముగియనున్నాయి. దాతల సహకారంతో ఆలయ కమిటీ పరిరక్షణలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి ప్రథమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మండల కేంద్రమైన సంతనూతలపాడులో ఈ వేడుకలు ఘనంగా ప్రారంభమైనవి. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ కమిటీ ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు.

## వెలుగొండ క్షేత్రంలో బ్రహ్మోత్సవాల శోభ

**- ప్రారంభమైన వెలుగొండ స్వామి బ్రహ్మోత్సవాలు**

**కొనకనమిట్ల, మార్చి 13, ప్రభాతవార్త**





తిరుమల ప్రతిరూపమైన అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీఅలివేలుమంగా సమేత లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఈనెల 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ సేవా కమిటీ అధ్యక్షులు కుందురు కాశిరెడ్డిలు తెలిపారు. ఈ నెల 14న ఉదయం ధ్వజారోహణ, రాత్రి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. 15న చంద్రవాహనం, 16న వ్యాలీవాహనం, 17న సింహ వాహనం, 18న హంసవాహనం, 19న శేషవాహనం, 20న హనుమంత వాహనం, 21న గురడోత్సవం, 22 న గజోత్సవం(తిరునాళ్ల), 23న రథోత్సవం, 24న అశ్వవాహనం, 25న వసంతోత్సవం, చక్రతీర్థం, ధ్వజ అవరోహణ, కుంభప్రోక్షణతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. గరుడ గజోత్సవాల నాడు వివిధ సామాజిక వర్గాల సత్రాలలో అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు.

### ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు :

పొదిలి, మార్కాపురం, కనిగిరి ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు తిరునాళ్లకు నడుపుతారు. నాగిరెడ్డిపల్లె నుండి 4 కిలో మీటర్ల దూరంలోను, నంద్యాల- ఒంగోలు రహదారిలోని చినమనగుండల నుంచి 6 కిలోమీటర్ల దూరంలో వెలుగొండ క్షేత్రానికి చేరుకోవచ్చును. ఈ క్షేత్రం నందు ముసికుంద మహర్షికి శ్రీకృష్ణ పరమాత్మ శ్రీమన్నారాయణ అవతారంన ప్రత్యక్షమై మోక్ష మిచ్చినట్టియు కాలయవనుడు అను రాక్షసుడు ముసికుంద మహర్షిత పోజిక అంతమొందినట్టియు ఈ పుణ్యక్షేత్రం విరాజిల్లుతుంది. శ్రీ ముసికుంద మహర్షి కోరిక మేరకు శ్రీ కృష్ణ పరమాత్మ శ్రీ వెంకటేశ్వరస్వామి రూపంన వెలిసినట్లుగా స్థల పురాణం ద్వారా తెలుస్తుంది. ఈ దేవస్థానం కొండ మొదలుకొని తిరుపతి కొండ వరకు వ్యాపించి ఉన్న కొండలను వెలుగొండగా పిలుస్తారు.

### సిఎం సహాయ నిధి నుంచి 42 లక్షల ఎల్ఓసి అందజేసిన ఎరిక్షన్‌బాబు

**యర్రగొండపాలెం,మార్చి13,ప్రభాతవార్త**



టిడిపికార్యాలయంలో సిఎం సహాయనిది నుంచి 42,12,564రూపాయల ఎల్ఓసిని యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు గురువారం య ర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయం లో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ నియోజకర్గం లోని 26మందికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన ఎల్ఓసిలను నేడు అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. తెలుగుదేశంపార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లపుడు తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందని ఆయన్కఅన్నారు. ఈ సందర్భంగా చెక్కులుఅందుకున్న వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, గూడూరి ఎరిక్షన్‌బాబుకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు చేకూరి సుబ్బారావు, శనగానారాయణరెడ్డి, మంత్రునాయక్, రెంటపల్లె సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, కంచర్ల సత్యనారాయణగౌడ్, చిట్యాల వెంగళ్‌రెడ్డి, షేక్.మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్

**- ఎరిక్షన్‌బాబు**



**యర్రగొండపాలెం,మార్చి13,ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టంలోని ఉర్దూ పాఠశాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఉర్దూ పాఠశాలను ఉర్దూ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు సహకరించిన యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుకు ముస్లిం నాయకులు గురువారం తెలుగుదేశంపార్టి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం విద్యార్థులు హైస్కూల్ చేయడం వల్ల ఇక్కడే చదువుకోవడం జరుగుతుందని లేకుంటే ఇతర ప్రాంతలకు వెల్లి చదువుకోవలసి ఉండేదని ఆయన అన్నారు. విద్యార్థులు బాగా చదువుకోని పాఠశాలకు మంచి పేరు తీసుకోనిరావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లి నాయకులు షేక్.మస్తాన్‌వలి, షేక్.వలి, షేక్.ఖలీల్, ఉపాధ్యాయులు షేక్.దాదాబాష తదితరులు ఎరిక్షబాబుకు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు.

### ఉభయ దేవాలయాలను సందర్శించిన కాంతిలాల్ దండే దంపతులు

**త్రిపురాంతకం, మార్చి 13, ప్రభాతవార్త**



త్రిపురాంతకంలోని ప్రముఖ దేవాలయాలు అయిన త్రిపురాంతకేశ్వర బాల త్రిపుర సుందరీ దేవీ ఆలయాలను రాష్ట్ర రహదారులు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఉభయ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించఆరు. ఉభయ దేవాలయాల్లో మంగళవాయిద్యాలతో వారికి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు విశ్వం ప్రసాద శర్మలు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. ఆయన వెంట తహశిల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ముకుంద హరి, ఆలయ సూపరింటెండెంట్ రంగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాశీనాయన శాఖ వార్షికోత్సవంను జయప్రదం చేయండి

**- గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్**

**గిద్దలూరు, మార్చి 13, ప్రభాతవార్త**

ఈనెల 16వ తేదీ ఉదయం 7గంటలకు గిద్దలూరు పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో జరిగే రాష్ట్ర స్వయం సేవక సంఘ కాశినాయన శాఖ వార్షికోత్సవమునకు హిందువులు సకుటుంబ సమేతంగా హాజరు కావాలని గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘ గత 100 సంవత్సరాలుగా క్రమశిక్షణ, అనుశాసనం, దేశభక్తి, జాతీయ భావన, వ్యక్తులు నిర్మాణం చేయుచున్నదని ఈ పనికి సంఘ శాఖలో శరీర వ్యాయామంతో పాటు దేశభక్తిని ప్రభోదించే అనేక అంశములతో, అభ్యాసంతో యోగ్యమైన వ్యక్తులు తయారవుతున్నారని ఆయన తెలిపారు. ప్రతి హిందువు బంధువు అందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ కోరారు.

# కనకదుర్గమ్మ వారి తిరుణాళ్ల మహోత్సవము

**దొనకొండ,మార్చి 13,ప్రభాతవార్త**

దొనకొండ గ్రామమునందు వెలసియున్న పురాతన ఆలయం శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ వారి తిరుణాళ మహోత్సవము ఈనెల 14వ తేదీన శుక్రవారం కావున భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదం స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు ఉదయం అమ్మవారికి అభిషేకములు కుంకుమ పూజలు జరుగును మరియు ఉదయం 10 గంటల నుండి ప్రసాదములు మరియు మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న ప్రసాదములు మరియు సాయంత్రం నాలుగు గంటల నుండి ప్రసాదములు రాత్రి తొమ్మిది గంటల నుండి కోలాటం మరియు పాట కచేరీలు కలవు కావున భక్త మహాశయులందరూ పాల్గొని ఈ యొక్క అమ్మవారి తిరుణాల మహోత్సవములు జయప్రదం చేయవలసినదిగా కోరుచున్నాము ధన్యవాదములు

## ఏపీలో ఉచిత గ్యాస్ సిలిండర్ తీసుకునేవారికి కీలక సూచనలు

**దొనకొండ,మార్చి 13,ప్రభాతవార్త**



ఏపీలో 'దీపం2' పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్ ఇప్పటికే తీసుకొనేవారికి పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్ కీలక సూచనలు చేశారు. ఈ నెలాఖరులోగా మొదటి సిలిండర్లు బుక్ చేసుకోవాలని, లేదంటే మూడు సిలిండర్లలో మొదటిది కోల్పోతారని తెలిపారు. ఏప్రిల్ నుంచి రెండో సిలిండర్ బుకింగ్స్ ప్రారంభం అవుతాయని చెప్పారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 97లక్షల మంది లబ్ధిదారులు ఉచిత గ్యాస్ బుక్ చేసుకున్నట్లు వెల్లడించారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థినిలు

**సింగరాయకొండ, మార్చి 13,ప్రభాతవార్త**



రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థినిలు ఎంపికైనట్లు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎస్ శ్యాం ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా కబడ్డీ సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ ఎంపికలు మార్చి 9వ తేదీన ఒంగోలులోని మినీ స్టేడియంలో జరిగాయి.ఈ సెలక్షన్స్ ప్రక్రియలో సత్తా చాటిన పాకల విద్యార్థినిలు 1) కె.నందిని 2) పి స్వాతి3) ధనలక్ష్మి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి.హజరత్తయ్య తెలిపారు. వీరు ఈనెల 14నుంచి 16 వ తేదీ వరకు కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా. భాస్కర రావు, కార్యదర్శి వై.పూర్ణ పూర్ణచంద్రరావు కు వ్యాయామ ఉపాధ్యాయులు పి.హజరత్తయ్య ధన్యవాదాలు తెలిపారు. ఎంపికైన విద్యార్థినిలను ఎస్ఎంసి సభ్యులు, పూర్వవిద్యార్థుల అసోసియేషన్ సభ్యులు,గ్రామస్తులు ఉపాధ్యాయులు అభినందించారు.

# స్కూల్ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

**సింగరాయకొండ,మార్చి 13,ప్రభాతవార్త**



ప్రైవేట్ స్కూల్ బస్సు కు పెను ప్రమాదం తప్పడంతో స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఉదయం రోజు మాదిరిగానే గ్రామాల నుండి 40 మంది పిల్లలు ను ఎక్కించుకొని స్కూల్‌కు వస్తున్న క్రమంలో సాయి బాబా గుడి సమీపంలోని ట్రంక్‌రోడ్డు పై యూటర్న్ తీసుకుంటున్న సమయంలో టిప్పర్ లారీ స్కూల్ బస్సును బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలిపోయాయి.ఈ బస్సులో 40 మంది విద్యార్థులుఉన్నారు.వీరిలో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సింగరాయకొండలో పగలు,రాత్రి అనే తేడా లేకుండా గ్రావెల్ ని తరలిస్తున్న టిప్పర్ లారీలు ఈ ప్రమాదానికి కారణమైనట్లు స్థానికులు తెలిపారు.ఈ ప్రధాన ట్రంకు రోడ్డులో టిప్పర్లు అధిక వేగంతో ప్రయాణిస్తూ ఉండడంతో రోడ్డు దాటే క్రమంలో భయపడుతూ రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రావెల్ టిప్పర్లను పట్టణంలోకి ప్రవేశించకుండా నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి స్వామి

**సింగరాయకొండ, మార్చి 13,ప్రభాతవార్త**



హోళీ పండుగ సందర్భంగా రాష్ట్ర, నియోజకవర్గం ప్రజలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి గురువారం హోళీ శుభాకాంక్షలు తెలిపారు.నిత్య జీవనంలో కష్టాలను కాసేపు మరిచి పేదా బేధం లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలిసి కేరింతలతో, ఆనందోత్సాహాల నడుమ రంగులు తో జరుపుకునే ప్రకృతి పండగ హోళీ అని పేర్కొన్నారు.హోళీ పండుగ భారతీయ సామాజిక సాంస్కృతిక జీవన ప్రత్యేకతను చాటుతుందని వ్యాఖ్యానించారు. వసంతాన్ని తమ జీవితంలో ఆహ్వానిస్తూ జరుపుకునే హోళీ పర్వదిన సందర్భంగా ఆ ప్రకృతి మాత ప్రజలందరిని చల్లగా చూడాలని మంత్రి ప్రార్థించారు.

## "యువ రచయితలుగా మారిన కమలా విద్యార్థులు"

**- పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్**

**మార్కాపురం రూరల్, మార్చి 13, ప్రభాతవార్త**



స్థానిక కమలా హైస్కూల్ (సి.బి.ఎస్.ఇ) మార్కాపురం నందు 8వ తరగతి విద్యార్థులు వివిధ అంశాలమీద 35పుస్తకాలు రచించడం జరిగింది. గురువారం వారి యొక్క ప్రతిభను గుర్తించి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలనగావించి తదనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పుస్తకాలు రచించడం అనేది అంత సులువైన విషయం కాదని, కమలా హైస్కూల్ విద్యార్థులు పుస్తకాలు రచించడం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యార్థుల యొక్క ప్రతిభను ప్రసంసిస్తూ, ఈ పుస్తకాలు రచించడంలో సహకరించిన వారి ఉపాధ్యాయులను, యాజమాన్యాన్ని అభినందించారు. సిబిఎస్ఇ పాఠశాలలో మాత్రమే ఇటువంటి పాఠ్యప్రణాళిక మరియు విద్యా ప్రమాణాలు ఉంటాయి అని వెల్లడించారు. విద్యార్థులు రచించిన ఈ పుస్తకాలు అమెజాన్‌లో కొనుగోలు చేయుటకు సౌలభ్యం కలదని పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వరూప్ రంజన్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ పి పవన్ కుమార్, అకాడమి డైరెక్టర్ పి సింధుజలు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## మున్సిపల్ హైస్కూల్‌లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం

**మార్కాపురం రూరల్, మార్చి 13, ప్రభాతవార్త**



మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణ రావు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడవ శనివారం స్వచ్ఛతకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టడం జరుగుచున్నది. ఇందులో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధము, వాటి వలన కలిగే అనార్థాలు గురించి 13వ వార్డు 7వ సచివాలయం పరిధిలోగల మున్సిపల్ హైస్కూల్ నందు గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ లైన్ స్ట్రాలు, పాలిథిన్ కవర్లు, ఇయర్ బడ్స్, ప్లాస్టిక్ స్పూన్లు, ఫోర్కులు, డిస్పోజల్ గ్లాసులు, తదితర వస్తువులను ప్రదర్శిస్తూ వాటిని నిత్య జీవితంలో ఉపయోగించడం వలన కలుగు అనర్థాల గురించి విద్యార్థులకు ఉపహరించడం జరిగింది. 120మైక్రాన్ల కన్నా తక్కువ మందము గల ప్లాస్టిక్‌ను సింగల్ యూజ్ ప్లాస్టిక్ అంటారని వాటిలో వేడి పదార్థాలను ఉపయోగించడం వలన వాటిలో ఉన్న క్యాట్ బియ్యము మొదలైన అణువులు శరీరంలోకి వెళ్లి క్యాన్సర్ కారకాలుగా మారుతాయని, ఆవిధంగా విచ్చలవిడిగా పాలిథిన్ కవర్లను రోడ్లపై వేయడం వలన మూగజీవాలు అయిన ఆవులు, గేదెలు తినుటవలన వాటి శరీరంలో పేరుకుపోయి జీర్ణ సంబంధమైనటువంటి అనారోగ్యాలు కలుగుతాయని వివరించారు. అదేవిధంగా ఇవి భూమిలో కలిసిపోకపోవడం వలన మీథేన్ కార్బన్‌డయాక్సైడ్ మొదలైన వాయువులు విడుదలై గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ మరియు గ్లోబల్ వార్మింగ్‌ను కలుగజేసి భూమిని వేడెక్కించేలా చేస్తాయని తద్వారా భూ మరియు నీటి కాలుష్యం జరుగుతుందని, నీటి కొరత ఏర్పడుతుందని విద్యార్థులకు తెలియపరిచారు. అదేవిధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ స్థానంలో 120 మైక్రాన్ల కన్నా మందంగా గల కవర్లను గాని, లేదా గుడ్డ సంచులను గాని, లేదా మొక్కజొన్న లేదా జూటుతో తయారైనటువంటి బ్యాగులను గాని, ఉపయోగించవలెనని తద్వారా పర్యావరణాన్ని మరియు ప్రకృతిని కాపాడుకోవచ్చని తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రవి, శానిటరి సెక్రటరీలు భాస్కర్,సురేష్,వెంకటేశ్వర్లు,ప్రియమణి,రిజ్వానా,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరకొండ పూజలలో పాల్గొన బాపట్ల ఎస్.పి.

**అద్దంకి ,మార్చి 13,ప్రభాతవార్త**



ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 70వ వార్షిక తిరునాళ్ళ సందర్భంగా రెండవ రోజున స్వామి వారిని బాపట్ల జిల్లా ఎస్.పి. తుషార్ డూడీ సందర్శించారు. ఈ సందర్బంగా స్వామివారికి ఎస్.పి. పూజలు నిర్వహించారు. వేదపండితులు ఎస్.పికి స్వామి వారి ఆశీస్సులతోపాటు తీర్ద ప్రసాదాలను అందజేశారు.

# సింగరకొండ పూజల్లో పాల్గొన్న భద్రారెడ్డి





**అద్దంకి , మార్చి 13, ప్రభాతవార్త**

ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 70వ వార్షిక తిరునాళ్ళ సందర్బంగా రెండవ రోజున స్వామి వారిని వైసిపి నాయకులు యర్రం వీర భద్రారెడ్డి సందర్శించారు. ఈ సందర్బంగా స్వామివారికి వైవి భద్రారెడ్డి పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆయనకు స్వామి వారి ఆశీస్సులతోపాటు తీర్ద ప్రసాదాలను అందజేశారు. ముందుగా ఆలయం వద్ద వైవి భద్రారెడ్డికి ఆలయ సహయ కమీషనర్ ఎం. తిమ్మానాయుడు సాదరంగా ఆహ్వానం పలికారు. అక్కడ నుండి ధ్వజస్తంభ పూజ, వినాయక స్వామి ఆలయంలో పూజ, స్వామివారి బాలాలయంలో పూజలు నిర్వహించారు. ఆయన వెంట సింగరకొండ పాలెం సర్పంచ్ తిరుపతయ్య, కాకాని రాధకృష్ణమూర్తి, నరిశెట్టి సుబ్బారావు, ప్రభాకరరెడ్డి, సోమా శ్రీనివాసరెడ్డి, తదితరులు వున్నారు. అదే విధంగా ఆలయాన్ని పలు ప్రముఖులు కూడ దర్శించుకున్నారు. వీరిలో మాజీ శాసనసభ్యులు డాక్టర్ బాచిన చెంచు గరటయ్య కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**- సమాజ సేవలో వ్యాపారవేత్తల పాత్ర అభినందనీయం**

**- ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు**

**బల్లికురవ, మార్చి 13, ప్రభాతవార్త**



పర్యావరణ పరిరక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరు, తమ బాధ్యతగా గుర్తించి వ్యవహారించాలని చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు అన్నారు. బల్లికురవ పంచాయతీ శివారు కొండయ్యపాలెం గ్రామంలో గురువారం సర్వే నెంబరు 243, 244లో వింటర్ మైన్స్ అండ్ మినరల్స్ నూతనంగా గ్రానైట క్వారీ ఏర్పాటు చేయనున్న నేపధ్యంలో పర్యావరణ అనుమతులు కోరుతూ సమీప గ్రామస్తుల అభిప్రాయాలు స్వీకరించేందుకు గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రానైట్ క్వారీల నిర్వహకులు వ్యాపార దృక్పధంతోనే కాకుండా, కక్కెర ఆంజనేయులు లా గ్రామాభివృద్ధిలోనూ, సమాజ సేవలో కూడా తమ వంతు పాత్ర, పోషించడం అభినందనీయమన్నారు. క్వారీలలో బాల కార్మికులకు అవకాశం ఇవ్వకుండా నూతన క్వారీ నియామకాలలో స్థానికులకు అధిక ప్రాధాన్యతనిస్తూ, సమీప గ్రామాల్లో అభివృద్ది కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. అదే విధంగా సమీప గ్రామాలలో పేద విద్యార్థులకు చేయూతను అందించుటతో పాటు అంతర్గత రహదారుల అభివృద్ధి, మంచినీటి సౌకర్యం కల్పించడం, తదితర అంశాలలో తమ వంతు పాత్ర పోషించటం అభినందనీయం అన్నారు. అదే విధంగా క్వారీలలోనే కాకుండా ఖాళీ ప్రదేశాల్లో సైతం మొక్కలను పెంచుతూ ప్రకృతిలోని కాలుష్యాన్ని తగ్గించేందుకు తమ వంతు చేయూత ఇవ్వాలన్నారు. తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జీ మల్లీనీడిగోవిందరావు మాట్లాడుతూ గ్రానైట్ సీనరేజ్ నిధులతో స్థానిక క్వారల నుండి ప్రధాన రహదారుల వరకు సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడితే వాయు కాలుష్యాన్ని నివారించడంతో పాటు రహదారుల వెంట రైతులు పంట పొలాలను నష్టపోకుండా ఉంటారన్నారు. ఈ విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఈ రాఘవరెడ్డి, తహశీల్దార్ రవినాయక్, ఆర్ఐ పోతురాజు, వీఆర్వోలు బొడెంపూడి అశోక్, సర్వేయర్ చంద్ర, వీఆర్వో అశోక్, సమీప గ్రామ ప్రజలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్యం నుండే క్రమశిక్షణతో చదవండి

**- భవిష్యత్తులో ప్రయోజకులు కండి - కరస్పాండెంట్ కాలువ వెంకటకృష్ణారావు**

**- ట్రినిటీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా వార్షికోత్సవం**

**పెద్దదోర్నాల,మార్చి 13, ప్రభాతవార్త**




బాల్యం నుండే క్రమశిక్షణతో చదవండి, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు చక్కగా వినండి, భవిష్యత్తులో ప్రయోజకులు కావాలని ట్రినిటి ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ కాలువ వెంకటకృష్ణారావు ఆశీర్వదించారు. గురువారం ఉదయం ట్రినిటి ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బెన్ రాజు మాట్లాడుతూ బాల్య దశలో బోధించే పాఠాలు విద్యార్థుల జీవితాల్లో నిలిచిపోతాయని, విద్యార్థులు కూడా అన్ని పాఠ్యాంశాలలో రాణించాలని సూచించారు. ఈ వార్షికోత్సవంలో ఉపాధ్యాయులు అరుణ, రమాదేవి, రీటా, ప్రశాంతి, సుప్రజ, దివ్య, కావ్య, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. చిట్టి పొట్టి చిన్నారులు వేసిన డాన్సులు అలరించి ఆకర్షించాయి.

# కొలలపూడిలో సిమెంట్ రోడ్డు డ్రైనేజీకు శంకుస్థాపన

**మార్టూరు, మార్చి 13, ప్రభాతవార్త**



మండల పరిధిలోని కొలలపూడిలో కొండమీద బజారుకు సిమెంట్ రోడ్డు, సైడు కాలువ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15లక్షల పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయడంతో శంకుస్థాపన జరిగింది. నిధులు మంజూరుచేయటం పట్ల గ్రామస్తులు ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ శాస్త్రి, సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, తాటి నాగేశ్వరరావు, నాగార్జున, కొండలరావు, చిన్న వసంతరావు, బొడ్డు మోహన్‌రావు, యల్లమంద శ్రీను, సాంబయ్య, వెంకటేష్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలుకు హోలీ పండుగ శుభాకాంక్షలు

**- రాష్ట్ర పి.ఏ.సి సభ్యులు ఆదిమూలపు సురేష్**

**సింగరాయకొండ, మార్చి 13,ప్రభాతవార్త**



హోలీ పండుగ సందర్భంగా జిల్లా, నియోజకవర్గం ప్రజలు కు రాష్ట్ర పీఏసీ సభ్యులు, కొండేపి నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సురేష్ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రంగుల పండుగ అందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు ఆయురారోగ్యాలను ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. ప్రకృతి ప్రసాదించే సహజరంగులతో హోలీ జరుపుకోవడమే పండుగ పరమార్ధమని అన్నారు.

## ఫాతిమా స్వచ్ఛంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

**గిద్దలూరు, మార్చి 13, ప్రభాతవార్త**



మండలంలోని క్రిష్టంశెట్టిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు గురువారం ఫాతిమా స్వచ్ఛంధ సేవాసంస్థ మరియు ఉపాధ్యాయులు షేక్ ఖాశింవలి, మంజురేఖలు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష అట్టలతోపాటు పెన్సిల్లు, పెన్నులు విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా మానసిక ప్రశాంతతతో పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని ఫాతిమా స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షులు నంద్యాల ఖాశింవలి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కె ఖాశింవలి, ఉపాధ్యాయురాలు మంజురేఖ తదితరులు పాల్గొన్నారు.

## రంగస్వామి క్షేత్రంలో వ్యాపార విక్రయాలకు బహిరంగ వేలంపాటలు : ఈవో నాగయ్య

**రాచర్ల, మార్చి 13, ప్రభాతవార్త**



మండలంలోని జెపిచెరువు సమీపంలోగల శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో వ్యాపార విక్రయాలకు ఈనెల 15వ తేదీ శనివారం ఉదయం 11గంటలకు ఈ ప్రొక్యూర్‌మెంట్ షీల్డ్ టెండర్ బహిరంగ వేలంపాటలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం నాగయ్య గురువారం తెలిపారు. తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు, టెంకాయలు అమ్ముకునేందుకు ఈ వేలంపాటలు నిర్వహిస్తున్నామని అన్నారు. పాటలో పాల్గొనదలచిన వారు తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు రూ.5లక్షలు, టెంకాయలు అమ్ముకునేందుకు రూ.1లక్ష డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు. పాట పాడుకునేవారు 2025 మార్చి 30వ తేదీ నుండి 2026 ఉగాది వరకు (అనగా ఒక సంవత్సరం పాటు) వ్యాపారాలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. పైన తెలిపిన షీల్డ్‌టెండర్ ఫామ్స్‌ను 10-03-2025 నుండి 15-03-2025 ఉదయం 10గంటల వరకు స్వీకరించి 15-03-2025వ తేదీ ఉదయం 11గంటలకు షీల్డ్ టెండర్లు తెరవడం జరుగుతుందన్నారు. దేవస్థానం పనివేళల్లో రూ.500రుసుము చెల్లించి షీల్డ్‌టెండర్ ఫామ్స్‌ను పొందాలని మరిన్ని వివరములకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని ఇంకా ఏదైనా సమాచారం కావాలంటే 96033 22656సెల్ నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

# ప్రసన్నాంజనేయునికి కరణం ప్రత్యేక పూజలు

**బల్లికురవ, మార్చి 13, ప్రభాతవార్త**



ప్రసిద్ద పుణ్యక్షేత్రం సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి, లక్ష్మీ నరసింహ స్వామికి చీరాల వైకాపా ఇన్‌ఛార్జీ కరణం వెంకటేష్‌బాబు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి లక్ష్మీ నరసింహస్వామి వారి,వార్షిక తిరునాళ్లలో ప్రతి ఏటా ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. మహోత్సవం ప్రారంభమైన సందర్భంగా క్షేత్రపాలకుడు ఆంజనేయునికి పెద్దలతో ప్రణమిల్లాడు. ఆలయ వేద పండితులు వెంకటేష్‌బాబును ఘనంఆ స్వాగతించి స్వామివారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. స్వామివారికి వెంకటేష్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## గృహాల లబ్దిదారులకు అదనపు ఆర్ధిక సహాయం మంజూరు

**- హౌసింగ్ డిఈఈ ఖదీర్ బాష**

**గిద్దలూరు, మార్చి 13, ప్రభాతవార్త**



పిఎం -యు బిఎల్‌సి 1.0, పిఎం గ్రామీణ్ 1.0 మరియు పిఎం జన్‌మన్ పథకాల ద్వారా గృహాలు మంజూరు అయి ఉండి గృహ నిర్మాణము చేసుకుంటున్న ఎస్సి, ఎస్టి మరియు పివిటిజి -ఎస్టి చెంచు లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్ధిక సహాయం మంజూరు చేసినట్లు హౌసింగ్ శాఖ డిఈఈ షేక్ ఖదీర్ బాష, గిద్దలూరు నగర పంచాయితీ కమీషనర్ ఐ శ్రీనివాసులు, గిద్దలూరు ఎంపిడిఓ రమణారెడ్డి, గిద్దలూరు మండల హౌసింగ్ ఇన్చార్జి ఎం మహేశ్వరరెడ్డిలు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా డిఈఈ షేక్ ఖదీర్ బాష మాట్లాడుతూ గతములో గృహాలు మంజూరైన లబ్దిదారులు ఆర్ధిక ఇబ్బందులతో పూర్తి చేసుకోలేని వారికి అదనపు ఆర్ధిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పిఎం-యుబిఎల్‌సి 1.0, పిఎం గ్రామీణ్ 1.0 పథకంలో ఎస్సి, బిసిలకు రూ.50వేలు, ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80లక్షలు, మొత్తం రూ.2.30లక్షలు వస్తుందన్నారు. పిఎం -యుబిఎల్‌సి 1.0, పిఎం గ్రామీణ్ 1.0 పథకంలో షెడ్యూల్ తెగల -ఎస్‌టి వారికి అదనపు సహాయం రూ.75వేలు, ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80వేలు, మొత్తం యూనిట్ విలువ రూ.2.55లక్షలు వస్తుందన్నారు. పివిటిజి -ఎస్టి చెంచులకు అదనపు ఆర్ధిక సహాయం రూ.1లక్ష, ప్రస్తుతం యూనిట్ విలువ రూ.2.39లక్షలు, మొత్తం రూ.3.39లక్షలు వస్తుందన్నారు. ప్రభుత్వం అదనంగా మంజూరు చేస్తున్న ఈ సబ్సిడీని నాలుగు దశలలో చెల్లిస్తారన్నారు.

**మండలాలవారీగా వివరాలు :**

అర్ధవీడు మండలంలో 449గృహాలకుగాను రూ.274.75లక్షలు, బేస్తవారిపేట మండలంలో 495గృహాలకు గాను రూ.249లక్షలు, కంభం మండలంలో 321గృహాలకు రూ.163.25లక్షలు, గిద్దలూరు మండలంలో 371గృహాలకు రూ.200లక్షలు, గిద్దలూరు అర్బన్‌లో 439గృహాలకు రూ.224.75లక్షలు, కొమరోలు మండలంలో 385గృహాలకు రూ.193లక్షలు, రాచర్ల మండలంలో 131గృహాలకు రూ.66లక్షలు, మొత్తం గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలో 2591గృహాలకు గాను మొత్తం రూ.1370.75లక్షలు అదనపు సహాయం ద్వారా అందించనున్నారు.

**15 నుంచి అదనపు సహాయంపై అవగాహన :**

గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు ప్రభుత్వం అందిస్తున్న అదనపు సహాయంపై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న 6మండలాలలో ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీ సెక్రటరీలు, వారి పరిధిలోని గృహనిర్మాణ లబ్దిదారులను వ్యక్తిగతంగా కలిసి ప్రభుత్వం విడుదల చేస్తున్న అదనపు సబ్సిడీపై అవగాహన కల్పిస్తారన్నారు. అదనపు సబ్సిడీపై సమస్యలు ఉన్న లబ్దిదారులు సంబంధిత సచివాలయం లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ /వార్డు ఎమినిటీ సెక్రటరీ లేదా మండలంలోని హౌసింగ్ సహాయక ఇంజనీర్, మండల అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమీషనర్‌ను సంప్రదించాలని గిద్దలూరు సబ్ డివిజన్ డిఈఈ షేక్ ఖదీర్ బాష కోరారు.

## హోళీ పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

**- వైసిపి సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి**

**గిద్దలూరు, మార్చి 13, ప్రభాతవార్త**



హోళీ పర్వదినం గిద్దలూరు నియోజకవర్గ ప్రజల జీవితాలను రంగులమయం చేసి వెలుగులు నింపాలని మార్కాపురం మాజీ శాసన సభ్యులు, వైఎస్సార్సీపి గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి ఆకాంక్షించారు. హోళీ పండుగను ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

## హోళీ పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలి

**- గిద్దలూరు పట్టణ బిజేపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్**

**గిద్దలూరు, మార్చి 13, ప్రభాతవార్త**



గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు హోళీ పర్వదినాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సుఖ సంతోషాలతో జరుపుకోవాలని గిద్దలూరు పట్టణ బిజేపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ కోరారు. హోళీ పర్వదినం ప్రతిఒక్కరి జీవితాన్ని రంగులమయంగా మార్చాలని, అందరిజీవితాల్లో ఆనందాన్ని, ప్రేమను నింపాలని ఆయన ఆకాంక్షించారు.

# గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు హోళీ

**- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ముత్తుముల**


**గిద్దలూరు, మార్చి 13, ప్రభాతవార్త**



పచ్చటి పొలాలకు,అందమైన జీవనానికి ప్రతీక అయిన హోళీ పండుగ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హృదయపూర్వక హోళీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రంగుల పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని,ఐక్యతను, ప్రేమను నింపాలని, సత్సంగతి, శుభాభివృద్ధి మరియు సంతోషంతో మీరు అనుకున్న లక్ష్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

## రైతు ఆత్మహత్యపై విచారణ చేపట్టిన సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

**త్రిపురాంతకం, మార్చి 13, ప్రభాతవార్త**



త్రిపురాంతకంలో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ గురువారం విచారణ చేపట్టారు. గత ప్రభుత్వ కాలంలో సెప్టెంబర్ 2023 సంవత్సరంలో ఆళ్ల వెంకటేశ్వర్లు అప్పులబాధ తాళలేక పురుగుమందు త్రాగి మృతిచెందాడు. అయితే గత ప్రభుత్వ కాలంలో దానికి సంబంధించిన నివేదిక అధికారులు ప్రభుత్వానికి అందించారు. అందించిన కొన్ని రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం మారింది. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోరి అడుగున పడ్డ నివేదికలను బయటకు తీయించి విచారణ చేపట్టింది. అందులో భాగంగా గురువారం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ మృతిచెందిన రైతు కుటుంబ సభ్యులను పరామర్శించి విచారణ చేపట్టారు. వెంకటేశ్వర్లు మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పండించిన పంటను ఖర్చు చేసిన మొత్తం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుని భార్య, కుమారులు తమ కుటుంబ పరిస్థితిని వివరించారు. కుమారుడు ఇంజనీర్ 4వ సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు. ఈ కారణంగా రెండు సంవత్సరాల నుండి కళాశాల ఫీజ్ చెల్లించడం లేదని సబ్ కలెక్టర్‌కు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ పోషణ కూడా కష్టతరంగా ఉందని తెలిపారు. అనంతరం డబ్బులు పోయినందుకు బాధగా లేదని తమ బ్దఉవు లేకపోవడం చాలా బాధాకరంగా ఉందని కన్నీరు పెట్టుకున్నారు.త్వరలోనే కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.పై స్థాయి అధికారులకు నివేదిక పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహశిల్దార్ శ్రీనివాస్,ఏఓనీరజా,ఆర్ఐ ముకుందహరి,విఆర్ఓ వెంకటలక్ష్మి,రమ్య,బాధిత కుటుంబసభ్యులు ఉన్నారు.

## సింగరకొండ తిరునాళ్ళకు పటిష్టమైన బందోబస్తు

- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్.పి
- అధికారులకు పలు సూచనలు చేసిన ఎస్.పి
- డిఎస్‌పి పర్యవేక్షణలో తిరునాళ్ళ బందోబస్తు నిర్వహణ

**అద్దంకి, మార్చి 13, ప్రభాతవార్త**



ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 70వ వార్షిక తిరునాళ్ళ శుక్రవారం జరగనున్న నేపద్యంలో బందోబస్తు ఏర్పాట్లను బాపట్ల జిల్లా ఎస్.పి. తుషార్‌డూడీ గురువారం సాయంత్రం పరిశీలించారు. ఇప్పటికే రెండు రోజుల నుండి తిరునాళ్ళ మహోత్సవం ప్రారంభకాగ, అద్దంకి పట్టణ సి.ఐ. సుబ్బరాజు తిరునాళ్ళలో ప్రధాన ఉత్సవహం రోజున అవసరమైన ఏర్పాట్లను స్వీయ పర్యవేక్షణలో నిర్వహిస్తూ వున్నారు. అందులో భాగంగా ప్రధాన తిరునాళ్ళ రోజున లక్షలాది మంది భక్తులు తిరునాళ్ళకు రానున్న నేపద్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టిన భద్రతా చర్యలను ఎస్‌పి తుషార్ డూడీ స్వయంగా పరిశీలించారు. ప్రధానంగా పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసిన, సిసి కెమోరాలు విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. అదే విధంగా ఆలయంలో భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ లైన్‌లు కూడ ఎస్‌పి పరిశీలించారు. ఇక తిరునాళ్ళలోకి ప్రవేశించి అన్నీ మార్గాలలో నిర్వహించే బందోబస్తు విషయమై కూడ అధికారులకు సూచనలు చేశారు. మొత్తం తిరునాళ్ళకు సంబందించి 600మందికి పైగా సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. చీరాల డిఎస్‌పి మహమ్మద్ మొయిన్ సారధ్యంలో ప్రధాన తిరునాళ్ళ బందోబస్తు నిర్వహిస్తున్నారు. మొత్తం నలుగురు డిఎస్‌పిలు, 15మంది సి.ఐ.లు, 50మంది ఎస్.ఐ.లు, 600మంది సిబ్బంది తిరునాళ్ళ విధులలో నిమగ్నమై వున్నారు. అయితే ట్రాఫిక్‌కు సంబంధించి ఎటువంటి ఇబ్బందులకు తలెత్తకుండా సింగరకొండ ఆలయానికి నలువైపులా వున్న ముఖ్యమైన రహదారుల ట్రాఫిక్‌ను మళ్ళించినట్లు డిఎస్‌పి మహమ్మద్ మొయిన్ ఎస్‌పికి వివరించారు. ఒంగోలు -హైదరాబాద్ రోడ్డులోని ట్రాఫిక్‌ను మార్చ్టారు, చిలకలూరిపేట, నరసరావుపేట వైపుకు, వినుకొండ నుండి వచ్చు ట్రాఫిక్‌ను సంతమాగులూరు క్రాస్ రోడ్డు నుండి చిలకలూరిపేట వైపు, కడప నుండి వచ్చే వాహనాలను పొదిలి, చీమకుర్తి, ఒంగోలు వైపు, అద్దంకి ట్రాఫిక్ మేదరమెట్ల ఫైలాన్ నుండి నేషనల్ హైవే వైపు మళ్ళిస్తున్నట్లు పోలీసులు ఇప్పటికే ఆయా ప్రాంతాల వారికి సమాచారం ఇచ్చినట్లు డిఎస్‌పి వివరించారు.





## హాస్టల్ భవన నిర్మాణాలను నాణ్యతతో నిర్మించాలి

**- హాస్టల్ వసతి భవన నిర్మాణాన్ని నాణ్యతతో నిర్మించాలి - యారవ శ్రీనివాసులు**

**పామూరు, మార్చి 13, ప్రభాతవార్త**



కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక శ్రద్దతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంబంధిత మంత్రితో మాట్లాడి రూ.1.94కోట్ల నిధులతో మంజూరు చేయించిన బాలికల వసతి గృహ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు కోరారు. గురువారం పాత ప్రభుత్వ వైద్యశాల స్థలంలో నిర్మిస్తున్న హాస్టల్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న పాఠశాల, జూనియర్ కళాశాల కొరకు ప్రత్యేక చోరువతో ఉగ్ర నరసింహారెడ్డి చేస్తున్న కృషికి ప్రజలు రుణ పడి ఉంటారని అన్నారు. కనిగిరి అభివృద్ధి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికే సాధ్యమవుతుందన్నారు. త్వరలోనే సీఎస్‌పురం మండలంలో సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఎమ్మెల్యే కృషి ఫలితమే అన్నారు. బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణంతో పాటు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న ట్రిబుల్ ఐటీ నిర్మాణం చేపడితే కనిగిరి ప్రాంతం రాష్ట్రంలోనే అభివృద్ధి పథంలో ముందుంటుందని యారవ తెలిపారు. అంతే కాకుండా వెలుగొండ ప్రాజెక్టు సప్లయ్ ఛానెల్ ద్వారామోపాడు రిజర్వాయర్‌కు నీరు అందించేలా ఇరిగేషన్ శాఖ మంత్రితో ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చర్చలు జరుపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మెంబరు పిడుగు శ్రీనివాసులు, వాయినేని రాఘవ, కావేరి రసూల్, శేషం మోసే, పాల్గొన్నారు.

## నాట్స్ తెలుగు సంబరాలకు మాజీ ఎమ్మెల్యే కదిరికి ఆహ్వానం

**సీఎస్‌పురం, మార్చి 13, ప్రభాతవార్త**



అమెరికాలోని ఫ్లోరిడా నగరంలో జులై 4,5,6 వ తేదీల్లో జరిగే నాట్స్ అమెరికా తెలుగు సంబరాలకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే కందిరి బాబురావుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) అధ్యక్షులు మదన్ పాములపాటి ఆహ్వాన పత్రికను శీలంవారిపల్లి గ్రామంలో గురువారం అందజేశారు. నాట్స్ ఆధ్వర్యంలో అమెరికా తెలుగు సంబరాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామని తప్పని సరిగా హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావును కోరారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌పురం ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులు నాయుడు నారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు మురం కాశిరెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, కదిరి రమణయ్య, చావా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## దోర్నాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఘనంగా అంతర్జాతీయ ల్యాబ్‌టెక్నీషియన్ డే

**పెద్దదోర్నాల, మార్చి 13, ప్రభాతవార్త**



పెద్దదోర్నాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఇన్‌ఛార్జీ సూపరింటెండెంట్ డాక్టర్ తొండమల్లి వైద్య సంజీవ్ ఆధ్వర్యంలోగురువారం అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ చిరంజీవిని ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ల్యాబ్ పరీక్షల ద్వారా రోగాలను సత్వరమే గుర్తించి తధానుగుణంగా వైద్య సేవలు అందించి రోగ నివారణ చర్యలు చేపడుతున్నట్లు ల్యాబ్ గురించి వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ లావణ్య, డాక్టర్ మెర్సి, డాక్టర్ ఆంజనేయులు, హెడ్ నర్స్ ఎలిజిబెత్, ఫార్మర్సిస్టు పిచ్చిరెడ్డి, ఆరోగ్య మిత్రులు సంగటి మణికుమార్, ఎం.చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

**చింతల ఆరోగ్య కేంద్రంలో:**

చింతల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ శ్రీరామ శ్రీనివాసులు ఆసుపత్రి సిబ్బంది సన్మానించారు. 50 మంది గిరిజనులకు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఐరన్ సిరప్ లు, ప్రోటీను పౌడర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ యాగ్నిక్, సీహెచ్‌ఓ మంత్రు నాయక్, పీహెచ్‌ఎన్ సూర్య కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మత సామరస్యం పాటిస్తూ హోలీ పండుగ జరుపుకోవాలి

## - ఎస్సై మహేష్

**పెద్దదోర్నాల, మార్చి 13, ప్రభాతవార్త**



దోర్నాల మండల ప్రజలందరికి దోర్నాల ఎస్సై వి.మహేష్ హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మత సామరస్యం పాటిస్తూ సంతోషకర వాతావరణంలో హోళి పండుగ జరుపుకోవాలని సూచించారు. హోలీ పండుగ రోజు సంప్రదాయ రంగులు ఉపయోగం ఆరోగ్యకరం ఎదుటివారి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహారించవద్దు, ఇబ్బంది కలిగించవద్దు, మహిళల పట్ల మర్యాదగా ఉండాలని కోరారు. ప్రధాన కూడలి, కాలనీలు, రహదారులపై సీసీ కెమెరాలు ఉండటంతో పాటు డ్రోన్లు వినియోగిస్తున్నాం. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం లేదా ఏవేని సమస్యలకు కారణమైతే అట్టి వారిపైన చట్టపరమైన, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా, ఇతరులు మనోభావలు దెబ్బతీసేలా వ్యవహారించకుండా ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా పండుగలు ఏవైనా ప్రజలు కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని ఎస్సై కోరారు.

## బాలల నైపుణ్యాల వర్క్ షాపు

**వేటపాలెం, మార్చి 13, ప్రభాతవార్త**





మనో వికాసం- లోక్ కళాకార్ దివస్ పురష్కరించుకొని మార్చి 11,12,13వ తేదీల్లో చీరాల నియోజకవర్గ పరిధిలో బాలల నైపుణ్యాల వర్క్ షాపు వేటపాలెం మండలంలోని మండల ప్రాధమిక పాఠశాల(ఓఆర్ఎస్) నందు బాల, బాలికలకు చిత్రలేఖనం, చేతివ్రాత, వక్తృత్వం, ఏకాపాత్రాభినయం పోటీలు నిర్వహించడం జరిగింది. మొత్తం ఎనిమిది పాఠశాలల బాల, బాలికలు పోటీలలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి వేటపాలెం మండల విద్యాశాఖాధికారులు జే.సుబ్బయ్య, ఐ.పురుషొత్తం ముఖ్య అతిధులుగా విచ్చేసి విజేతలకు బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓఆర్ఎస్ ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.మంజులాదేవి, ఉపాధ్యాయులు కోడె శ్రీనివాసరావు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాపిల్ గ్రేస్, దేశాయిపేట మండల పరిషత్ ప్రాధమి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే.మల్లేశ్వరి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు శివకుమారి, డి.సరళి, జి.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, బిపద్మ పాల్గొన్నారు.

## ప్రధాన రోడ్ల పక్కన ఎండిపోయి ఉన్న వృక్షం

**చిన్నగంజాం, మార్చి 13, ప్రభాతవార్త**



ఒంగోలు నుంచి చీరాల వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఎండిపోయిన వృక్షాలతో ప్రమాదం పొంచి ఉంది. కడవకుదురు నుంచి వేటపాలెం వరకు రహదారికి రెండు వైపులా ఉన్న పెద్ద పెద్ద వృక్షాలు ఎండకు ఎండిపోయాయి. ఈ ఎండిపోయిన చెట్లు ఎప్పుడు కూలతాయో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ రహదారిలో చీరాల నుండి ఒంగోలు వైపుకు నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. వాహనాలు వెళ్లే సమయంలో ఎండిన చెట్లు వాహనాలపైన లేదా ద్విచక్ర వాహనదారులపై పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చెట్లను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పక్రియపై సమీక్ష సమావేశం

**కనిగిరి, మార్చి 13, ప్రభాతవార్త**



కనిగిరి అసెంబ్లీనియోజకవర్గంలో ఓటర్ల జాబితా పారదర్శకంగా సిద్దం చేయటానికి సంబంధించి రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన గురువారం ఆర్డీఓ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని ప్రధాన రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితాను సమగ్రంగా, స్పష్టంగా తయారు చేయడానికి అవసరమైన సూచనలు, రెవెన్యూ డివిజనల్ అధికారి అందించారు. అలాగే రాజకీయ పార్టీ ప్రతినిధుల నుండి అభిప్రాయాలు, సలహాలు స్వీకరించారు. ఇది ఎన్నికల సజావుగా నిర్వహణలో కీలకమైన భాగమని, పారదర్శకత పాటించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని అధికారి తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ ఆకుల వెంకట రవిశంకర్‌తో పాటు సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కనిగిరిలో హోమ్ కంపోస్టింగ్, పోషక, కిచెన్ గార్డెన్‌పై శిక్షణ

**కనిగిరి, మార్చి 13, ప్రభాతవార్త**



కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల రైతు సేవా కేంద్ర సిబ్బందికి, వ్యవసాయ అధికారులకు హోమ్ కంపోస్టింగ్, పోషక, కిచెన్ గారెడ్న్, మిద్దె తోటల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎగ్గోని వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీపీడీ ఆత్మ ఎం.విజయనిర్మల శిక్షణ కార్యక్రమం యొక్క ప్రాధాన్యతను వివరించారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. డీటీసీ డీఆర్‌సీ ఎస్.రామ్‌మోహన్ కంపోస్టు పిట్లు తయారీ, మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. డీఆర్సీ వ్యవసాయ అధికారి జే.వెంకటరావు హైడ్రోఫోనిక్ కల్టివేషన్ గురించి వివరించగా, వ్యవసాయాధికారులు వి.వెంకట శేషమ్మ, ఏ.శైలజారాణి హోమ్ కంపోస్టింగ్, కిచెన్ గార్డెన్, మిద్దె తోటల పెంపకంపై ప్రస్తుత పరిస్థితులను పీపీటీ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఎం.అంజనీబాయి, ఆరు మండలా వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానంలో అన్నదానం

**కనిగిరి, మార్చి 13, ప్రభాతవార్త**



కనిగిరి శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం నందు గురువారం మధ్యాహ్నా హారతి అనంతరం 400 మందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా శిర్డీ సాయి మందిరాల సమాఖ్య ట్రెజరర్ దేవకి సుబ్రహ్మణ్యం భాగ్యలక్ష్మీ దంపతులు, కుటుంబ సభ్యులు సహకారాన్ని అందించారు. ప్రతి గురువారం జరిగే ఈ వితరణ కార్యక్రమానికి భక్తులు సహకరించాలని ఆలయ అధ్యక్షుడు కొప్పురవు సత్యాలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా వెంకటేశ్వర్లు, మచ్చర్ల ధర్మారావు, వీసీ రామశాస్త్రి, ఈర్ల గురవయ్య, శ్రీరాం మురళి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, సాయి మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కశాలలో అకడమిక్ ఆడిట్

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల దర్శి అకడమిక్ ఆడిట్ 2023-24, 2024-25 జరిగింది. ఈ ఆడిట్‌కి అకడమిక్ అడ్వైజర్‌గా కంభం కళాశాల నుంచి బి.రాజేష్, డాక్టర్ బి.శ్రీకాంత్ నిర్వహించి కళాశా లలో అన్ని విభాగాల విద్యకు సంబంధించిన రికార్డులను పరిశీలించి బి గ్రేడ్‌ను ఇచ్చారు. ఈ ఆడిట్‌ను కళాశాల ఇన్‌ఛార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ప్రభుదాస్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ ప్రవీణ్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేత

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**




లయన్స్‌క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌లో 20 మంది పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్ తదితర వస్తువులను అందజేశారు. ఈ వస్తువులను లయన్ బిజ్జం నాగార్జునరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి లయన్స్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల ప్రేమ ఆప్యాయత, ఉపాధ్యాయుల మీద గౌరవం, దేవుని యందు భక్తిభావం కలిగి ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదువుకొని సమాజంలో మంచి పేరుప్రఖ్యాతలు సంపాదించుకోవాలన్నారు.

## గంటవానుపల్లి వాసి నందినికి డాక్టరేట్ అవార్డు

**పెద్దదోర్నాల, మార్చి 13, ప్రభాతవార్త**



పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లెకు చెందిన నందిని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ జీవీఎస్ఆర్ ఆంజనేయులు పర్యవేక్షణలో నందిని ఆన్ డిఫరెంట్ ఇంఫరెన్షియల్ మెథడ్స్ ఆఫ్ ఫార మీటర్స్ ఫర్ న్యూ వెయిటెడ్ ఎక్స్‌ప్ నేన్షియల్ డిస్ట్రిబ్యూషన్ అనే అంశంపై పరిశోధన చేశారు. పరిశోధన దిగ్విజయం కావడంతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆమెకు పీహెచ్‌డీ డిగ్రీ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డీన్ ఫిజికల్ సైన్సెస్, ఓఎస్‌డీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ రవికుమార్, విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు, చైర్మన్ ప్రొఫెసర్ బి.సత్యనారాయణ, గంటవానిపల్లి గ్రామస్తులు ఆమెను అభినందించారు.

## స్వచ్ఛ భారత్ పారిశుధ్య కార్మికులకు వేతనం రూ.10వేలు ఇవ్వాలి

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**




గ్రామ పంచాయితీలలో పారిశుధ్య కార్మికులుగా పనులు చేస్తున్న స్వచ్ఛ భారత్, క్లాప్ మిత్రలకు 2020లో ప్రభుత్వం ఇచ్చిన 10వేలు నెలకు వేతనం జీవో ని అమలు చేయాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద సీఐటీయు పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహాధర్నా జరుగుతుందని కార్మికులందరూ పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. దర్శి సుందరయ్య భవనంలో గురువారం ఆలూరి ఇస్రాయిల్ అధ్యక్షతన జరిగిన యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై ఆయన మాట్లాడుతూ ప్రజలను రోగాల భారిన పడకుండా గ్రామాలలో సేవలు అందిస్తున్న వారికి నెలకు 6వేలు వేతనం ఇవ్వడం అన్యాయం అని అన్నారు. 2020లో అప్పటి వైసీపీ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబరు 142 విడుదల చేసి నెలకు రూ.10వేలు రూపాయలు ఇస్తామని జీవో ఇచ్చి అమలు చేయకుండా కార్మికులకు ద్రోహం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు ఉపాధ్యక్షులు ఈమని నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, చలమయ్య, బాల గురవయ్య, అనోక్, ఇస్సాక్, విశ్రాంతమ్మ, అంజమ్మ, లక్ష్మీదేవి తదితర కార్మికులు పాల్గొని తమ సమస్యలను వివరించారు.

## నైపుణ్యతే ఉపాధికి మార్గం - డాక్టర్ బి.రమణమూర్తి

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**



యువతీ, యువకులు తమ వృత్తిలో నైపుణ్యత పెంచుకోవాలని, ఆ నైపుణ్యత ఉపాధి కల్పిస్తుందని రాష్ట్ర దళిత బహుజన రిసోర్స్ సెంటర్ స్టేట్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ బి.రమణ మూర్తి అన్నారు. గురువారం దర్శి మండల మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయం నందు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు డీబీఆర్సీ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో యువతీ, యువకులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వారు నైపుణ్యాలను పెంచుకొని ప్రస్తుతం కంప్యూటర్, డిజిటలైజేషన్ వ్యాపార రంగాలలో నైపుణ్యాలను పెంచుకుని కార్పొరేట్ సంసథలకు పోటీ పడి ఉద్యోగ అవకాశాలు సాధించుకోవాలని, అదే విధంగా ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీ, సంక్షేమ పథకాలు పొందాలని ద్వాని జీవితాలు బాగుపడతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్‌లు గుంటూరు నాగమణి, తప్పెట డేవిడ్, ఒంగోలు సిటీ కోఆర్డినేటర్ గుత్తి కోటేశ్వరరావు, వివిధ మండలాల నుండి యువతీ, యువకులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణంకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వాఇకి అదనపు ఆర్థిక సాయం

**- డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ డి.నిరీక్షణరావు**

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణం చేసుకొనుచున్న షెడ్యూల్ కులములు, షెడ్యూల్ తెగల వెనుకబడిన తరగతుల లబ్దిదారులకు అదనపు ఆర్థిక సహాయం మంజూరు చేయడమైందని గృహ నిర్మాణ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ డి.నిరీక్షణరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గృహంలో మంజూరైన లబ్దిదారులకి గృహంలో ఆర్థిక ఇబ్బందులు వలన పూర్తి చేసుకొనలేని వారికి అదనపు బాధ్యత సహాయం వలన వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దీన్ని ఉపయోగించుకోవాలన్నారు. అదనంగా 50 వేల రూపాయలు ఎస్సీ, ఎస్టీ బీసీ వారికి ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనిని సంబంధిత వారు ఉపయోగించుకోవాలన్నారు.

## టీటీడీ బోర్డు చైర్మన్ నాయుడుని కలిసిన పరిటాల

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**



తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ చైర్మన్ బీఆర్ నాయుడుని గురువారం మర్యాదపూర్వకంగా ఆయన ఛాంబర్లో కలిసి సన్మానించిన న్యాయవాది పరిటాల సురేష్. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

## పెద్దఉయ్యాలవాడ, కొర్లమడుగులో పొలం పిలుస్తోంది

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**



దర్శి మండలంలోని పెద్ద ఉయ్యాలవాడ, కొర్లమడుగు రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఎంఏఓ బాలకృష్ణ నాయక్ మాట్లాడారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు డి.సునీత, సి.మాధురి, రైతులు పాల్గొన్నారు.

## మహిళలకు భరోసాగా నిలిచిన మన చంద్రన్నకు మా మహిళ లోకం జేజేలు

**- టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ**

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**



మహిళల సాధికారితకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిన్న అసెంబ్లీలో మహిళలకు ఒక అన్నగా, ఒక కుటుంబ పెద్దగా ఇచ్చిన భరోసాపై మహిళలందరూ తరుపున దర్శి నియోజకవర్గటీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి మహిళను తన సొంత కాళ్లపై నిలబడే విధంగా ఆర్థిక పరిపుష్టతకు, కుటుంబానికి అండగా నిలబడే విధంగా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో మన కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు సీఎం ప్రకటించటం మనకెంతో శుభపరిణామమని అన్నారు. దర్శి ప్రాంతంలో కూడా మహిళా సాధికారితకు, మహిళా రక్షణకు తాను ఎప్పుడు కట్టుబడి ఉంటానని మహిళలకు అండదండగా ఒక మహిళగా, ఒక డాక్టర్‌గా మీ బాధను నా బాధగా మీ కుటుంబ బిడ్డగా వెన్నుదన్నుగా నిలుస్తానని డాక్టర్ లక్ష్మీ తెలిపారు.

## ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం - తహశీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**

దర్శి మండలం దర్శినగర పంచాయతీలో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అంశములకు సంబంధించి ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం చేపడుతున్నట్లు దర్శి తహశీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అంశములకు సంబంధించి ఎలాంటి సమస్యలున్న వాటిని వెంటనే పరిష్కారం చేసేందుకు ఈనెల 15వ తేదీ నుండి వచ్చే నెల 24వ తేదీ వరకు దర్శి నగర పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి తిరిగి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని దీనిని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేత

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**



దర్శి మావనత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దర్శి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామాగ్రిని అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విచ్చేసిన వక్తలు విద్యార్థులకు పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలో, అత్యధిక మార్కులు ఎలా సాధించాలో సూచనలు అందజేశారు. మానవత సభ్యులు సీహెచ్ బసవయ్య, ఎస్ఎన్‌సీహెచ్ సుబ్బారావు, ఆర్.రాఘవులు, సీహెచ్ రోషారావు, ఏ.వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ దేవతి వరప్రసాద్, కోచైర్మన్ వాకా జనార్ధన్ రెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, కోశాధికారి గొర్రెపాటి వేణు, డైరక్టర్ పి.రాజకేశవరెడ్డి, జే.సుశీలమ్మ, ఎస్ఎన్‌సీహెచ్ సుబ్బారావు, సభ్యులు సీహెచ్ బసవయ్య, సీహెచ్ తిరుపతిరెడ్డి, మస్తాన్ నాయక్, రోషారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాశినాయన క్షేత్రంపై రాజకీయం ఎందుకు..?

**దర్శి, మార్చి 13, ప్రభాతవార్త**

డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అటవీశాఖ అధికారులు పంపించి ఉచితంగా అన్నం పెట్టే ఆశ్రమాలను కూల్చడం ఎంత వరకు కరెక్ట్ అని రాష్ట్ర అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల చైర్మన్, దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ కైపు వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న బీజేపీ ఈ చర్య మీద ఏ విధంగా స్పందిస్తారు. పవన్ కళ్యాణ్ అక్రమంగా కరకట్ట మీద కట్టుకున్న చంద్రబాబునాయుడు ఇల్లుని కూల్చగలరా అని ప్రశ్నించారు. సామాన్యులు అంటే ఎందుకు మీ అంత చిన్న చూపు అని అన్నారు. ఈ దుశ్చరియా హిందూ మనోభావాలను దెబ్బతీయడం కాదా అని అన్నారు.

14-3Pg5.qxd:14-3Pg5.qxd 01/01/01 7:21 AM Page 1



# బడ్జెట్‌పత్రాలపై 'రూపాయి' గుర్తు మార్పు




## తమిళంలో 'రూ' గుర్తు వేసిన స్టాలిన్ సర్కార్

**చెన్నై,మార్చి 13:** తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కేంద్రంలో ఇప్పటికే జాతీయ విద్యావిధానంపై కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో తమిళనాడు బడ్జెట్‌పత్రాలపై రూపాయి గుర్తును తొలగించింది. అదే స్థానంలో తమిళ భాషలో రూపాయి అక్షరాన్ని పొందుపరిచింది. బడ్జెట్ పత్రాల్లోకూడా గత ఏడాది బడ్జెట్‌కు సంబంధించి ఆర్‌ఇ గుర్తును సూచించాయి. ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ స్వయంగా ఈ కొత్తలోగోను తన సోషల్‌మీడియా ఎక్స్‌లో విడుదలచేసారు. కరెన్సీ గుర్తును మార్చడం ద్వారా కేంద్రం అనుసరిస్తున్న ఏకపక్ష పోకడలను ఎంతమాత్రం అనుసరించేదిలేదన్న సంకేతాలను ఇచ్చినట్లయింది. రాష్ట్రాలపై హిందీని బలవంతంగా రుద్దడాన్ని ఎప్పటినుంచో తమిళనాడు వ్యతిరేకిస్తోంది. అలాగే కొత్త జాతీయ విద్యావిధానంలో త్రిభాషా సూత్రం పేరిట హిందీని నేర్చుకోవాలని బలవంతం చేయడాన్ని స్టాలిన్‌సర్కారు తొలినుంచీ వ్యతిరేకిస్తోంది. అయితే ఇందుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వంనుంచి ఎలాంటి ముందస్తు నోటీసు లేదని కూడా తెలుస్తోంది. డిఎంకె నాయకుడు శరవణన్ అన్నాదురై మాట్లాడుతూ ఇదేమీ చట్టవిరుద్ధం కాదని, అక్రమం అంతకంటే కాదని ఇదేమీ మా షోడౌన్ అంతకంటే కాదని, తమిళభాషకు ప్రాధాన్యం కల్పించే లక్ష్యంతోనే ఇదంతా చేసినట్లు చెప్పారు.

ఈ మార్పుపై బిజెపి రాష్ట్రప్రతినిధి నారాయణన్ తిరుపతి మాట్లాడుతూ ఈ చర్యలు డిఎంకె భారత్‌లో అన్నింటికంటే ప్రత్యేకం అని భారత్‌నుంచి వేరుచేసినట్లుగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తప్పుదారి పట్టించేందుకే ఇలాచేస్తోందని విమర్శించారు. బిజెపి రాష్ట్ర చీఫ్ అన్నామలై మాట్లాడుతూ త్రిభాషా సూత్రాన్ని తమ పార్టీ అమలుచేస్తుందని, ముఖ్యమంత్రి చర్యలు అనాలోచితంగా ఉన్నాయని ఆరోపించారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి 'స్టుపిడ్' అని సంభోదించడంతో ఈ వ్యాఖ్యలు మళ్లీ దుమారంరేపాయి. ఆర్‌ఇ గుర్తును 2010 జులైలో ఒక డిఎంకె ఎమ్మెల్యే కుమారుడే రూపొందించాడని ఇపుడు ఇలాంటి చర్యలు ఎలా తీసుకుంటారని అన్నారు. మరో తమిళ బిజెపి సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేకంగా డిఎంకె వ్యవహరిస్తోందన్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో అధికారంలోని డిఎంకె, బిజెపిలమధ్య ఇప్పటినుంచే విమర్శల జడివాన కురుస్తోంది. ఎన్నికల వార్ అప్పుడే ప్రారంభించినట్లుగా కనిపిస్తోంది. డిఎంకె ఎఐఎడిఎంకె, బిజెపిలమధ్యనే ఈ పోటీ గట్టిగా నడుస్తుందన్నది తెలిసిందే. తమిళనాడులో ఇప్పటివరకూ అసలు కాలుపెట్టలేని బిజెపి ఈసారి ఎలాగైనా ప్రభుత్వం ఏర్పాటు లక్ష్యంతో ముందుకుపోతోంది. తమిళ భాషను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు బిజెపియే చేసిందని, డిఎంకె ఏమీ చేయలేదని ఆరోపించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ద్రవిడియన్ ఐకాన్ ఇవి పెరియార్‌చేసిన వ్యాఖ్యలను గుర్తుచేసారు.

తమిళభాషను అనాగరిక భాష అని చేసిన వ్యాఖ్యలు గురునతచేస్తూ డిఎంకె ఇప్పటికీ ఆ నాయకుడి సిద్ధాంతాల్లోనే వెళుతోందని తమిళ భాష ఒక ఛాంపియన్ భాషగా తీసుకెళ్లాలని చూస్తోందని అన్నారు.



# ట్రంప్ ఎవరినీ వదలరు!

## జి-7 దేశాలకు కెనడా హెచ్చరిక

**ఒట్టావా, మార్చి 13:** వాణిజ్య యుద్ధభయాలు జి-7 దేశాలను వెంటాడుతున్నాయి. తాజాగా ఆ గ్రూప్ విదేశాంగ మంత్రుల సమావేశంలో కూడా ఈ అంశం చర్చకు వచ్చింది. కెనడా మంత్రి మెలానియో జోలీ మాట్లాడుతూ అమెరికాతో ముదురుతున్న ట్రేడ్‌వార్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రరాజ్య చర్యలతో ఎదురయ్యే పరిణామాలపై మిగిలిన దేశాలను హెచ్చరించారు. 'అత్యంత సన్నిహిత మిత్రదేశమైన మాతో అమెరికా ఇలా చేయగలిగితే.. ఇక ఎవరూ సురక్షితం కాదు' అని ఆమె వ్యాఖ్యానించారు. కెనడా రాబోయే విపత్తును ముందుగానే హెచ్చరిస్తోందన్నారు. అమెరికా చర్యలకు వ్యతిరేకంగా మిగిలిన మిత్రదేశాల మద్దతును కూడగట్టి ఎదుర్కొనేందుకు వీలుగా జోలీ ఈ చర్యలు చేపట్టినట్లు భావిస్తున్నారు.

మరోవైపు కెనడా సార్వభౌమత్వాన్ని ప్రశ్నిస్తూ ట్రంప్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలను కూడా జోలీ ఈ సమావేశంలో ప్రస్తావించారు. కెనడా అలాంటి బెదరింపులకు ఏమాత్రం వెనక్కి తగ్గదని ఆమె పేర్కొన్నారు. ఐరోపా సమాఖ్యతో కలిసి యుద్ధ విన్యాసాలు చేయడం, ఆయుధ తయారీ వంటివి తమ సార్వభౌమత్వ రక్షణకు అవసరమని వ్యాఖ్యానించారు.

మరోవైపు అమెరిక మంత్రి మార్కో రూబియో మాత్రం కెనడా స్వాధీనంపై ట్రంప్ వ్యాఖ్యలను కొంచెం తేలిగ్గా చూపించే ప్రయత్నం చేశారు. ఆర్థిక కోణంలో మాత్రమే తమ అధ్యక్షుడు కెనడాను 51వ రాష్ట్రం కావాలని ఆకాంక్షించారని వివరణ ఇచ్చారు.

'ఒకవేళ కెనడా 51 రాష్ట్రం అయితే అప్పుడు సరిహద్దుల గురించి, ఫెంటెనిల్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నది ట్రంప్ భావన' అని రూబియో సర్దిచెప్పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'జి-7 సమావేశానికి ఉద్దేశించిన అంశాలపై దృష్టి పెట్టాలని.. అంతే కానీ.. ఇది మేము కెనడా ఆక్రమిస్తాం అన్నందుకు ఏర్పాటు చేసిన సమావేశం కాదు' అని వ్యాఖ్యానించారు.

అమెరికా-కెనడా సంబంధాలుచరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో పతనంఅయ్యాయి. కెనడా ఉక్కు, అల్యూమినియంపై సుంకాలను 50 శాతానికి పెంచుతామని తొలుత ప్రకటించిన ట్రంప్.. ఆ తర్వాత వెనక్కి తగ్గారు. 25 శాతమే అమలు చేస్తామని ప్రకటించారు. దీనికి కెనడా కూడా తీవ్రంగా స్పందించింది. వాషింగ్టన్ నుంచి దిగుమతి అయ్యే 20 బిలియన్ డాలర్ల వస్తువులపై ప్రతీకారసుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది.

# సునీత రాక మళ్లీ వాయిదా!



**వాషింగ్టన్, మార్చి 13:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)లో చిక్కుకుపోయిన భారత అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు మరోసారి నిరాశేఎదురయింది. తొమ్మిది నెలలుగా ఐఎస్‌ఎస్‌లో ఉంటున్న ఆమె భూమిమీదికి రావడం మరింత ఆలస్యం అయ్యేలా ఉంది. ఐఎస్‌ఎస్‌నుంచి సునీతతోపాటు బచ్ విల్మోర్‌ను భూమిపైకి తెచ్చేందుకు నాసా స్పేస్ ఎక్స్ సంయుక్త కార్యాచరణ క్రూ10 మిషన్‌లోభాగంగా గురువారం జరగాల్సిన ప్రయోగం వాయిదా పడింది. అమెరికాలోని ఫ్లోరిడా నుంచి నలుగురు వ్యోమగాములతో ఫాల్కన్9 రాకెట్ బయలు దేరేందుకు క్రూ 10మిషన్ సిద్ధంఅయింది. చివరి నిమిషంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగం నిలిచిపోయింది హైడ్రాలిక్ సిస్టమ్‌లో సమస్య రావడంతో ఆపేసినట్లు నాసా ప్రకటించింది. శుక్ర, శనివారాల్లో ఈప్రయోగం తిరిగి నిర్వహిస్తామని వెల్లడించింది. షెడ్యూలుప్రకారం ఈ ప్రయోగం ఈనెల 25న జరగాలి. అయితే నాసా ముందుకు జరిపినా వాయిదా తప్పలేదు. క్రూ10 ద్వారా కొత్తబృందం ఐఎస్‌ఎస్‌కు చేరుకోగానే స్పేస్ ఎక్స్‌కుచెందిన డ్రాగన్ కానయప్సూల్ ఎండీవర్‌ద్వారా సునీ, విల్మోర్‌లు భూమిమీదకు తిరిగి వస్తారు. టెస్ట్‌మిషన్‌కోసం బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ అంతరిక్ష నౌకలో విలియమ్స్, విల్‌మోర్ 2024 జూన్‌5న అంతరిక్షంలోకి వెళ్లారు. ఎనిమిదిరోజులకే వారు భూమిమీదకు రావాల్సి ఉంటే స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ ఐఎస్‌ఎస్‌కు చేరుకోగానే సమస్యలు రావడంతో వాయిదాపడుతూ వచ్చింది. అందులోని ప్రొపల్షన్ సిస్టమ్‌లో లీకులు ఏర్పడి థ్రస్టర్స్ మూసుకుపోవడంతోపాటు హీలియంకూడా అయిపోయింది. ఈక్రమంలో వ్యోమగాములను ఈ నౌకలో తిరిగి భూమిపైకి తీసుకురావడం సురక్షితం కాదని ఆగస్టు నెలాఖరుకు నాసా ఒక నిర్ణయానికివచ్చింది. దీనితో వ్యోమగాములు లేకుండా బోయింగ్ స్టార్‌లైనర్ 2024 సెప్టెంబరు 7నక్షేమంగా భూమికి తిరిగివచ్చింది. అప్పటినుంచి సునీత, విల్‌మోర్‌అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఇపుడు కూడా సాంకేతిక సమస్యలు రావడంతో మళ్లీ వారిని తీసుకురావడం అనేది వాయిదాపడింది.



నిసార్ ఉపగ్రహాన్ని మోసుకెళ్లనున్న జిఎస్‌ఎల్‌వి రాకెట్

# మే 20న నిసార్ ఉపగ్రహ ప్రయోగం

## వేదిక శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం

### ఇస్రో, నాసా కలయికతో ఈ సంయుక్త ఉపగ్రహ ప్రయోగం

**శ్రీహరికోట (తడ), మార్చి 13 ప్రభాతవార్త:** అంతరిక్ష పరిశోధనలో అగ్రగాములుగా ఉన్న రెండు సంస్థలు ఏకమయ్యాయి. యుఎస్‌కు చెందిన నాసా, భారత్‌కు చెందిన ఇస్రోలు సంయుక్తంగా నిసార్ అనే ఒక ఉపగ్రహాన్ని రూపొందించాయి. ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపరచడం మాత్రమే కాకుండా అత్యంత ఆధునిక సామర్థ్యంతో ఉపగ్రహ సేవలు అందుబాటులోకి వస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. గురువారం నిసార్ ఉపగ్రహ ప్రయోగ తేదీని ఇస్రో ప్రకటించింది. ఈఏడాది మే 20న ఉదయం 6 గంటలకు జిఎస్‌ఎల్‌వి రాకెట్ ద్వారా మన శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి దీన్ని ప్రయోగిస్తున్నారు. సాధారణంగా దీన్ని శాటిలైట్‌గా కూడా పేర్కొంటున్నారు. ఉపగ్రహం అంతరిక్షంలోని లోఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశించి అవసరమైన సేవలు అందించేలాగా తయారు చేశారు. ఇందులో ఎల్ బ్యాండ్, ఎస్ బ్యాండ్‌లు అమర్చారు. ఎల్ బ్యాండ్‌లను నాసా రూపొందించింది. ముఖ్యంగా జిపిఎస్ సేవలు, హై కెపాసిటీతో భూమి చిత్రాలు తీసిపంపించే సామర్థ్యంగల పరికరాలు నాసా రూపొందించింది. ఇస్రో ఎస్ బ్యాండ్లను తయారు చేయడం కాకుండా మన రాకెట్ ప్రయోగ కేంద్రంనుంచి ఈకీలకఘట్టం నిర్వహించనుంది. 2,800 కిలోల బరువు ఉన్న నిసార్ ఉపగ్రహం డ్యూయల్ ఫ్రీక్వెన్సీ ఇమేజింగ్ రాడార్ శాటిలైట్‌గా ఉంటుంది. 39 అడుగుల పొడవున్న స్టేషనరీ రాడార్ వ్యవస్థకలిగిన ఇది మొత్తం బంగారు పూతతో కప్పివేయబడుతుంది. భూమి, సముద్రంలో మార్పులు ఎప్పటికప్పుడు కనుక్కోవడం, వాతావరణ మార్పులు స్పష్టంగా తెలుసుకొని విపత్తులు నివారించడం దీని లక్ష్యంగా చెప్తున్నారు. ఇటువంటి బహుళ ప్రయోజనకారి అయిన ఉపగ్రహాన్ని ఇస్రో, నాసాలు ప్రయోగిస్తుండటంతో భవిష్యత్‌లో ఎంతో ఉపయోగం ఉంటుందని, రెండు అతి పెద్ద సంస్థల కలయికతో మరిన్ని సంచలనాలు సృష్టించవచ్చని నమ్ముతున్నారు.

## ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల ప్రమాదంలో

# 85 లక్షల మంది పిల్లల భవిష్యత్తు: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, మార్చి 13:** ప్రశ్నాపత్రాల లీక్‌లపై కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మరోసారి స్పందించారు. ఈ లీక్‌లకారణంగా కష్టపడిచదివే విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీనిపై పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. ప్రశ్నాపత్రాల లీకులతో 6 రాష్ట్రాల్లోని 85 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి కారణంగా కష్టపడి చదివే పిల్లలతో పాటు వారికుటుంబాలు ఒత్తిడికి గురవుతున్నాయి. వారి కష్టానికి తగిన ఫలితం అందడం లేదు. దీని వల్ల కష్టపడి పనిచేయడం కంటే నిజాయతీగా లేకపోవడమే మంచిదనే తప్పుడు సందేశం భవిష్యత్తు తరాలకు వెళుతుంది. అది ఆమోదయోగ్యం కాదు. నీట్ పేపర్ లీక్ దేశాన్ని కుదిపేసి ఏడాది కూడా కాలేదు. దీనిపై మేము పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేశాం. ప్రదాని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం లీకులను అడ్డుకోలేకపోయింది. ఇది వారి వైఫల్యానికి నిదర్శనం. అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విభేదాలు పక్కనపెట్టి దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వీటిని అరికట్టగలం. ఈ పరీక్షలు మన పిల్లల హక్కు. దాన్ని ఎలాగైనా రక్షించాలి అని రాహుల్ రాసుకొచ్చారు.

# ఖగోళంలో రెండు అద్భుతాలు

## సూర్య చంద్రగ్రహణాలు ఆవిష్కృతం



**న్యూఢిల్లీ, మార్చి 13:** ఖగోళంలో రెండు అద్భుతాలు జరుగుతున్నాయి. ఈనెల 14న చంద్రగ్రహణం ఏర్పడుతుండగా 2నెల 29న పాక్షిక సూర్యగ్రహనం దర్శనమిస్తోంది. ఈ ఏడాది రెండు సూర్య, చంద్రగ్రహణాలు ఏర్పడతాయని ఖగోళ శాస్త్రజ్ఞులు తెలిపారు. సూర్య గ్రహణాలు, ఒక చంద్ర గ్రహణం భారత్‌లో కనిపించేందుకు అవకాశం ఉంది. ఒకగ్రహణం మాత్రమే వీక్షించగలమని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. సూర్యుడి కాంతి భూమిని చేరకుండా చంద్రుడు పూర్తిగా కమ్మేసిన సందర్భంలో సూర్యగ్రహణం ఏర్పడుతుంది. ఈ దృగ్విషయాన్ని సంపూర్ణ సూర్యగ్రహణంగా భావిస్తారు. సూర్యుడికి భూమికి మధ్య పాక్షికంగా చంద్రుడు అడ్డుగా వచ్చిన సందర్భంలో పాక్షిక సూర్యగ్రహణం ఏర్పడుతుంది.

అలాగే భూమి చంద్రుడిని పూర్తిగా కమ్మేస్తే సంపూర్ణ చంద్రగ్రహణంగా పేర్కొంటారు. చంద్రుడిలో కొంతభాగం మాత్రమే భూమినీడలో కనిపించకుండా పోతే ఈ అంశాన్ని పాక్షిక చంద్రగ్రహణంగా భావిస్తారు. ఈ ఏడాది తొలి చంద్రగ్రహణం ఈనెల 13,14 తేదీలమధ్య వస్తోంది. ఇది సంపూర్ణ చంద్రగ్రహణం కావడం విశేషం. అయితే ఈగ్రహణం భారత్‌లో మాత్రం కనిపించే అవకాశం లేదు. ఆస్ట్రేలియా, ఐరోపా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా,పసిఫిక్ మహాసముద్రం, అట్లాంటిక్ మహాసముద్రం, ఆర్కిటిక్ మహాసముద్రం, తూర్పు ఆసియా, అంటార్కిటికాలో మాత్రమే కనిపిస్తుంది. ఈ ఏడాది తొలిసూర్యగ్రహణం ఈనెల 29న ఆవిష్కృతం అవుతుంది.

ఈగ్రహణం పాక్షిక గ్రహణం. అయితే భారత్‌లో కనిపించదు. బెర్ముడా, బార్బడోస్, డెన్మార్క్, ఆస్ట్రియా, బెల్జియం, ఉత్తర బ్రెజిల్, ఫిన్లాండ్; జర్మనీ, ఫ్రాన్స్ హంగేరి ఐర్లాండ్, జర్మనీ ఫ్రాన్స్ ఐర్లాండ్‌తోపాటు పలుదేశాల్లో మాత్రమే కనిపిస్తుంది.

ఇక రెండోచంద్రగ్రహణం సెప్టెంబరు 7,8 తేదీల మధ్య కనిపిస్తుంది. ఈ గ్రహణం భారత్‌తోపాటు యూరప్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఉత్తర, పశ్చిమ అమెరికా ఆఫ్రికా సహా పలుదేశాల్లో కనిపిస్తుంది. రెండో సూర్య గ్రహణం సెప్టెంబరు 21న సంభవిస్తుంది. ఈ గ్రహణం కూడా భారత్‌లో కనిపించదు. న్యూజిలాండ్, ఫిజీ, అంటార్కిటికా, దక్షిణాస్ట్రేలియా సహా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తుంది.

# రెండు పెళ్లి వాహనాలను ఢీకొన్న గ్యాస్ ట్యాంకర్

## ఏడుగురు మృతి, ముగ్గురికి గాయాలు

**థార్(మధ్యప్రదేశ్), మార్చి 13:** రాష్ట్రంలోని ధార్‌జిల్లాలో ఒక గ్యాస్ ట్యాంకర్ రెండు పెళ్లి వాహనాలను ఢీకొనడంతో ఏడుగురు స్పాట్‌లోనే చనిపోయారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్యాస్ ట్యాంకర్ రాంగ్ రూట్‌లో బమన్‌సుత గ్రామంలో బద్నావార్ ఉజ్జయిని హైవేపైవస్తోంది. రత్లాం, మాండ్‌సౌర్ ప్రాంతాలకు చెందిన ఈ పెళ్లిబృందం ఎదురువస్తోంది. ధార్ ఎంపి మనోజ్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ ట్యాంకర్ ముందు కారు, వెనుకనే వస్తున్న జీపును ఢీకొన్నది. నలుగురు అక్కడే చనిపోయారని, మరో ముగ్గురు ఆసుపత్రిలోచనిపోయినట్లు చెప్పారు.

# వాణిజ్య ఉద్రిక్తతలను చర్చలతో పరిష్కరించుకుందాం

## అమెరికాకు చైనా పిలుపు



**బీజింగ్, మార్చి 13:** అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే చైనాపై సుంకాలతో డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. అందుకు ప్రతిగా బీజింగ్ కూడా దూకుడు నిర్ణయాలు తీసుకుంది. దీంతో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య ఉద్రికత్తతలు నెలకొన్నాయి. ఈ పరిణామాలపై తాజాగా చైనా స్పందిస్తూ.. అగ్రరాజ్యంతో చర్చలకు పిలుపునివ్వడం గమనార్హం. 'ఆర్థిక, వాణిజ్య రంగాల్లో విభేదాలు, వివాదాల పరిష్కారం విషయంలో చైనా - అమెరికా దేశాలు సానుకూల, సహకార వైఖరిని అవలంబించాలని మేం ఎల్లప్పుడూ కోరుకుంటాం. అయితే, ఇరు దేశాల మధ్య ఆ సంప్రదింపులు, చర్చలు పరస్పర ప్రయోజనాలు, సమానత్వం, గౌరవంపై ఆధారపడి జరగాలని ఆశిస్తున్నాం. బెదరింపులు, కవ్వింపులతో ప్రతికూల ఫలితాలే వస్తాయి. అమెరికా, చైనాకలిసి పనిచేస్తాయని ఆశిస్తున్నాం. చర్చలతో సమస్యను పరిష్కరించుకోవడమే సరైన మార్గం' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి హీ యాంగ్‌కియాన్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

అమెరికా అధ్యక్షుడిగా జనవరిలో ప్రమాణ స్వీకారం చేసిన ట్రంప్.. ఆ వెంటనే మెక్సికో, కెనడాతో పాటు చైనాపై సుంకాలు విధించారు. ప్రమాదకర ఫెంటనిల్ సరఫరాను అడ్డుకోవడంతో విఫలమైనందుకు గానూ బీజింగ్‌పై 10 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవలే సుంకాలను 20 శాతానికి పెంచుతున్నట్లు మరో షాకిచ్చారు. దీనికి చైనా సర్కారు కూడా దీటుగా స్పందించింది. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు, పోర్క్, చికెన్ వంటి వాటిపై 15 శాతం వరకు టారిఫ్‌లు వసూలు చేస్తామని వెల్లడించింది.

రానున్న రోజుల్లో అగ్రరాజ్యం తీసుకునే నిర్ణయాలకు ప్రతిస్పందన కూడా అదే స్థాయిలో ఉంటుందని ఇదివరకే హెచ్చరించింది. ఈ పరిణామాల వేళ యుఎస్‌తో చర్చలకు పిలుపునిస్తూ చేసిన తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## మా సంపాదన మొత్తం

# భార్యలు తాగేస్తున్నారు!

## ఒడిశాలో ఫిర్యాదులు చేసిన భర్తలు

**కోరాపుట్(ఒడిశా), మార్చి 13:** భర్తలు తాగుబోతులయిపోయారని మా సంసారాన్ని నిలబెట్టాలని ఫిర్యాదులుచేసే భార్యలనే చూసాం. కానీ అందుకు విరుద్ధంగా మా కష్టం అంతా కూడా మా భార్యలు తాగేస్తున్నారంటూ భర్తలు ఫిర్యాదులుచేసినసంగతి వెలుగులోకి వచ్చింది. మద్యానికి బానిసలైన మా భార్యలు తాము కూలిచేసి సంపాదిస్తున్నదంతా మద్యానికి తగలేస్తున్నారని, మీరే మా కుటుంబాలను ఆదుకోవాలని భర్తలు పోలీసులకు ఫిర్యాదుచేసారు. విస్మయానికి గురిచేసే ఈ సంఘటన ఒడిశాలోని కోరాపుట్‌జిల్లాలో జరిగింది. బొరిగుమ్మ సమితిలోని పూజారిపుట్ పంచాయతీ కొండగూడ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు తమ భార్యలపై పోలీసులకు ఫిర్యాదుచేసారు. గ్రామంలోని కొందరు యువకులు గత నాలుగేళ్లుగా నాటుసారా తయారుచేస్తూ అమ్ముతున్నారని, ఊళ్లో మగాళ్లంతా కూలిచేస్తూ డబ్బులు సంపాదిస్తుంటే ఆడవాళ్లు తమ కష్టాన్ని మద్యానికి దారబోస్తున్నారని వారు వాపోయారు. దీనితో తమ పిల్లల భవిష్యతు, కుటుంబాలుకూడా అంధకార మయం అవుతున్నాయన్నారు. సారా తయారీ స్థావరాలపై దాడులుచేయాలని వారు కోరారు. పోలీసులు అబ్కారీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన బాధితులు సారాను అడ్డుకోవాలనికోరారు. ఒడిశాలోని మారుమూల కొండల్లో నాటుసారా తయారీ భారీగా సాగుతోంది. ఇక్కడ తయారుచేసి మైదాన ప్రాంతాలక సరఫరాచేసి సొమ్ముచేసుకుంటున్నారు. దాడులుచేస్తున్నా భయపడటంలేదు. లాభసాటి వ్యాపారంగా మారడంతోకేసులకు వెనుకంజవేయడంలేదు. జైలుకెళ్లినా బెయిల్‌పై వచ్చి మళ్లీ వ్యాపారంచేసుకుంటున్నారు. ఈ నాటుసారాకు ఆనారోగ్యం తప్పదని, గ్యాస్ట్రిక్‌సమస్యలు, గుండె, కిడ్నీలు చెడిపోతాయని చెపుతున్నారు.నరాలు దెబ్బతిని మతిస్థిమితం కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే గతంతో పోలిస్తే నాటుసారా స్థావరాలపై పెద్దసంఖ్యలో పోలీసులు ఎక్సైజ్ అధికారులు దాడులుచేస్తున్నారు. ఆధునిక సాంకేతికత వినియోగించుకుని సారాయి స్థావరాలను కనిపెట్టి వాటిని ధ్వంసంచేస్తున్నారు. కాగా భార్యలపై భర్తలుచేసిన ఫిర్యా దులు ఇపుడు ఒడిశామొత్తం సంచలనం కలిగించింది.

# స్నేహితుడే కీచకుడు

## బ్రిటన్ యువతిపై లైంగికదాడి చేసిన సోషల్‌మీడియా స్నేహితుడు

**న్యూఢిల్లీ, మార్చి 13:** సోషల్‌మీడియాలో చిగురించిన స్నేహంతో తన మిత్రుడిని కలిసేందుకు వచ్చిన ఒక బ్రిటన్ మహిళను స్నేహం మాటున ఆతడి పైశాచికం బయటపడింది. ఢిల్లీలోని ఒక హోటల్‌లో దిగిన ఆమెను కలిసేందుకు వచ్చిన ఆ యువకుడు హోటల్‌రూమ్‌లోనే ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఢిల్లీలోని మహిపాల్‌పూర్‌ప్రాంతంలో ఈసంఘటన జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టుచేసినట్లుప్రకటించారు. ఈసంఘటన మొత్తం బ్రిటిష్ హైకమిషన్‌కు కూడా తెలియజేసారు. సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లో ఒక బ్రిటిష్ మహిళతో ఢిల్లీ వాసి పరిచయం పెంచుకున్నాడు. గోవాలో పర్యటించిన ఈమహిళ ఢిల్లీకి వచ్చింది. తూర్పుఢిల్లీలోని తన సోషల్‌మీడియా స్నేహితుడిని కలిసేందుకు ఆమె ఢిల్లీకి చేరుకుని మహిపాల్‌పూర్‌లోని ఒక హోటల్‌లో దిగింది. ముందు ఆమెను హోటల్ లిఫ్ట్‌లో ఒక హౌస్‌కీపింగ్ సిబ్బంది వేధించాడు. ఆ తర్వాత హోటల్‌రూమ్‌కు వెళ్లినతర్వాత సోషల్‌మీడియాలోపరిచయం అయిన స్నేహితుడే ఆమెపై లైంగిక దాడికి దిగాడు. ఒక నెలరోజులక్రితమే ఆమె సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌పై పరిచయం అయిందని పోలీస్ అధికారులు తెలిపారు. తూర్పుఢిల్లీకి చెందిన కైలాష్ అనే యువకుడు ఇంగ్లీషు రాకపోయినా ట్రాన్స్‌లేషన్ యాప్ సాయంతో ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ఇద్దరూ కలవాలని నిర్ణయించుకుని తూర్పుఢిల్లీలోని మహిపాల్‌పూర్‌లోని ఒక హోటల్‌లో దిగిన ఆమెను కలిసేందుకు వచ్చిన కైలాష్ ఆమెపై అత్యాచారంచేసాడని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసునమోదుచేసి ఇద్దరినీ అరెస్టుచేసారు. ముందు హోటల్‌లోని సిసిటివి ఫుటేజిని తీసుకుని మొత్తం పరిశీలిస్తున్నారు.

# డాక్టర్ కుటుంబాన్ని వెంటాడిన అప్పల భారం

## చెన్నైలో కుటుంబం మొత్తం ఆత్మహత్య



**చెన్నై, మార్చి 13:** నగరంలో నివసిస్తున్న ఒక వైద్యుడు ఆయన భార్య ఇద్దరు కుమారులు తమ ఇంట్లో విగతజీవులుగా పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. చెన్నైలోని అన్నానగర్‌లోని ఇంట్లో ఈ సంఘటనను గుర్తించి ఇరుగుపొరుగు వాసులు చేసిన ఫిర్యాదుతో పోలీసులు వెంటనే ఆప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. సోనోలాజిస్టు డాక్టర్ బాలమురుగన్, ఆతని భార్య న్యాయవాది సుమితి, వారి కుమారులు నీట్ అభ్యర్థి జస్వంత్‌కుమార్, 11వ తరగతి విద్యార్థి లింగేష్‌కుమార్‌లు ఇంట్లోని గదుల్లో వేలాడుతూ కనిపించారు. ఈ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులుపెరిగిపోవడంతో ఈ కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపిస్తోంది. డా.బాలమురగన్ నగరంలో అనేక అల్ట్రాసౌండ్‌స్కానింగ్ సెంటర్లు నిర్వహించారు. దీనితో ఆయన భారీ స్థాయిలో అప్పుల్లో కూరుకునిపోయారు. డాక్టర్‌డ్రైవర్ ఇంటికిరాగానే తలుపుకొడితే ఎవ్వరూ స్పందించకపోవడంతో అనుమానం వచ్చింది. ఇరుగుపొరుగువారినికూడా సంప్రదించాడు. వారుసైతం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వెంటనే పోలీస్ స్టేషన్‌కువెళ్లి సమాచారం ఇచ్చాడు. దీనితో 52 ఏళ్ల బాలమురుగన్, ఆతని 47 ఏళ్ల భార్యవారిద్దరు కుమారులు కూడా చనిపోయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారంతట వారే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# మంత్రి లోకేష్‌పై అనంతపురం కోర్టులో వైఎస్సార్సీ నాయకుల పిటీషన్

## - సోషల్ మీడియాలో తమ నాయకులను కించ పరిచారని ఫిర్యాదు




కోర్టు బయట వైసిపి నాయకులు, న్యాయవాదులు

**అనంతపురం, మార్చి 13 ప్రభాతవార్త బ్యూరో** తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారాలోకేష్‌పై గురువారం అనంతపురం కోర్టులో వైసిపి నాయకులు ఫిర్యాదు చేస్తూ పిటీషన్ దాఖలు చేశారు. తమ నేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు రోజా, విడతల రజినిలను కించ పరుస్తూ సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టింగులు పెట్టారని ఆరోపిస్తూ వైసిపి అనంతపురం నేత చవ్వా రాజశేఖర్‌రెడ్డి అనంతపురం జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు నారపరెడ్డి, పసలూరు రఘునాథరెడ్డి, మోహన్, ప్రభాకర్‌రెడ్డి, వైసిపి లీగల్ సెల్ తరపున న్యాయవాదులు ఉమాపతి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్టు బయట వైసిపి నేత చవ్వా రాజశేఖర్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తమ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు రోజా, విడతల రజినిల ఫోటోలను మర్పింగ్ చేసి కించ పరిచే విధంగా అశ్లీలంగా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టారని ఆరోపించారు. యేసు క్రీస్తు స్థానంలో తమ నేత వైఎస్ జగన్ ఫోటో పెట్టి మార్ఫింగులు చేసి క్రిస్టియన్ల మనోభావాలను దెబ్బతీసే విధంగా యత్నించారన్నారు. 2024 సంవత్సరం డిసెంబర్ 21వ తేదిన ఐటిడిపి వారు సోషల్‌మీడియాలో పోస్టింగులు పెట్టడం తాను చూశానని తాను ఇంట్లో కూర్చుని ఈ పోస్టింగులు చూశానని ఐ టిడిపి వెనుక టిడిపి జాతీయ కార్యదర్శి నారాలోకేష్ హస్తం ఉందని, తాను భావించానని అందుకే తగిన చర్యలు తీసుకోవాలని న్యాస్థానాన్ని ఆశ్రయించినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 21వ తేదిన అనంతపురం టూ టౌన్ సిఐకి ఈ విషయంపై ఫిర్యాదు చేశానని, అయితే కేసు కూడా నమోదు చేయలేదన్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా ఎస్పీకి సైతం ఈ ఫిర్యాదును పంపామన్నారు. అయినా స్పందన లేనందున తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని చవ్వా రాజశేఖర్‌రెడ్డి తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి వారిపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని చిన్న చిన్న పోస్టింగులకే వైసిపి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని టిడిపి వారు సోషల్ మీడియాలో పెద్ద పెద్ద పోస్టింగులు పెట్టినా వైఎస్ కుటుంబాన్ని వివిధ రూపాల్లో అప్రదిష్టపాలు చేసినప్పటికీ అందుకు బాధ్యులైన టిడిపి వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# దోపిడియత్నం కేసును 24 గంటల్లో ఛేధించిన పోలీసులు

## పట్టుబడిన 7మంది దుండగులు - నిందితుల నుండి తుపాకులు, కత్తులు స్వాధీనం



దోపిడియత్నం కేసును చేధించి నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

**చిత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం గాంధీరోడ్డులోని ఓ ఇంట్లో బుధవారం తెల్లవారుజాము తుపాకులు, కత్తులతో వెళ్ళి దోపిడి చేయడానికి యత్నించిన కేసును పోలీసులు 24 గంటల్లో ఛేధించి ఏడు మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరించారు. నంద్యాల, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన క్రిమినల్ రికార్డులు వున్న ఏడు మంది నిందితులు గాంధీరోడ్డులోని ఓ ఇంట్లో దోపిడికి యత్నించి పట్టుబడ్డారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో ఎస్పీ మణికంఠ చందోలు గురువారం విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. నంద్యాలకు చెందిన పసుపులేటి సుబ్రమణ్యం(52) క్రిమినల్ స్వభావం కల్గిన వాడని నంద్యాల పోలీస్ స్టేషన్‌లో ఇతనిపై ఆరు కేసులు వున్నాయని, ఒక దోపిడి కేసులో 10 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి వచ్చి ప్రస్తుతం చిత్తూరులో ఎస్ఎల్వి ఫర్నిచర్ దుకాణంను నిర్వహిస్తున్నాడన్నారు. సుబ్రమణ్యం చిత్తూరు నగరంలో దోపిడి చేయడానికి తనకు తెలిసిన క్రిమినల్స్‌ను నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల నుండి రప్పించి గాంధీరోడ్డులోని పుష్ప కిడ్స్ షాపు యాజమాని చంద్రశేఖర్ ఇంటిని టార్గెట్ చేశారన్నారు. చంద్రశేఖర్ ఇంటిలో దోపిడి చేయడానికి ఏడు మంది నిందితులు బుధవారం ఉదయం 5.30 గంటలకు చేరుకున్నారని, ఉదయం 6.10 గంటలకు చంద్రశేఖర్ భార్య శాంతి డోర్ తీసుకుని బయటికి రాగా అప్పటికే బయట సిద్ధంగా వున్న సుబ్రమణ్యం, అతని గ్యాంగ్ సభ్యులు తుపాకీ, కత్తులతో ఆమెను బెదిరించి ఇంట్లోకి తీసుకెళ్ళి డబ్బులు, బంగారం గురించి బెదిరిస్తుండగా అప్పుడే లేచిన ఆమె భర్త చంద్రశేఖర్, ఆమె కుమారుడు అక్కడికి వస్తే సుబ్రమణ్యంపై చంద్రశేఖర్‌తో పాటు అతనితో వచ్చిన నిందుతులు కత్తులతో తల, చేతిపై గాయం చేశారన్నారు. వీరి నుండి తప్పించుకున్న చంద్రశేఖర్ బయటికి వచ్చి కేకలు వేయడంతో పాటు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడే కింద వున్న స్థానికులు అక్కడికి చేరుకుని ఒక భవనం నుండి మరొక భవనంపైకి దూకి పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. గోడ దూకిన సుబ్రమణ్యం కిందపడిపోవడంతో అతని కాలికి గాయం అయ్యిందని, మిగిలిన ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకోవడం జరిగిందన్నారు.

# 16న విజయవాడలో వారధి కార్యక్రమం




మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న గంజి జగన్

**విజయవాడ, మార్చి 13, ప్రభాతవార్త :** మహారాష్ట్రలో నివశిస్తున్న కోటిమంది ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల ఉపయోగార్థం తాము వారధి కార్యక్రమాన్ని ఈ నెల 16న విజయ వాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహి స్తున్నట్లు సంస్థ అధ్యక్షులు గంజి జగన్ బాబు తెలిపారు. గురువారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్రలోని ముంబై, థానే, నావిముంబై, పూనే, సోలాపూర్, షిర్డి, నాగపూర్ తదితర నగరాల్లో తెలుగు ప్రజలను వ్యాపార, వాణిజ్య, సాంస్కృతిక సంఘటితం చేయడానికి ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర (ఎఫ్‌టిఎఎం) ఆధ్వర్యంలో ఈ వారధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. వివాహ పరిచయ వేదిక, మరాఠి బడి, తెలుగు బడి ముంబైలో ప్రస్తుతం నిర్వహిస్తున్నామని, అన్ని తెలుగు పండుగలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. తమకు ఇరు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాల సహకారమందిస్తున్నారన్నారు. ఈనెల 16న నిర్వహించే కార్యక్రమానికి డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణం రాజు, మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, ఎంపిలు కేశినేని శివనాథ్, కె అప్పలనాయుడు, ఎమ్మెల్యే బోండా ఉమా, సినీనటుడు సుమన్ లతో పాటు పలువురు ఉన్నత ప్రభుత్వాధికారులు పాల్గొంటారన్నారు.

# ఎసిబి వలలో చిక్కిన ఆఫీస్ అసిస్టెంట్

**శ్రీకాకుళం-ప్రభాతవార్త:** జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న బి.బాలరాజు ఏసీబీ అధికారులకు చిక్కాడు. అదే శాఖలో పని చేస్తోన్న కుక్ అటెండర్ నుంచి 25 రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2015 నుంచి రావల్సిన ఇంక్రిమెంట్లు కోసం ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారు. సర్వీస్ రికార్డులు అప్‌డేట్ చేసేందుకు 25 రూపాయలు లంచం డిమాండ్ చేయడంతో మున్సిపల్ కార్యాలయం సమీపంలో నగదు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి అరెస్ట్ చేశారు. 2016లో కూడా హాస్టల్ విద్యార్థుల స్కాలర్‌షిప్ కుంభకోణంలో గతంలో బాలరాజు ఏసీబీకి చిక్కారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో ఉంది. మరోసారి బాలరాజు ఏసీబీ అధికారులకు చిక్కడం గమనార్హం.

# టిడ్కో ఇళ్లకు కొత్త లబ్దిదారుల ఎంపికకు మార్గదర్శకాల జారీ

**విజయవాడ మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి:** టిడ్కో ఇళ్లకు కొత్త లబ్దిదారుల ఎంపికకు ప్రభుత్వం కొన్ని కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. తక్కువ సిబిల్ స్కోరు, చనిపోయిన లేదా ఎక్కువ వయసున్న లబ్దిదారులు తమకు కేటాయించిన టిడ్కో ఇళ్లకు రుణాన్ని చెల్లించేందుకు ముందుకు రాకపోయిన లబ్దిదారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినా అనర్హులుగా గుర్తించినా వారి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేసేందుకు ప్రభుత్వం మార్గ దర్శకాలను విడుదల చేసింది. వయోవృద్ధులు సిబిల్ స్కోరు తక్కువగా ఉన్నవారికి బ్యాంకు నుంచి రుణం మంజూరు చేయించేందుకు ఉన్న అవకాశాలను మునిసిపల్ కమిషనర్లు పరిశీలించాలని సూచించింది. లబ్దిదారే ఒకే విడతలో రుణ మొత్తం చెల్లించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారేమో పరిశీలించాలని పేర్కొంది. లేని పక్షంలో లబ్దిదారు ఇంటిలో అర్హత ఉన్నవారితో జాయింట్ ఓనర్‌షిప్‌తో ఇంటిని తిరిగి కేటా యించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్లాట్ కేటాయించిన లబ్దిదారు చనిపోయిన పక్షంలో కుటుంబ సభ్యుల్లో అర్హులకు కేటాయించాలన్నారు.

# శాసనమండలిలో వైఎస్సార్సీ స్కాములపై చర్చకు టిడిపి ఎమ్మెల్సీల డిమాండ్

**సచివాలయం,మార్చి 13,ప్రభాతవార్త :** శాసనమండలిలో గురువారం ప్రశ్నోత్తరాల కార్య క్రమం అనంతరం గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన స్కాములు చర్చకు అనుమతించాలని టిడిపి ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ముందుగా స్వల్పకాల చర్చలో గత వైకాపా ప్రభుత్వంలో మైనింగ్ రెవెన్యూ విద్యుత్తు మద్యం తదితర శాఖల్లో వేల కోట్ల రూపాయల స్కాముల ద్వారా కొందరునేతలు అక్రమాలకు పాల్పడ్డారని ఆ విషయాలపై టిడిపి విప్ పి.అనురాధ వివరించారు. దీనిపై వైకాపా సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభ్యుల మధ్య వాదనలు నెలకొన్నాయి. అనంతరం వైకాపా ఎమ్మెల్సీ కుంభ రవి మాట్లాడుతూ 2014లో ఓటుకు నోటు కేసులో చంద్రబాబు నాయుడు తెలంగాణా ప్రభుత్వానికి భయపడి ఏపికి వచ్చారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్ళు హైదరాబాద్‌ను రాజధానిగా పరిపాలన చేసుకునే అవకాశం ఉన్నా వ్యక్తిగత స్వార్థంతో వచ్చారని తెలిపారు. దీనిపై టిడిపి మంత్రి అచ్చన్నాయుడు మాట్లాడుతూ సభలో లేని వ్యక్తుల గురించి ప్రస్తావించి సభ్యులు పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఆ కేసు లన్నీ న్యాయస్థానంలో తీసేసిన విషయం సభ్యుడు మర్చిపోయినట్లు ఉన్నారని ఇది సభా హక్కుల ఉల్లంఘన కింద వస్తుందని తెలిపారు. దీంతో వైకాపా ఎమ్మెల్సీ పక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ టిడిపి సభ్యులు సభను కొనసాగకుండా అడ్డుకోవాలని ఉద్దేశ్యంతోనే గత ప్రభుత్వంలో స్కాములు జరిగాయంటూ ఆరోపణలు చేస్తున్నారని దీంతో మా సభ్యులు అలా మాట్లాడారని వివరణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా ఎప్పటికైనా మంచి రాజధాని ఉండాలని ఎంతోదూర దృష్టితో ఎంతోఅనుభవం ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నగరాన్ని నిరి ్మంచతలపెడితే దాన్ని నాశనం చేయాలని గత వైకాపా ప్రభుత్వం కక్ష కట్టిందని ఈ విషయం రాష్ట్ర ప్రజలందరూ తెలుసుకున్నారని ఇకనైనా ఈ విషయాలపై ప్రతిపక్ష సభ్యులు మాట్లాడకుండా ఉంటే గౌరవం ఉంటుందని తెలిపారు. విరామం అనంతరం సభను కొనసాగించే ప్రయత్నం చేయడంతో టిడిపి సభ్యులు గత ప్రభుత్వం స్కాములపై చర్చించే అవకాశం కల్పించాలని ఛైర్మన్‌ను కోరారు. దీంతో వైకాపా సభ్యులు టిడిపి సభ్యుల మధ్య ఘర్షణ నిలపడటంతో ఛైర్మన్‌సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

# ఏ గ్రామంలో చూసినా భూ సమస్యలే!

## - తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్


**తొట్టంబేడు, మార్చి 13 ప్రభాతవార్త** ఎక్కడ..ఏ గ్రామంలో చూసినా భూసమస్యలే అధికంగా తన దృష్టికి వస్తున్నాయని 70 నుంచి 80శాతం ఇవే అత్యధికంగా ఉన్నాయని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి గ్రామంలో ఆయన



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పక్కన ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి తదితరుల

రైతులతో సమావేశమైనారు. ఈసందర్భంగా ఆయనకు ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, డిఐరాఘవయ్య, తహశీల్దార్ మధుసూధనరావు, మాజీ సర్పంచ్ రామానాయుడులు స్వాగతం పలికారు. ముందుగా ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించిన అనంతరం వాటిని ఎలా పరిష్కరించాలో తెలిపారు. గత ప్రభుత్వంలో చేసిన పొరపాట్ల వల్లే రీసర్వేలో తప్పులు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం అన్నదాతలు బ్యాంకు నుంచి రుణాలు తీసుకుంటామంటే 1బి, అడంగల్‌లో తప్పులు వస్తున్నాయని, తమ భూములకు చెందిన విస్తీర్ణం కొన్నింట్లో ఎక్కువ చూపించడం, కొన్నింట్లో తక్కువ చూపించడం కనిపిస్తోందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో 411 జాయింట్ ఎల్‌పిలు వచ్చాయని వివరించారు. వీటిలో సాదాబైనామాలు ఉన్నవాటిని మరో రెండు , మూడు నెలల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం వస్తున్న 1బి, అడంగల్‌లో సర్వేనంబర్లు, ఎక్కువ ఎక్కువ, తక్కువ విస్తీర్ణాలు చూపుతున్నాయని కొందరు రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మాజీ ఎంపిటిసి విజయకుమార్ మాట్లాడుతూ తనకు విస్తీర్ణం ఎక్కువగా చూపుతోందని 3.80 ఎకరాలు ఉండాల్సి ఉండగా 5.20 ఎకరాలు రీసర్వేలో వచ్చిందన్నారు. ఇలా మరికొందరు రైతులు తమ భూములకు సంబందించి సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. బోనుపల్లి రెవెన్యూలో మొత్తం 1506 ఎల్‌పిఎంలు ఉన్నాయని 2023 వరకు విస్తీర్ణం 1554.52 ఎకరాలుగా ఉందన్నారు. 957 ఖాతాలు ఉన్నాయని వివరించారు. వీటిలోపట్టా భూములు 654.26 ఎకరాలు, వెట్‌ల్యాండ్ 286.03 ఎకరాలు, డ్రైల్యాండ్386.23 ఎకరాలు ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో డికెటి పట్టాలు 338.36 ఎకరాలు, ప్రభుత్వ భూములు అలాట్ చేయనివి 558.39ఎకరాలు, ప్రభుత్వ భూముల్లో సైట్లు 2.48ఎకరాలు ఉందన్నారు. గతంలో భూముల కొనుగోలు చేసిన వారు తెల్లకాగితాలపై సంతకాలు పెట్టుకుని ఉండేవారని వీటిని సాదాబైనామా భూములంటారని వీటిని రెగ్యులరైజ్ చేయడం కోసం ముఖ్యమంత్రి, మంత్రి దృష్టికి తీసుకెళ్ళామని మరో రెండు, మూడు నెలల్లో ఈచట్టం వస్తుందని ఎవ్వరు ఆందోళన చెందనసరం లేదన్నారు. రీ సర్వేలో తప్పులను సరిచేస్తామని అందరు కాస్త ఓపిగ్గా ఉండాలని కలెక్టర్ వివరించారు. గొలుసుతో సర్వే చేసేకంటే నేడు రోవర్‌తో సర్వేపనులు సత్వరం పూర్తవుతాయని రైతులకు ఎంత భూమి ఉందో కరెక్టుగా చూపుతుందన్నారు. రైతులు పండించిన వరి పంటను ప్రభుత్వమే రూ.2,300వరకు కొనుగోలు చేస్తోందని అయితే ఇందుకు సంబందించి వ్యవసాయశాఖ నుంచి విలేజ్ అగ్రికల్చర్ అధికారి ఎందుకు రైతులకు ఇవన్నీ చెప్పడం లేదని ఎన్ని సార్లు ఇప్పటి వరకు సమావేశాలు పెట్టారో ప్రశ్నించగా మౌనం వహించారు. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ ఏమయ్యా..రైతులు నష్టపోతుంటే మీరేం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు రైతులకు చెప్పాలని తెలియదా అని విఎఎ లక్ష్మన్‌కు వార్నింగ్ ఇచ్చారు.

# ఇంద్రకీలాద్రిలో నేడు గిరి ప్రదక్షిణ



విరాళమిచ్చిన దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, మార్చి 13, ప్రభాత'వార్త' :** అమ్మలగన్న అమ్మ బెజవాడ దుర్గమ్మవారి ఆలయంనుండి శ్రీ గంగాభవానీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల గిరి ప్రదక్షణ ఈనెల 14 శుక్రవారం జరుగుతుందని ఇఒ కె రామచంద్రమోహన్ తెలిపారు. ఉదయం 5.55గంటలకు పాత గాలిగోపురం, ఘాట్‌రోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ కామధేను మాత అమ్మవారి ఆలయం వద్ద ఈ గిరి ప్రదక్షణ ప్రారంభమై, విద్యాధరపురం, నాలుగుస్థంబాల సెంటర్, పాలఫ్యాక్టరీ, కెబిఎన్ కాలేజ్, బ్రాహ్మణ వీధి గుండా శ్రీ అమ్మవారి ఆలయానికి చేరుకుంటుందని ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని శ్రీ అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఇఒ తెలిపారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి గురువారం విజయవాడకు చెందిన మోటూరు శివ మోహన్ రావు, కమలారాణి లు రు1,00,116లను విరాళంగా అందించారు. దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం లను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

# తెలుగు రాష్ట్రాల రైల్వే జిడిసిఇ నోటిఫికేషన్ రద్దు

**గుంతకల్లు రైల్వే,మార్చి 13,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల్లోని దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో పనిచేస్తున్న గ్రూప్-డి సిబ్బందికి, గ్రూప్-సి క్యాడర్‌లో పదోన్నతులు కల్పించేందుకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సంబంధిత జోనల్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. తూర్పు మధ్య రైల్వే జోన్‌లో ఇటీవల సిఎల్ఐల వ్రాత పరీక్షతో పాటు రైల్వేలో ఇటీవల జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో అవినీతి,అక్రమాలు వెలుగులోకి రావడంతో రైల్వే బోర్డు తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు పదోన్నతులకు సంబంధించి జిడిసిఇ/ఎల్‌డిసిఇ ప్రక్రియను చేపట్టరాదని భారతీయ రైల్వేలోని అన్ని జోన్‌ల ఉత్పత్తి కార్మాగారాలకు చెందిన జనరల్ మేనేజర్‌లను ఆదేశించింది. దీంతో ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే గత ఏడాది సెప్టెంబరు 10న జారీ చేసిన జిడిసిఇకి సంబంధించి జారీ చేసిన నోటిఫికేషన్ నెంబర్ ఆర్ఆర్‌సి/ఎస్‌సిఆర్/జిడిసిఇ/01/2024నోటిఫికేషన్‌ను సైతం జోనల్ ఉన్నతాధికారులు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# డిసిపల్లిలో అగ్నిప్రమాదం -12గుడిసెలు దగ్ధం



అగ్నికి ఆహుతవుతున్న పూరిగుడిసెలు.

**మర్రిపాడు,(నెల్లూరు) మార్చి 13,ప్రభాతవార్త:** మండలంలోని డిసిపల్లిలో పొగాకు కూలీలకు చెందిన 12 గుడిసెలు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. గుడిసెలో మంటలు చెలరేగడంతో గుడిసెల్లో ఉన్న మూడు గ్యాస్ సిలిండర్లు పేలిపోయాయి. గ్యాస్ సిలిండర్లు భారీ శబ్దంతో పేలడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదంలో ఓ ఆటోకూడా దగ్ధమైంది. ప్రమాద సమయంలో కూలీలు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ప్రనమాదంలో కూలీలకు చెందిన వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. దీంతో వారు కట్టుబట్టలతో మిగిలారు. ఈసంఘటనలో దాదాపు 4లక్షల రూపాయల మేర ఆస్థి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. బాపట్ల జిల్లా నుండి వారు డిసిపల్లికి వచ్చినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ తహసిల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన కట్టుబట్టలతో మిగిలిన కూలీల కుటుంబాలకు తన సొంత నిధులను బట్టలకు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కూలీలకు ప్రభుత్వం ద్వారా సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

ఆత్మకూరు సిఐ గంగాధర్ బాధితులను పరామర్శించి తన సొంత నిధులు 5వేల రూపాయలను వారికి అందజేశారు.



# సంగంలో నకిలీఎస్ఐ అరెస్టు

**సంగం (నెల్లూరు)మార్చి 13 ప్రభాతవార్త** సంగం మండలం సిద్దీపురంకి చెందిన హరీష్ అనే ముద్దాయి 2023లో వచ్చిన ఎస్ఐ ఫలితాల్లో సెలక్ట్ అయినట్లు ప్రజల్ని నమ్మించి ఎస్ఐ వేషదారణలో మోసం చేస్తుండా పట్టుకున్నట్లు ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్ తెలిపారు. సైజుకు తగ్గట్టు యూనిఫాం కొట్టించుకొని బెల్ట్,సింహాలు,బూట్లు, నేం ప్లేట్లు,టోపి, నక్షత్రాలు తయారు చేయించుకొని ఎస్ఐగా చలమాణి అవుతున్న నకిలీ ఎస్ఐని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి తెలిపారు. డిజిటల్ అరెస్టుల గురించి కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయనకోరారు. ఈకార్యక్రమంలో ప్రతిభ కనబరచిన సిఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్, సిబ్బందిని అభినందించారు.

# కట్నం వేధింపుల కేసులో నిందితుడికి జైలు శిక్ష

**చేజర్ల, (నెల్లూరు) మార్చి 13 ప్రభాతవార్త :** కట్నం వేధింపుల కేసులో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ ఆత్మకూరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు మ్యాజిస్ట్రేట్ గురువారం తీర్పును వెలువరించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చేజర్ల గ్రామానికి చెందిన మహిళ కు రాపూరు మండలం వీరాయపాలెం గ్రామానికి చెందిన కొమ్మాల యుగంధర్ కుమార్ తో 2016 సంవత్సరంలో వివాహం అయింది. అయితే వివాహం అయినప్పటి నుంచి భార్య మీద అనుమానం పడుతూ అదనపు కట్నం కోసం వేధింపులు గురి చేసేవాడు. దీంతో అప్పట్లో ఆమె చేజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేయడం చేశారు.

జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్, ఆత్మకూరు డిఎస్పి, సంగం సీఐ ,చేజర్ల ఎస్సై బాధితులకు న్యాయం జరిగే విధంగా సాక్షాధారాలను సేకరించి నేర నిరూపణకు కృషి చేశారు. నిందితుడి పై ఆరోపణలు రుజువు కావడంతో 18 నెలల జైలు శిక్ష ,ఐదువేల రూపాయల జరిమానా విధించారు.

# కాశీనాయన ఆశ్రమం షెడ్లు పునర్నిర్మాణానికి మంత్రి లోకేష్ చేయూత



మంత్రి నారా లోకేష్ ఆదేశాల ప్రకారం కూల్చిన షెడ్లను నిర్మిస్తున్న దృశ్యం

**సచివాలయం, మార్చి 13,ప్రభాతవార్త :** సున్నితమైన సమస్య విద్య,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ స్పందన తీరుపై భక్తులు సానుకూలంగా స్పందించారు. కాశీనాయన ఆశ్రమం షెడ్లు కూల్చేసిన అటవీ అధికారులు. ప్రభుత్వం తరపున ఆశ్రమ నిర్వాహకులకు క్షమాపణలు చెప్పటంపై ఆయన స్వాగతం పలుకుతూ కొనిఆడుతున్నారు. షెడ్లుతన సొంత నిధులతో పునర్నిర్మిస్తానని మాటిచ్చిన నారాలోకేష్, ఇచ్చిన 24గంటల్లో షెడ్ల పునర్నిర్మాణం ప్రారంభం.. విలువలు అంటే ఆచరించకుండా పోస్టర్లు వేసుకొని ప్రచారం చేసుకునేవి కావు. విశ్వసనీయత అంటే ఇచ్చిన మాట తప్పడమూ కాదు. కాశీనాయన ఆశ్రమం షెడ్లు కూల్చివేసి, అటవీశాఖ అధికారులు తప్పుచేసినా...బాధ్యతగల మంత్రిగా తప్పును సరిదిద్దే చర్యలను నారా లోకేష్ తీసుకున్నారు. ఇవీ విలువలు అంటే ఆశ్రమ నిర్వాహకులు జీరయ్యస్వామితో ఫోన్‌లో మాట్లాడారు. జరిగిన సంఘటన పట్ల విచారం వ్యక్తంచేశారు. ఇకపై ఏ అవసరం వచ్చినా,ఏ సమస్య ఉన్నా తననే నేరుగా సంప్రదించాలని స్వామికి భరోసా ఇచ్చారు. కూల్చిన షెడ్లను తన సొంత నిధులతో పునర్నిర్మిస్తామని జీరయ్యస్వామితో చెప్పారు మంత్రి నారా లోకేష్. ఈ మాట చెప్పిన 24గంటల్లో మంత్రి ఆదేశాలతో రంగంలోకి దిగిన బృందం కూల్చివేసిన షెడ్ల శిధిలాలను తొలగించింది. పునర్ నిర్మాణ పనులు ఆరంభించింది.. సున్నితమైన సమస్యపై విద్య,ఐటి శాఖమంత్రి నారా లోకేష్ స్పందనపై ప్రశంసల వర్షం,కాశీనాయన ఆశ్రమం షెడ్లు కూల్చేసిన అటవీ అధికారులు,ప్రభుత్వం తరపున ఆశ్రమ నిర్వాహకులకు క్షమాపణలు చెప్పిన మంత్రి. షెడ్లు తన సొంత నిధులతో పునర్‌నిర్మిస్తానని మాటిచ్చిన నారాలోకేష్ . హామీ ఇచ్చిన 24గంటల్లో షెడ్ల పునర్మిణం ప్రారంభం. విలువలు అంటే ఆచరించికుండా పోస్టర్లు వేసుకొని ప్రచారం చేసుకునేవి కావు. విశ్వసనీయత అంటే ఇచ్చిన మాట తప్పడమూ కాదు.

# రైల్వే సిసిటిసిల నోటిఫికేషన్లను రద్దుచేసిన సంచాలన్ భవన్

**గుంతకల్లు రైల్వే,మార్చి 13,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల్లో దక్షిణ మధ్య రైల్వేలో ఎల్‌డిసిఇ/జిడిసిఇల నోటిఫికేషన్‌ల రద్దు ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. తాజాగా సికింద్రాబాద్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న 43సిసిటిసి పోస్టుల భర్తీకై గ్రూప్-డి క్యాడర్ సిబ్బందికి,గ్రూప్-సిలో ఎల్‌డిసిఇ 162/3 శాతం కోటాలో సిసిటిసిలుగా భర్తీ చేసేందుకు పదోన్నతులు కల్పించే నిమిత్తం గత ఏడాది జూలై 31న సంచాలన్ భవన్ నోటిఫికేషన్ జారీ చేసి డిసెంబరు 1న వ్రాత పరీక్షను సైతం నిర్వహించింది. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి 11న ఖాళీగా ఉన్న మరో 3చీఫ్ కమర్షియల్ టిక్కెట్ సూపర్‌వైజర్(సిసిటిసి) 10శాతం కోటాకు సంబంధించి ఎల్‌డిసిఇ నోటిఫికేషన్‌ను కూడా సంచాలన్ భవన్ అధికారులు రెండు వేర్వేరు నోటిఫికేషన్‌లను జారీ చేశారు. ఇటీవల తూర్పు మధ్య రైల్వే జోన్‌లో సిఎల్ఐల వ్రాత పరీక్షతో పాటు రైల్వేలో ఇటీవల చోటుచేసుకున్న అవినీతి,అక్రమాలు నేపథ్యంలో రైల్వే బోర్డు తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు పదోన్నతులకు సంబంధించి జిడిసిఇ/ఎల్‌డిసిఇ ప్రక్రియను చేపట్టవద్దని భారతీయ రైల్వేలోని అన్ని జోన్‌లు,ఉత్పత్తి కర్మాగారాలకు చెందిన జనరల్ మేనేజర్‌లను ఈ నెల 5న ఆదేశించింది. దీంతో ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ గత ఏడాది జూలై 31న ఈ ఏడాది ఫిబ్రవరి 11న జారీ చేసిన ఎల్‌డిసిఇకి సంబంధించిన రెండు నోటిఫికేషన్లను కూడా తాజాగా రద్దు చేస్తూ సంబంధిత ఉన్నతాధికారులు గురువారం (నెంబర్: ఎస్‌సిఆర్/పి-ఎన్ సి/సిసిటిసి/ఎల్‌డిసిఇ 16 2/3 శాతం/సిసిటిఎస్ 10శాతం/2024 13-03-2025)ఉత్తర్వులు జారీ చేశారు.

14-3P□g7exHMNWJQE.qxd:14-3P□g7exHMNWJQE.qxd 01/01/01 9:33 AM Page 1



## బిఆర్ఎస్‌కు అహంకారం తగ్గలేదు

### పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** బిఆర్ఎస్‌కు ఇంకా అహంకారం తగ్గలేదని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి లేదని అన్నారు. అసెంబ్లీలో లాబీలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేస్తూ బిఆర్ఎస్‌కు దళిత స్పీకర్‌పై గౌరవం లేదని, దళిత స్పీకర్ కాబట్టే నువ్వు అంటూ సంబోధిస్తున్నారన్నారు. దళిత స్పీకర్ కాబట్టే ఏకవచంతో పిలుస్తున్నారన్న ఆమె.. గతంలో గవర్నర్‌గా నంసింహన్ ఉన్నప్పుడు ఆయన కాళ్లు మొక్కేవాళ్లని గుర్తు చేశారు. ఆ పార్టీ నాయకులకు మహిళా గవర్నర్ అన్నా, ఆదివాసీ రాష్ట్రపతి అంటే గౌరవం లేదని మంత్రి సీతక్క అన్నారు.

## సమాధానాలు చెబుతుంటే బిఆర్ఎస్ రన్నింగ్ కామెంట్రీ సరికాదు

### మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** శాసన మండలిలో బిఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తనపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికార పార్టీ నుంచి తాము సమాధానం చెప్తుంటే రన్నింగ్ కామెంట్రీ చేయడంపై మంత్రి తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. సభా సంప్రదాయాలు, పద్ధతులు నియమాలను పాటించాలని బిఆర్ఎస్ శాసన మండలి సభ్యులకు సురేఖ హితవు పలికారు. రేషన్ కార్డుల మీద బిఆర్ఎస్ పార్టీకి ప్రశ్నించే అర్హత ఉందా అని ఆమె ప్రశ్నించారు. అసలు వాళ్లు పదేళ్లు అధికారంలో ఉన్నపుడు రేషన్‌కార్డులు ఎందుకు ఇవ్వలేదో జవాబు చెప్పాలని మంత్రి సురేఖ నిలదీశారు.

## పంచాయతీల్లో బ్రాంచి పోస్టాఫీసులకు వసతి కల్పించండి

### సచివాలయంలో సిఎస్‌ను కలిసిన పోస్టుమాస్టర్ జనరల్ పివిఎస్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** తెలంగాణలోని 32 జిల్లాలలో బ్రాంచిపోస్టాఫీసులకు గ్రామపంచాయతీ భవనాల్లో వసతి కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం సహకారం అందించాలని తెలంగాణ సర్కిల్ పోస్టుమాస్టర్ జనరల్ పివిఎస్ రెడ్డి చీఫ్‌సెక్రటరీ ఎ.శాంతికుమారిని అభ్యర్థించారు. గురువారం బిఆర్‌అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన చీఫ్‌సెక్రటరీ శాంతి కుమారిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ వ్యాప్తంగా 32 జిల్లాలో 24.56 లక్షల గ్రామీణులకు సామాజిక భద్రత పెన్షన్‌లు అందించామని వివరించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రైతుల నుంచి సేకరించిన పత్తికి మద్దతుధరను రూ 926.36కోట్ల మేరకు రైతులకు చెల్లించామని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద 516.12కోట్లరూపాయలు వేతనాలుగా చెల్లించామని తెలిపారు. పిఎం కిసాన్ యోజనకింద 18.97కోట్లు చెల్లించామని శాంతికుమారికి వివరించారు. కేంద్రప్రభుత్వం, కేంద్రప్రభుత్వరంగ సంస్థలు కేవలం సమాచారా అనుసంధాన కర్తలుగాకాకుండాఆర్థికపరమైన లావాదేవిలు పోస్టాఫీసులతో జరుపుతుండటంతో ప్రజలకు పోస్టాఫీసు సేవలు నానాటి పెరుగుతున్నాయని అందువల్ల బ్రాంచి పోస్టాఫీసులను సురక్షితమైన ప్రాంతాల్లో , ప్రజల మధ్య ఉండటానికి వీలుగా గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసుకోవడానికి అవకాశాలు కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌లకు ఈ విషయమై చొరవతీసుకోవడానికి వీలుగా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు.

## గవర్నర్ ప్రసంగంపై ఆరంభమైన చర్చ

### మొదటిరోజు మాట్లాడిన ఆరుగురు సభ్యులు

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమైన సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం శాసనమండలిలో చర్చ ప్రారంభమైంది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన చర్చ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. మొదటి రోజు చర్చలో ఆరుగురు సభ్యులు పాల్గొన్నారు. తీర్మానాన్ని కాంగ్రెస్ సభ్యులు జీవన్‌రెడ్డి ప్రవేశ పెట్టగా.. మరో సభ్యుడు మహేష్‌కుమార్‌గౌడ్ బలపరిచారు. జీవన్‌రెడ్డి మాట్లడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన రైతు భరోసాను పంటకు రూ. 5వేల నుంచి రూ. 6వేలకి పెంచి అందజేస్తున్నామని తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో కేవలం ఉప ఎన్నికలు వచ్చినప్పుడు తప్పితే మిగిలిన సమయంలో కొత్త రేషన్ కార్డులను ఇవ్వలేదనగా బిఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమయంలో మంత్రి కొండా సరేఖ కలుగజేసుకోవడంతో.. ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యులు అడ్డుపడ్డారు.. దీంతో ఇటువ మంత్రి.. అటు బిఆర్ఎస్ సభ్యుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ, పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ రాష్ట్రంలో కుల గణన స్వాతంత్ర్యం కంటే ముందు జరిగిందని.. ఆ తరువాత ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. దేశంలో కులగణన చేసిన రాష్ట్రంగా నిలవడం గర్వకారణంగా ఉందన్నారు. బిఆర్ఎస్ సభ్యుడు శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాల నియామకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, బిఆర్ఎస్ సభ్యుడు తాతా మధు, కాంగ్రెస్ నుంచి బహిష్కరించబడిన తీన్మార్ మల్లన్న సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో పాల్గొన్నారు. ఉద్యోగ నియామకాలపై ఎమ్మెల్సీ తాత మధుకి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటరిచ్చారు. 10 సంవత్సరాలు పరిపాలించారు.. నోటిఫికేషన్ లు వేసి పేపర్ లీక్‌లు చేసి మళ్ళీ కోర్టు కేసులకు పోతే లాభం ఏముందని ప్రశ్నించారు. మీకు ఉద్యోగాలు నింపాలి అని తెలంగాణ ఉద్యమంలో అదే ప్రధాన డిమాండ్ అంటే ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మీ పార్టీ నేతలకు ఉద్యోగాలు పోతే ఆరు నెలల్లో రాజకీయ ఉద్యోగాలు పొందారు.. అదే ఉద్యోగ నియామకాలపై ఎందుకు శ్రద్ధ పెట్టలేదని ప్రశ్నించారు. 10 ఏళ్లలో ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ అయినా పడిందా అన్నారు. 10 సంవత్సరాల్లో ఒకే ఒక్క డీఎస్సీ మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. 10 సంవత్సరాల్లో విద్యా వ్యవస్థ మొత్తం నిర్వీర్యం చేశారని.. 2 లక్షల 32 వేల ఖాళీలు ఉన్నాయని చెప్పి 10 సంవత్సరాల్లో ఎన్ని ఉద్యోగాలు నియమించారని ప్రశ్నించారు. నోటిఫికేషన్ ప్రాసెస్ నుంచి..కోర్టుల్లో ఎన్ని లిటిగేషన్‌లో ఉన్నవి.. అన్నిటినీ మేము సాల్వ్ చేశామన్నారు. కుటుంబాలతో సమేతంగా పిలిచి నియామక పత్రలు ఇచ్చామన్నారు.

**ప్రజాపాలన ప్రభుత్వంలో ఉద్యోగ నియామకాలు చేపట్టాం..**

నోటిఫికేషన్‌లు ఇస్తే ఉద్యోగాలు ఇచ్చినట్టేనా అని ప్రశ్నించిన మంత్రి పొన్నం.. పూర్తిగా నియామకాలు చేపట్టినప్పుడే .. ఉద్యోగాలు ఇచ్చినట్టన్నారు. మీరు నోటిఫికేషన్లు ఇస్తే మేము ఏమైనా కోర్టుకు పోయామా? ఇష్యూస్ క్రియేట్ చేస్తే మేము సాల్వ్ చేసి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కుల గణన, బిసి రిజర్వేషన్లపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకి మంత్రి పొన్నం ప్రభాకార్ సమాధానమిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి 150 ఇళ్లను ఒక యూనిట్‌గా తీసుకొని ఆ 150 ఇళ్లకు ఒక ఎన్యుమరెటర్‌ని ..10 మంది ఎన్యుమరెటర్లకు ఒక పరిశిలకుడిని పెట్టి వికేంద్రీకరణ ద్వారా శిక్షణ ఇచ్చి ప్రశ్నావళి ఇచ్చి సమాచారాన్ని సేకరించడం జరిగిందన్నారు. స్వచ్ఛందంగా తెలంగాణ సమాజం సమాచారం ఇచ్చిందని.. అందుకు సంబంధించి ప్రభుత్వం దగ్గర డేటా ఉంది.. ప్రభుత్వం డేటా దాచడం లేదన్నారు. సమాచారాన్ని ప్రభుత్వం అధికారికంగా శాసన సభలో లెక్కల ద్వారా చూపెడుతుందన్నారు. ఈ నెల 18న చట్టం చేస్తున్నామని తెలిపారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం 18వ తేదీకి వాయిదా

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 13, ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో ప్రతిమంగళవారం, శుక్రవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తారు. అయితే ఈ నెల 14వ తేదీ(శుక్రవారం)న నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని హోలీ పండుగ సందర్భంగా మార్చి 18కి వాయిదా వేసినట్లు స్టేట్ మోడల్ అధికారి దివ్య తెలియజేసారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించి ఈ నెల 14న శుక్రవారం కాకుండా ఈ నెల 18న మంగళవారం రోజున ప్రజావాణి కార్య క్రమానికి హాజరు కావాలని స్టేట్ మోడల్ అధికారి తెలియజేసారు.

## విద్యారంగంపై ప్రత్యేకంగా చర్చిద్దాం

### శాసన మండలిలో ప్రతిపాదించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** గురు వారం నుంచి ప్రారంభమైన బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. శాసనమండలిలో బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ప్రతిపాదన చేశారు. అందరూ సభ్యులు అంగీకరిస్తే ప్రత్యేకంగా విద్యారంగంపై చర్చించి.. తెలంగాణ రాష్ట్రంలో నూతన విద్యావిధానాన్ని తీసుకు రావడానికి బాటలు వేద్దామని ప్రతిపాదించారు. అందుకు సభలోని అన్ని పార్టీల సభ్యులు అంగీకారం తెలపగా.. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ కూడా సమర్థించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో మార్పులు తేవడానికి గతంలో విజ్ఞప్తి చేశామని..ఫీల్డ్ లో చూస్తే బాధ కలుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. స్కూల్స్‌కి 10 ఎకరాల స్థలం ఉంది, తరగతి గదులు ఉండి, మంచి జీతాలు ఇచ్చి, ఇన్ఫ్రాస్ట్రక్టర్ ఉండి, ఉపాధ్యాయులు చదువు చెప్పగలిగే సామర్థం ఉండి విద్యార్థులు లేక వాటి వాతావరణం మార్చడానికి పెద్దల సభ నుండి ఒక మార్పు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులు లేక సమస్య వస్తుందని.. మా దగ్గర చిగురు మామిడి మండలం నవాబ్ పేట అనే గ్రామంలో 50 మంది విద్యార్థులకు 10 మంది ఉపాధ్యాయులు ఉన్నారని గుర్తు చేశారు. ఇందుకు టీచర్లను తప్పు పట్టడం లేదని.. ఆ గ్రామానికి 10 స్కూల్ బస్సులు వస్తున్నాయన్నారు.

మొన్న బస్వాపూర్ గ్రామంలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభానికి వెళ్లాం అక్కడ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం అంటేనే నామోషిగా ఫీల్ అవుతున్నారన్నారు. గతంలో కరీంనగర్‌లో 4 హై స్కూల్స్ ఉండేవని.. ఇప్పుడు స్కూల్స్ పెరిగాయాన్నరు. . ఉపాధ్యాయులు పెరిగారు.. కానీ విద్యార్థుల సంఖ్య పెరగడం లేదన్నారు. బుధవారం రవీంద్ర భారతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ .. ప్రైవేట్ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్య.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయుల సంఖ్య ఎంత ఆరా తీయండి అని చెప్పారని మంత్రి పొన్నం గుర్తు చేశారు. ఉపాధ్యాయ నియామకాలు పెరిగినా.. జీతాలు పెరిగిన విద్యార్థుల సంఖ్య పెరగడం లేదన్నారు. విద్యా వ్యవస్థ పట్ల మంచి సిస్టం రావాలని.. ఎడ్యుకేషన్ సిస్టంతోపాటు.. అక్షరాస్యత ఇతర రాష్ట్రాల్లో ని కేరళలో బాగుందని.. దీంతో అక్కడి మనుషుల్లో మార్పు వచ్చిందన్నారు. ఎడ్యుకేషన్ సిస్టం బాగుంటేనే వ్యవస్థ బాగుంటుందన్నారు. ప్రైమరీ ఎడ్యుకేషన్ విద్యార్థులకు బాగా అందాలని.. ఇందుకోసం విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ కొన్ని సూచనలు చేశారని తెలిపారు. మండలనికి ఒక స్కూల్,. బస్ సిస్టం ప్లాన్ చేస్తున్నారని చెప్పారు. తాను విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచి విద్యా వ్యవస్థ మారాలని కోరుకున్నానని.. రాబోయే కాలంలో విద్య వ్యవస్థకు సంబంధించి అందరి ఆమోదయోగ్యమైన ఎడ్యుకేషన్ సిస్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి, బిఆర్ఎస్ రాజకీయ పార్టీలకు అతీతంగా ఒక నిర్ణయం తీసుకోవాలని.. ఎడ్యుకేషన్ సిస్టం మీద ఒక నిర్ణయం తీసుకోవాలని.. చిన్న పిల్లల చదువుకు రాజకీయాలకు సంబంధం లేదన్నారు.

## శాసనమండలిలో పలువురి ప్రత్యేక ప్రస్తావనలు

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభం కాగా.. గురువారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనమండలి సభల్లోనూ చర్చ ప్రారంభమైంది. గురువారం శాసనమండలి సమావేశాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాయి. సమావేశాలు ప్రారంభం కాగానే ప్రత్యేక ప్రస్తావనలు(స్పెషల్ మెన్షన్స్)కి అవ కాశం కల్పిస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రత్యేక ప్రస్తావన చేస్తూ.. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు పెంచాలని కోరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా ఇంకా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానం కొనసాగడం బాధకరంగా ఉందన్నారు. బిఆర్ఎస్ సభ్యురాలు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రాష్ట్రంలోని అంగన్ వాడీలకు వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి నెల 13 వ తారీఖు వచ్చినా ఇప్పటికీ వారికి వేతనాలను చెల్లించలేదని.. వెంటనే వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పెషల్ మెన్షన్ చేస్తూ.. రాష్ట్రం లో ఓవర్ సీస్ విద్యా స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న వారం దరికీ వెంటనే నిధులు మంజూరు చేసేలా చూడాలన్నారు. అలాగే రాష్ట్రం లోని ఆటో డ్రైవర్లకు రూ. 12000 చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని కోరారు. డిప్యూటీ ఛైర్మనన బండ ప్రకాష్ ప్రత్యేక ప్రస్తావన సంద ర్భంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ మ్యూజియంలను ఏర్పాటు చేయా లని.. హెరిటేజ్ భవనాలను రక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ మృతికి మండలి సంతాపం**

అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి సభ్యులుగా పనిచేసిన ఆర్ సత్యనారాయణ మృతికి మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించాలని సభ్యులకు సూచించారు. మౌనంపాటించి మాజీ ఎమ్మెల్సీకి సభ నివాళులర్పించింది.

## నాణ్యమైన వస్తువులు వినియోగదారుల హక్కు

### రాష్ట్ర ప్రివెంటివ్ డిటెన్షన్ సలహా బోర్డు ఛైర్మన్ జైస్వాల్

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** బ్యూరో ఆఫ్ ఇండియన్ బిజినెస్ స్టాండర్డ్స్(బిఐఎస్) ఆద్వర్యంలో గురువారం లాలాపేటలోని జిహెచ్ఎంసి స్టేడియంలో కన్స్యూమర్ కార్నివాల్ జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రివెంటివ్ డిటెన్షన్ సలహా బోర్డు ఛైర్మన్ ఎం ఎస్‌కే జైస్వాల్, రాష్ట్ర ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులను పొందడం వినియోగదారులు హక్కని, వాటికి భంగం కలిగితే న్యాయ స్థానాలను ఆశ్రయించి వాటిని పొంద వచ్చన్నారు. వినియోగ దారులు తాము కోనుగోలు చేసే వస్తువులకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుకోవాలని తద్వారా నాణ్యమైన వస్తువులను పొందచ్చన్నారు. వినియోదారులు వారి హక్కులను తెలిపి వారిని చైతన్య పరిచే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వహకులను వారు ప్రత్యేకంగా అభినందిం చారు. వినియో గదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సుమారు 300 మంది రెసిడెంట్ సంక్షేమ సంఘం (ఆర్‌డబ్ల్యూఏ) సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లోవినియోగదారులకు తమ హక్కుల పట్ల అవగాహన కల్పిచేందుకు ఏర్పాటు చేసిన స్మార్ట్ సెల్ఫీ స్టాండ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



## హైదరాబాద్‌కు చెందిన 20 లక్షల కోట్ల సంపద వెయ్యి మంది చేతిలో బందీ!

### గత ప్రభుత్వ అవినీతి మూలాలు గవర్నర్ ప్రసంగం స్పృశిస్తే బాగుండేది

### పదేళ్లలో గవర్నర్‌ను అవమానించేలా వ్యవహరించారు : వేముల వీరేశం

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్‌కు చెందిన 20 లక్షల కోట్ల సంపద వెయ్యి మంది చేతిలో బందీ అయిందని, గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ఆర్థిక విధ్వంసం, ఆర్థిక అసమానతలు పెరిగాయని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శాసనసభలో గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రతిపాదించగా ఎమ్మెల్యే వేముల వీరేశం బలపరుస్తూ మాట్లాడారు. గవర్నర్ చావుడప్పు కొడుతాడను కుంటే డిజె వాయించారని కెటిఆర్ అహంకారపూరితంగా మాట్లాడారని విమర్శించారు. 15 నెలలో అరవైవేల మంది యువతకు ఉపాధి కల్పించిన ఈ ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్లు వేసేది వాళ్ల మనషులతోనే, అలాగే కేసులు వేయించో పేపర్ లీక్ చేయించో నియామకాలు జాప్యం చేసేలా కుట్రలు చేసేదని వారే అన్నారు. గత ప్రభుత్వ అవినీతి మూలాలు గవర్నర్ ప్రసంగం స్పృశించి ఉండాల్సిందని, తెలంగాణను దోచుకొని మహారాష్ట్ర, పంజాబ్, తదితర రాష్ట్రాల్లో పంపిణీచేసి ఆర్థిక విధ్వంసానికి గత పాలకులు పాల్పడ్డారని వేముల వీరేశం అన్నారు.

పదేళ్లలో గవర్నర్‌ను అవమానించేలా గత పాలకులు వ్యవహరించారని అన్నారు. గతంలో గవర్నర్ ప్రసంగం లేకుండా బడ్జెట్ సమావేశాలు నిర్వహించారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గవర్నర్ ప్రసంగం వినలేని ప్రతిపక్షం రాష్ట్రానికి అవసరమా అని ప్రజలు అనుకుంటున్నారు.

గవర్నర్ ప్రసంగం విన్న తర్వాత సూచనలు, సలహాలు ఇవ్వాలి కానీ అధికారం, పదవి కోల్పోయి భావదారిద్ర్యంతో ప్రతిపక్షం ఉందని ఆయన విమర్శిం చారు. రాష్ట్రాన్ని అర్థిక సంక్షోభం నుంచి బయటపడేసి కాంగ్రెస్ ప్రజలకు సంక్షేమం అందిస్తోందని అన్నారు. గతంలో ఓటు బ్యాంకు కోసం సంబంధించిన పథకాలే తీసుకువచ్చారు. తెలంగాణ దిశ, దశ మార్చేలా ఒక్క పథకాన్ని తీసుకురాలేదని ఆయన అన్నారు. దక్షిణ తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులను ఎండిబెట్టి వివక్ష చూపించారు. గతంలో దక్షిణ తెలంగాణలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు అని ఆయన ఆరోపించారు.

గ్రూప్ 1 ఫలితాలు త్వరగా ఇస్తున్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అని తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా నిలిపింది కాంగ్రెస్ పార్టీయేనే అని దానిని విజయతీరాలకు చేరించి కూడా కాంగ్రెస్‌అని ఆయన అన్నారు. ఆర్థిక విధ్వంసం జరిగినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి కృషి చేస్తున్నారని అన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహం చూస్తే బిఆర్ఎస్ నాయకులు భయపడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి వారు నిద్రపోవడం లేదని అన్నారు.

## హామీలపై ప్రశ్నిస్తే రాద్ధాంతం చేస్తున్నారు



### బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** హామీలు అమలు చేయడం లేదని ప్రస్తావిస్తే.. రాద్ధాంతం చేస్తూ సభను నిలిపివేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కావడం లేదని.. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా మహిళలకు రూ.2500, నిరుద్యోగులకు రూ.4000 ఇస్తామని ఇవ్వడం లేదని.. హామీలు అమలు చేయడం లేదంటూ జగదీశ్‌రెడ్డి సభలో ప్రస్తావించారన్నారు. తాము మాట్లాడిన దాంట్లో తప్పు లేకపోయినా స్పీకర్ ఎదుట హుందాగా విచారం వ్యక్తం చేసి సభను నడిపేలా చూడాలని సూచించారన్నారు. తప్పు చేయకున్నా స్పీకర్‌కి క్షమాపణలు చెప్పి సభను నడిచేలా చూడాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఏమీ లేకున్నా ఏదో జరిగినట్లు నాలుగు గంటల సభ వాయిదా వేశారని జగదీశ్ రెడ్డి వ్యాఖ్యలపై రికార్డులను అఖిలపక్షాన్ని పిలిచి పరిశీలించాలన్నారు.

**కెసిఆర్‌కు క్షమాపణ చెప్పాల్సిందే: గంగుల**

2009 నుంచి నేను అసెంబ్లీలో ఉన్నా.. వైఎస్ఆర్, చంద్రబాబు, రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి, కేసీఆర్ లాంటి సీఎంలను చూశాను. కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి లాగా చూస్తున్నడు. కానీ మేము తెలంగాణ తెచ్చిన గొప్ప వ్యక్తిగా చూస్తున్నాం. కేసీఆర్‌ను చావాలని కోరుకుంటావా? రేవంత్ రెడ్డిని ఒక వ్యక్తిగా చూడలేదు. రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాల్సి అంటూ మాజీ మంత్రి గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.

**నీళ్లు ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి**

పంటలు ఎండిపోతుంటే కనీసం నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో వచ్చిన కరెంటు, రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ మీద ఉన్న కక్ష్యతోనే పంటలను ప్రభుత్వం ఎండబెడు తుందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరును ప్రజలు చూస్తున్నారన్నారు. సిగ్గు శరం లేకుండా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి విమర్శిస్తున్నారని సభా ప్రతిపక్ష నేత చావు కోరుతున్నారన్నారు. రైతులకు రైతుబంధు రాలేదని, రుణమాఫీ కాలేదని నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయని ఒక జర్నలిస్టుకు ఇంటర్వ్యూ ఇస్తే ఆ జర్నలిస్టును బెయిల్ రాకుండా కేసులు పెట్టి జైలుకు పంపించారని.. ఇది ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు.

**సిఎం మాట్లాడే భాషా అది?:**

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**

గత 15 నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష అభ్యంతరకరంగా ఉంది. ఆయన కేసీఆర్‌ను. కేసీఆర్ కుటుంబాన్ని ఎలా తిట్టాలని చూస్తున్నారు. పండబెట్టి తొక్కుత. లాగుల తొండలు విడుస్త... అంటూ గతంలో మాట్లాడిండు. ఇప్పుడేమో కేసీఆర్‌ను మార్చురీకి పంపిస్త అంటున్నడు.ఇది సిఎంమాట్లాడే భాషనేనా? కచ్చితంగా క్షమాపణ చెప్పాలి సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

**సిఎం కుర్చీని అవమనించేలా హరీశ్‌రావు మాటలు: విప్ బీర్ల ఐలయ్య**

హరీష్ రావు ముఖ్యమంత్రి కుర్చీని అగౌరవపరిచే విధంగా మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మండి పడ్డారు.. 'నిన్న గవర్నర్ ప్రసంగం అడ్డుకునే ప్రయత్నం చేశారు . వీళ్ల తీరును తెలంగాణ ప్రజానీకం గమనిస్తుంది. బీఆర్ఎస్ వాళ్లు ప్రజాప్రతినిధుల్లా కాకుండా పందికొక్కుల్లా వ్యవహరిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే ఆదరణ చూసి ఓర్వలేక చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. ఈరోజు రాష్ట్రం దివాలా తీయడానికి కారణం మీ మామ అల్లుళ్లు. సిగ్గులేకుండా ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నార' బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు..



**హరీశ్‌రావు హద్దు మీరొద్దు : ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**

హరీశ్‌రావు తమ నాయకుడిపై హద్దు మీరి మాట్లాడుతున్నారని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ నాయకులు చూస్తూ ఊరుకోరని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ఫైర్ అయ్యారు. ప్రజల పక్షాన నిలబడుతున్న నాయకత్వాన్ని విమర్శిస్తే ఊరుకోం' అని అది శ్రీనివాస్ పేర్కొన్నారు



**నిండు సభలో దళితులకు అవమానం : కాంగ్రెస్ ఎమ్మెల్యే వినోద్**

అంబేద్కర్ అంటరాని తనం ఉండొద్దు అనుకునేవారు. 20వ శతాబ్దంలో కూడా అంటరానితనం ఉంది అనడానికి బిఆర్ఎఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి మాటలే నిదర్శనమని, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి దళితులను అవమానించారని వినోద్‌కుమార్ మండిపడ్డారు. జగదీశ్వర్‌రెడ్డి స్పీకర్‌ని ఏకవచనంతో సంభోదిస్తూ మాట్లాడుతున్నారు. ఆయన భాష దొరల పోకడ కనిపిస్తోందని మట్ట రాగమయి పేర్కొన్నారు.

**తిట్టుకుంటూ టైంవేస్ట్ చేస్తున్నారు**

**బిజెపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ పాయల్ శంకర్**


కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కై అసెంబ్లీలో సమయం వృథా చేస్తున్నాయని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయలశంకర్ అన్నారు. పదేండ్ల వ్యవహారాలు చర్చకు రాకుండా బీఆర్ఎస్ భయపడుతుంటే.. 15 నెలల వైఫల్యాలు చర్చించకుండా కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందన్నారు. వీరి తీరు చూస్తే సభ నడవకూడదు అనే ధోరణిలో ఉన్నట్లు కనిపిస్తుందన్నారు. ఒకరికొకరు తిట్టుకుంటూ వారికి వారే సహకారం చేసుకుంటూ సభ టైం వృథా చేస్తున్నారన్నారని పాయల్ శంకర్ అన్నారు.

## ఆ నలుగురు చేసిన అప్పల వల్లే ఆర్థికంగా కుదేలు

### పదేళ్ల విధ్వంసం నుంచి ఇప్పడిప్పడే తేరుకొంటున్న రాష్ట్రం

### గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** ఆ నలుగురు తీసుకొచ్చిన అప్పులతో అక్రమాలు చేసి తెలంగాణను ఆర్థికంగా కుదేలు చేశారని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ఏడు లక్షల కోట్ల అప్పుల భారం గత ప్రభుత్వం పెట్టిందని ఆయన ఆవేదన చెందారు. రాష్ట్రంలో ప్రతికూల ఆర్థిక వాతావరణం ఉన్నా రైతులకు రుణమాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వానిదని ఆయన అన్నారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే వేగంగా జరిగాయంటే ఇప్పుడు మళ్లీ రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రాజెక్టులు వేగంగా ముందుకెళ్తున్నాయని అన్నారు.సన్న వడ్లు పండించిన వారికి రూ.500 బోనస్ ఇస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మెదటిరోజు నుంచే కూలిపోవాలని బిఆర్ఎస్ కుట్ర చేస్తోంది. కానీ మేం అధికారం కోసం కాకుండా మహిళలు ఆర్థికంగా స్థిరంగా ఉండేందుకు వివిధ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. మహిళలు 149.63 కోట్ల సార్లు బస్సుల్లో ఈ 15నెలల కాలంలో ప్రయాణించి రూ. 5,006 కోట్లు ఆదా చేసు కున్నారని గవర్నర్ ప్రసంగంలో పేర్కొనడం సంతోష దాయకమని అన్నారు. రైతుల సమస్యలకు రైతుబంధు ఒక్కటే సర్వరోగనివారిణిగా చూపేవారని మేం అధికారం లోకి వచ్చాక రైతు కూలీలకు కూడా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఇది గవర్నర్ తన ప్రసంగంలో వ్యక్తీకరించడం హర్షణీయమని చెప్పారు.



తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బాగాలేకపోయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజుకు 18గంటలు పనిచేస్తుండటంతో అన్ని రంగాల్లో మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా విద్యాశాఖలో సమగ్రంగా మార్పులు వస్తున్నాయి. గత ప్రభుత్వ పాలనలో గురుకులాలను పట్టించుకోలేదు. కానీ 11వేల కోట్లతో 55 నియోజకవర్గాలలో గురుకులాలను పటిష్టం చేస్తున్నారని తెలిపారు. చేనేత కార్మికులకు రుణమాఫీ చేసిన ఘనతప్రభుత్వానిది అని ఆయన చెప్పారు. గంజాయిరహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం నిరుపేదల భూములు మాయం చేసిందని ధరణిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కమీషన్లు తీసుకుంటున్నామని మాపై ఆరోపణలు చేస్తున్నారు. కెసిఆర్ రాష్ట్రానికి ఆర్థికంగా కేన్సర్ ఇచ్చారని, అది రోజురోజుకు బలపడుతోందని అన్నారు. కమీషన్ కాకతీయ కమీషన్ భగీరథ వారి హయంలోనే ఉన్నాయని అయితే మా ప్రభుత్వంపై అబాండాలు వేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. నిజానికి కమీషన్ కల్వకుంట్ల కుటుంబం అని చెప్పేందుకు వెనకడుగు వేసేది లేదని విమర్శలు చేశారు.

**తొలి పదేళ్లలో తెలంగాణకు చీకటి యుగం**

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అప్పులు, అవినీతి, అక్రమాల్లో నంబర్‌వన్. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో వ్యవ సాయంలో నంబర్ వన్, రైతుల సంక్షేమంలో నంబర్ వన్. ఉద్యోగుల నియామకాలు, పరిశ్రమ పెట్టుబడుల్లో నంబర్ వన్ రాష్ట్రం. రైజింగ్ తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ముందుకెళ్తోందని వివరించారు.



# మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో.. ఇండ్, స్వీడన్ ద్వయం జోరు

**న్యూఢిల్లీ:** తమ కెరీర్లో ఆడుతున్న తొలి మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో ఇండియా, స్వీడన్ జోడీ జోరు కొనసాగుతోంది. ఇండియన్ వెల్స్ మాస్టర్స్-1000 సిరీస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్ యూకీ బాంబ్రీ-ఆండ్రీ గొరాన్సన్ (స్వీడన్) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. కాలిఫోర్నియా వేదికగా జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ-గొరాన్సన్ జంట 6-2, 5-7, 10-5తో సూపర్ టైబ్రేక్స్‌లో రెండో సీడ్, ప్రపంచ మూడో, నా లుగో ర్యాంకుల్లో ఉన్న హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్)-హెలియోవారా (ఫిన్లాండ్)లను బోల్తా కొట్టించింది. 85 నిమిషా లపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-గొరాన్సన్ ఒక ఏస్ సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండు సార్లు బ్రేక్ చేసింది. వాస్తవానికి ఈ టోర్నీలో తమ ర్యాంకింగ్ ప్రకారం యూకీ-గొరాన్సన్లకు క్వాలిఫయింగ్‌తో పాటు, మెయిన్ డ్రాలోనూ చోటు దక్కలేదు. అయితే మెయిన్ డ్రాలో ఉన్న మార్కోస్ గిరోన్-లెర్నర్ టియెన్ (అమెరికా) చివరి నిమిషంలో వైదొలగడంతో రిజర్వ్ పూల్‌లో ఉన్న యూకీ-గొరాన్సన్లకు ఈ టోర్నీలో ఆడే అవకాశం లభించింది. ఇక క్వార్టర్ ఫైనల్ చేరడంతో యూకీ బాంబ్రీ-గొరాన్సన్లకు 65 వేల డాలర్ల (రూ. 56 లక్షల 67 వేలు ప్రైజ్ మనీతో పాటు, 180 ర్యాంకింగ్ పాయింట్లు ఖరారయ్యాయి.

## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..
# టేబుల్ టాపర్‌గా ఢిల్లీ క్యాపిటల్
### ప్లే ఆఫ్స్‌కు గుజరాత్ జెయింట్స్.. ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ ఔట్



**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)-2025లో ఢిల్లీ క్యాపిటల్స్ హ్యాట్రిక్ సాధించి వరుసగా మూడో సీజన్‌లో ఫైనల్‌కు చేరింది. డబ్ల్యూపీఎల్ 2025లో టేబుల్ టాపర్‌గా నిలువడం ద్వారా ఈ ఘనత దక్కించుకుంది. గత రెండు సీజన్లలో ఫైనల్స్‌కు చేరినా ఢిల్లీకి టైటిల్ అందని ద్రాక్షాలానే ఉంది. మెగ్ లాన్నింగ్ సేన ఈసారైనా టైటిల్ నెగ్గుతుందో లేదో అనేది ఆసక్తికరంగా మారింది. ఇక డబ్ల్యూపీల్ ప్రారంభం (2023) నాటి నుంచి అద్భుత విజయాలు సాధిస్తూ వస్తున్న ఢిల్లీ ఫైనల్లో మాత్రం ప్రత్యర్థులకు తలొగ్గుతుంది. ఆ సీజన్ ఫైనల్లో ముంబై ఇండియన్స్ చేతిలో ఓడిన ఢిల్లీ, గత సీజన్ ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు చేతిలో చిత్తైంది. కాగా ప్రస్తుత సీజన్‌లో మెగ్ లాన్నింగ్ నేతృత్వంలోని ఢిల్లీ జట్టు ఆడిన 8 మ్యాచ్‌ల్లో 5 విజయాలు సాధించి టేబుల్ టాపర్‌గా నిలిచి ఫైనల్‌కు చేరింది. టేబుల్ టాపర్ అయ్యే అవకాశాన్ని ముంబై ఇండియన్స్ తృటిలో కోల్పోయింది. చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఢిల్లీ 0.396 రన్ రేట్ కలిగి ఉండగా, ముంబై 0.192 రన్ రేట్‌తో గ్రూప్ దశ ముగించింది. తాజా మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ రాయల్ ఛాలెంజర్స్ చేతిలో ఓడినప్పటికీ రన్ రేట్ ఇంకాస్త పెంచుకుని ఉండినట్లయితే ఫైనల్‌కు చేరేది. అక్కడికిమెరుగైన రన్ రేట్ సాధించేందుకు ముంబై తీవ్రంగా పోరాడింది. తొలుత బ్యాటింగ్ చేసిన బెంగుళూరు 199 పరుగులు చేయగా, ముంబై వేట 188 పరుగుల వద్దే ఆగిపోయింది. ఈ ఎడిషన్‌లో ప్లే ఆఫ్స్‌కు క్వాలిఫై అయిన మరో జట్టు గుజరాత్ జెయింట్స్. గత రెండు సీజన్లలో అట్టడుగు స్థానంలో నిలిచిన గుజరాత్, ఈ సీజన్లో అనూహ్య విజయాలు సాధించి ప్లే ఆఫ్స్ బెర్త్ దక్కించుకుంది. ఈ సీజన్లో గుజరాత్ 8 మ్యాచ్‌లు ఆడగా, అందులో 4 విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. ఇక డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ ఆదిలో అదిరిపోయే విజయాలు సాధించినప్పటికీ ఆ తర్వాత వరుసగా ఐదు ఓటములు ఎదుర్కొని ప్లే ఆఫ్స్ రేస్ నుంచి నిష్క్రమించింది. ఇక ముంబైతో జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో మంచి స్కోర్ చేసి గెలవడంతో బెంగుళూరు నాలుగో స్థానాన్నైనా దక్కించుకోగలిగింది. ఈ మ్యాచ్‌లో ఓడినా లేక నామమాత్రంగా గెలిచినా ఈ సీజన్లో రాయల్ ఛాలెంజర్స్ ఆఖరి స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఈ సీజన్లో ఆ జట్టు ఎనిమిదింట మూడు విజయాలు సాధించింది. యూపీ వారియర్జ్ విషయానికొస్తే ఈ జట్టు గత రెండు సీజన్ల లాగే ఈ సీజన్‌లోనూ నామమాత్రపు ప్రదర్శనలు చేసి ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. యూపీ ఈ సీజన్లో బెంగుళూరు వలె ఆడిన 8 మ్యచ్‌ల్లో 3 గెలిచి చివరి స్థానంలో నిలిచింది. యూపీతో పోలిస్తే రాయల్ ఛాలెంజర్స్ రన్ రేట్ కాస్త మెరుగ్గా ఉంది.





### ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో ఒక్క విజయం లేకుండానే
# ముగిసిన ఇంగ్లండ్
### ఆస్ట్రేలియా చేతిలో 3 వికెట్ల తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ ఆరంభ ఎడిషన్‌ను (2025) ఇంగ్లండ్ మాస్టర్స్ ఒక్క విజయం కూడా లేకుండానే ముగించింది. రాయ్‌పూర్‌లోని షాహిద్ వీర్ నారాయణ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 3 వికెట్ల తేడాతో ఓడింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేసి భారీ స్కోర్ చేసినా దాన్ని కాపాడుకోలేకపోయింది. ఆస్ట్రేలియా బ్యాటర్లు మరో 5 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించారు. ఇంగ్లండ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ విధ్వంసకర హాఫ్ సెంచరీ, బౌలింగ్‌లో టిమ్ బ్రేస్నన్ 5 వికెట్ల ఘనత వృధా అయ్యాయి. ఇయాన్ మోర్గాన్ 64, టిమ్ ఆంబ్రోస్ 69 (నాటౌట్), ఫిల్ మస్టర్డ్ 17, డారెన్ మ్యాడీ 29, బ్రేస్నన్ 18 (నాటౌట్) పరుగులు చేయడంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లలో పాట్టిసన్, మెక్గెయిన్, స్టీవ్ ఓకీటీ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయతీరాలకు చేరింది. నాథన్ రియర్డాన్ (83), డేనియల్ క్రిస్టియన్ (61) విధ్వంసకర అర్ధ శతకాలు బాది ఆసీస్‌ను గెలిపించారు. విజయానికి ముందు ఆసీస్ కొద్దిగా తడబడింది. 19 ఓవర్లో బ్రేస్నన్ చెలరేగిపోయి కేవలం 5 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. అయితే అప్పటికే ఆసీస్ గెలుపు ఖరారైపోయింది.
చివరి ఓవర్ రెండో బంతిని వైడ్‌గా వేసిన సైడ్‌బాటమ్ ఆసీస్‌కు విన్నింగ్ రన్‌ను ఇచ్చాడు. ఆసీస్ ఇన్నింగ్స్‌లో షాన్ మార్ష్ 20, బెన్ కట్టింగ్ 12, పీటర్ నెవిల్ 28, కెప్టెన్ షేన్ వాట్సన్ 1 (నాటౌట్) పరుగు చేశారు. ఆఖర్లో పాట్టిసన్, హిల్ఫెన్హాస్ డకౌట్లయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రేస్నెన్ 5, ర్యాంకిన్, పనేసర్ తలో వికెట్ తీశారు. ఈ ఓటమితో ఇంగ్లండ్ ఒక్క విజయం కూడా లేకుండా టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ టోర్నీలో ఇంగ్లండ్ 5 మ్యాచ్‌లు ఆడగా ఐదింట ఓడింది. మరో వైపు ఆసీస్ 5 మ్యాచ్‌ల్లో 3 విజయాలతో సెమీ ఫైనల్‌కు క్వాలిఫై అయ్యింది. మొత్తం 6 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో శ్రీలంక, భారత్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్ సెమీస్కు క్వాలిఫై కాగా, సౌతాఫ్రికా, ఇంగ్లండ్ టోర్నీ నుంచి నిష్క్రమించాయి.

## కోట్లు కురిపించిన హండ్రెడ్ లీగ్ వేలం:
# న్యూజిలాండ్ కెప్టెన్ బ్రేస్‌వెల్‌కు జాక్‌పాట్

**న్యూఢిల్లీ:** హండ్రెడ్ లీగ్-2025 వేలంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ మైఖేల్ బ్రేస్‌వెల్ జాక్‌పాట్ కొట్టాడు. అతనితో పాటు, ఆఫ్ఘనిస్తాన్ యువ స్పిన్నర్ నూర్ అహ్మద్‌ను సైతం భారీ ధరకు కొనుగోలు చేశారు. ఈ ఇద్దరు ఊహించని ధర 2 లక్షల పౌండ్లకు (రూ.2.26 కోట్లు) అమ్ముడుపోయారు. బ్రేస్‌వెల్‌కు గత సీజన్ రన్నరప్ సధరన్ బ్రేవ్ ఫ్రాంచైజీ దక్కించుకోగా, నూర్ అహ్మద్‌ను మాంచెస్టర్ ఒరిజినల్స్ ఫ్రాంచైజీ సొంతం చేసుకుంది. బ్రేస్‌వెల్ త్వరలో స్వదేశంలో పాకిస్తాన్‌తో జరుగబోయే టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈసారి ఈ డ్రాఫ్ట్‌లో (వేలం) బ్రేస్‌వెల్, నూర్ అహ్మద్‌తో పాటు, మరో ఇద్దరు ఇంగ్లండ్ ఆటగాళ్లు కూడా 2 లక్షల పౌండ్లకు (రూ.2.26 కోట్లు) అమ్ముడుపోయారు. ఆల్‌రౌండర్ జేమీ ఓవర్టన్‌ను లండన్ స్పిరిట్, మరో ఆల్‌రౌండర్ డేవిడ్ విల్లేను ట్రెంట్ రాకెట్స్ సొంతం చేసుకున్నాయి. ఈ డ్రాఫ్ట్‌లో మరో మేజర్ సైనింగ్ ఆసీస్ వెటరన్ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌ది. గత ఏడాది డ్రాఫ్ట్‌లో అమ్ముడుపోని అతడిని ఈ సారి లండన్ స్పిరిట్ 1.2 లక్షల పౌండ్లకు సొంతం చేసుకుంది. అలాగే న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్, ఛాంపియన్స్ ట్రోఫీ హీరో రచిన్ రవీంద్రను మాంచెస్టర్ ఒరిజినల్స్ ఇదే ధరకు 1.2 లక్షల పౌండ్లు (రూ.1.35 కోట్లు) దక్కించుకుంది. ఈ సారి డ్రాఫ్ట్‌కు అందుబాటులో ఉండిన ఇంగ్లండ్ మాజీ పేసర్ జేమ్స్ ఆండర్సన్‌కు చుక్కెదురైంది. ఆండర్సన్‌ను వేలంలో ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. ఇక మహిళల వేలం విషయానికొస్తే న్యూజిలాండ్ ప్లేయర్ సోఫి డివైన్, జార్జియా వాల్, పెయిజ్ స్కోల్ ఫీల్డ్ మంచి ధరలు దక్కించుకున్నారు. పురుషులు, మహిళల డ్రాఫ్ట్‌లో మొత్తం 66 మంది ప్లేయర్లు అమ్ముడుపోయారు.


# ఇంగ్లండ్ బ్యాడ్మింటన్‌లో సింధు ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు భారీ షాక్ తగిలింది. గాయం తర్వాత కోలుకుని బరిలోకి దిగిన ఈ డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించి నిరాశపరిచింది. బర్మింగ్‌హామ్‌లో జరిగిన మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో సింధు 21-19, 13-21, 13-21తో కొరియా అమ్మాయి కిమ్ గ యున్ చేతిలో ఓటమిపాలైంది. తొలి గేమ్‌లో 2012తో తిరుగులేని ఆధిక్యంలో ఉన్న సింధు, ఆ తర్వాత కిమ్ అనూహ్య పోరాటంతో వెనుకడుగు వేసింది. తొలి గేమ్ ఆఖర్లో పుంజుకున్న కిమ్ వరుసగా రెండు గేమ్‌లు గెలుచుకుని సింధును ఇంటికి పంపించింది. మిగిలిన మ్యాచ్‌ల విషయానికొస్తే, మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దే రుత్విక-రోహన్ కపూర్ జంట 21-10, 17-21, 24-22తో తైవాన్ జోడీ యీ హాంగ్ వీనికోల్ చన్‌ను మట్టి కరిపించి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి త్రిసా 2117, 2113తో సుంగ్ షువో యున్ చెన్ సు యు (తైవాన్)ను చిత్తు చేశారు. అలాగే పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 2022, 1821తో డానియల్ లడ్‌గార్డ్, మాడ్స్ వెడ్‌గార్డ్ జోడీ చేతిలో ఓటమిపాలైంది. దీంతో లీగ్ దశలోనే సాత్విక్, చిరాగ్ పోరాటం ముగిసినట్లయ్యింది.

## వాణిజ్యం

# క్షీణించిన స్టాక్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు, ఇంట్రాడేలో ఆ లాభాలను కోల్పోయాయి. హోలీ సందర్భంగా శుక్రవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈకి సెలవు కావడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల ఎప్పుడేం జరుగుతోం దోనన్న భయాలు ప్రపంచ మార్కెట్లను వెంటాడుతు న్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా పొజిషన్లు తీసుకొనేందుకు ఇన్వెస్టర్లు ముందుకు రాలేదని అనలి స్టులు చెబుతు న్నారు. దీంతో సెన్సెక్స్ వరు సగా ఐదో రోజు నష్ట పోగా, నిఫ్టీ సైతం 22,400 దిగువన వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిసింది. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలూ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,392.54 పాయింట్ల వద్ద (క్రితం 74,029.76) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,401 వద్ద గరిష్ఠాన్ని తాకింది. తర్వాత అమ్మకాలతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరికి 200.85 పాయింట్ల నష్టంతో 73,828.91 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 73.30 పాయింట్ల నష్టంతో 22,397.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 22 పైసలు బలపడి 87గా ఉంది. సెన్సె 30 సూచీలో జొమాటో, టాటామోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ, సన్‌ఫార్మా, టాటాస్టీల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 70 డాలర్లు, బంగారం ఔన్సు 2953 డాలర్ల వద్ద ట్రేడవుతు న్నాయి.



# పైలట్లకు భారీ డిమాండ్..


**న్యూఢిల్లీ, మార్చి 13:** దేశీయ విమానయాన సంస్థలు తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకుంటున్నందున రాబోయే 15-20 సంవత్సరాలలో భారతదేశానికి 30,000 మంది పైలట్లు అవసరం అవుతుందని పౌర విమానయాన మంత్రి కె రామ్మోహన్ నాయుడు తెలిపారు. దేశీయ విమానయాన సంస్థలు తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకుంటున్నందున 1,700 కంటే ఎక్కువ విమానాలను ఆర్డర్ చేశాయని స్పష్టం చేశారు. దేశంలో విమానయాన పరిశ్రమ కోసం మంత్రిత్వ శాఖ ఒక సమిష్టి విధానంతో పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు. అధికారులు 38 ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్స్‌కు సంబంధించిన వివిధ అంశాలను ధ్రువీకరిస్తున్నారని, అలాగే ఈ సంస్థలకు రేటింగ్ ఇస్తున్నారని వివరించారు. 200 శిక్షణ విమానాల ఆర్డర్ కోసం అవగాహన ఒప్పందం చేసుకునే కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తన అభిప్రాయాలను వెల్లడించారు. భారతీయ విమానయాన సంస్థలు 1,700కు పైగా విమానాలకు ఆర్డర్లు ఇచ్చాయని. ప్రస్తుతం 800కు పైగా



విమానాలు ఉన్నాయని నాయుడు చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఆరు వేల నుంచి ఏడు వేల మంది పైలట్లు పనిచేస్తున్నారని రాబోయే 15 నుంచి 20 సంవత్సరాలలో దేశానికి 30,000 మంది పైలట్లు అవసరమవుతారని స్పష్టం చేశారు. ముఖ్యంగా భారతదేశాన్ని పైలట్స్ శిక్షణా కేంద్రంగా మార్చాలని కూడా యోచిస్తున్నట్లు వివరించారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్లలో భారతదేశం ఒకటిగా ఉందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో విమానాశ్రయాలను వర్గీకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. వీటిలో కార్గో, ఎఫ్‌టీఓల కోసం ప్రత్యేక విమానాశ్రయాలు ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# వచ్చే యేడాది ఐటీ నియామకాలు డబుల్!


**న్యూఢిల్లీ, మార్చి 13:** ఐటీ రంగంలో నూతన నియామకాలు పుంజుకొనే అవకాశం ఉంది. ఏప్రిల్ నుంచి మొదలుకానున్న ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1,50,000మందిని కంపెనీలు నియమించుకొనే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దాదాపు రెట్టింపు నియామకాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని రిక్రూటింగ్ సంస్థ టీమ్‌లీజ్ తన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి ఐటీలో కొత్తగా నియమించుకొనే వారి సంఖ్య 85వేల నుంచి 95 వేలకు చేరే అవకాశం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీని సంఖ్య దాదాపు రెట్టింపు కానుంది. ఇక యాక్సెంచర్, క్యాప్‌జెమిని, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ఐటీసేవల సంస్థలు 1,60,000 నుంచి 1,80,000మంది వరకు ఫ్రెషర్లను నియమించుకొనే అవకాశం ఉందని తెలుస్తోంది. 2024లో పెద్దఎత్తున ఉద్యోగాల కోతలు, నూతన నియామకాలు నెమ్మదించడం వల్ల 280 బిలియన్ డాలర్లకు పైగా ఉన్న ఔట్ సోర్సింగ్ పరిశ్రమ సవాళ్లను ఎదుర్కొంది.




ఇక 2025 ఆర్థిక సంవత్సరంలో ఫ్రెషర్ల నియామకాలు తగ్గినప్పటికీ కొంత మొత్తం ఉద్యోగుల సంఖ్య కాస్త పెరిగింది. అమెరికాఅధ్యక్షుడు చేపడుతున్న సుంకాల ప్రతి పాద నలు, ఆర్థిక అనిశ్చితి విధివిధా నాల కారణంగా సెంటిమెంట్ మరీ దెబ్బతింది. అయితే చాలా కంపెనీలు తమ శ్రామిక శక్తిని, ముఖ్యంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ పరివర్తనలో పాత్రల కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ నైపుణ్యంతో తాజాగా గ్రాడ్యుయే షన్ పూర్తి చేసుకొని వచ్చే వారి నియామకాలు పెరిగే అవకాశం ఉందని టీమ్‌లీజ్ డిజిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నీతి శర్మ అన్నారు.

# ఫ్లిప్‌కార్ట్ కోఫౌండర్ కొత్త కంపెనీ

**ముంబై, మార్చి 13:** ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు బిన్నీ బన్సాల్ ఆసియా అంతటా విభిన్న కంపెనీలు తమ వినియోగదారులను పెంచుకోవడానికి, బ్రాండ్లను విస్తరించడానికి సహాయపడేలా 'ఆప్ట్రా' అనే కొత్త కంపెనీని ప్రారంభించారు. టెక్నాలజీ, సప్లై చైన్ నైపుణ్యం, ఫ్రాంచైజింగ్ భాగస్వామ్యాలను ఉపయోగించుకొని కొత్త మార్కెట్ లోకి ప్రవేశించేటప్పుడు బ్రాండ్లు ఎదుర్కొనే సవాళ్లను అధిగమించేలా ఈ స్టార్టప్ ఆయా కంపెనీలను సర్వీసు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వాల్‌మార్ట్ కొనుగోలుకు ముందు ఫ్లిప్‌కార్ట్‌ను ప్రపంచంలోని ప్రముఖ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ల్లో ఒకటిగా మార్చడంలో బన్సాల్ కీలక పాత్ర పోషించారు. సాంస్కృతిక, నియంత్రణ, మౌలిక సదుపాయాల అవరోధాలతో పోరాడుతున్న బ్రాండ్లకు ప్రస్తుతం బిన్నీ ఆప్ట్రాను ఒక పరిష్కారం గా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. డిజిటల్ సాధనాలు, మాస్టర్ ఫ్రాంచైజ్ అవకాశాలను ఏకకాలంలో అందించడం ద్వారా గ్లోబల్ మార్కెట్‌లోకి ప్రవేశాన్ని సులభతరం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



మొత్తం కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి ఆప్ట్రా ఎఐ ఆధారిత సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. డేటా అనలిటిక్స్, ఆటోమేషన్, సమర్థవంత మైన వ్యూహాలను సమీకృతం చేయడంద్వారా కంపెనీ అంతరాయంలేని మార్కెట్ ను సృష్టించాలని భావిస్తుంది. ఇ-కామర్స్ కార్యకలాపాలను విస్తరించడంలో బన్సాల్ అను భవం కంపెనీ సామర్థ్యాన్ని పెంచ డానికి రోబోటిక్స్, ఆటోమేషన్‌తో కూడిన గ్లోబల్ సప్లై చైన్‌ను నిర్మించడానికి ఎంతో ఉపయోగపడు తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇ-కామర్స్, రిటైల్ రంగాలకు చెందిన అనుభవజ్ఞులైన నిపుణులతో ఆప్ట్రా నాయకత్వ బృందాన్ని సిద్ధం చేసింది. నోకియా, యాపిల్ అమెజాన్ ఇండియాలో మాజీ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసిన రంజిత్ బాబును ఎలక్ట్రానిక్స్ అండ్ జనరల్ మర్కండైజ్ సీఈఓగా నియమించారు. గతంలో లెండింగ్ కార్ట్, ఫ్లిప్‌కార్ట్‌లో పనిచేసిన గిరిధర్ యాసను కంపెనీ టెక్నాలజీ విభాగానికి నేతృత్వం వహించేలా ప్రణాళికలు సిద్ధంచేశారు. సప్లై చైన్ కార్యకలాపాలను ఫ్లిప్‌కార్ట్, స్విగ్గీలో అనుభవం ఉన్న ఆనంద్ రాజ్ పర్యవేక్షిస్తున్నారు. ఎక్స్‌ప్రీరియో, టెర్రాస్పాన్ బ్రాండ్లలో కీలక స్థానాల్లో పని చేసిన పునీత్ ఖన్నా, రాహుల్ గుప్తాలు ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నా రు. ప్రపంచంలోని మొత్తం వినియోగదారుల వృద్ధిలో ఆసియా సుమారు 70శాతం వాటాను కలిగి ఉంది. ఇది ఇ-కామర్స్, మారుతున్న వినియోగ దారుల అలవాట్లకు కీలక మార్కెట్‌గా అవతరిస్తోందని కంపెనీ నమ్ముతుంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps